ISSN : 0971-8729

# యోజన

సంపుటి : 45 సంచిక : 8 అభివృద్ధి మాసపత్రిక జూన్ 2017 ₹ 22

## వెల్లువెత్తుతున్న భారతీయ యువ శక్తి

యువతకు ఆశా కిరణం - తెలంగాణ రాష్ట్రం - టి. పద్మారావు గౌడ్

ఉద్భవిస్తున్న భారతీయ యువశక్తి - ఎ.కె. దూబే

యువతకు ఉద్యోగ కల్పనలో సవాళ్లు - అలఖ్ ఎన్. శర్మ, బల్వంత్ సింగ్ మెహతా

సాధికారతే ఉపాధి అర్హతకు కీలకం - సునీత సంఘీ

ప్రత్యేక వ్యాసం

పారిశ్రామికాభివృద్ధికి అంకుర సంస్థలు

- సౌరభ్ సన్యాల్, డాక్టర్ రంజిత్ మెహతా



విశిష్ట వ్యాసం

యువత ఆరోగ్యంలో యోగ పాత్ర

- డా॥ ఈశ్వర ఎన్ ఆచార్య, డా॥ రాజీవ్ రస్తోగి

యువతరం సాధికారత... యోగా

- డా॥ ఈశ్వర్ వి.బసవారెడ్డి




## స్వచ్ఛభారత్ పిల్లల పుస్తకాల ఆవిష్కరణ

స్వచ్ఛత, పరిశుభ్రత అలవాట్లను చిన్నతనం నుండే మప్పాలని, పిల్లలకు పారిశుధ్యంపై తగిన అవగాహనను కలిగించాలని "బామ్మ చెప్పిన అడవి కథ" పేరుతో నాలుగు సంపుటాల పుస్తకాన్ని కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి వెంకయ్య నాయుడు ఢిల్లీలో ఇటీవల ఆవిష్కరించారు. డా. మధుపంత్ రాసిన ఈ పుస్తకాన్ని 15 భారతీయ భాషలలొ వెలువరించారు. పిల్లలకు ఆసక్తి కలిగించే విధంగా అడవిలోని జంతువులకే పారిశుధ్యంపై అవగాహన కలిగిస్తున్నట్లూ, జంతువులన్నీ కలిసి ఉమ్మడిగా అడవిని పరిశుభ్రం చేసుకున్నట్లు ఉత్సాహభరితంగా ఈ కథను రచించారు డా. పంత్. ప్రతి పాఠశాలలోనూ గ్రంథాలయంలోనూ తప్పక ఉండాల్సిన పిల్లల పుస్తకం. ప్రధానమంత్రి నరేంద్ర మోది తలపెట్టిన స్వచ్ఛ భారత్ అభియాన్‌కు చేయూతనిచ్చే ప్రయత్నం ఇది. ప్రతులకు సంప్రదించండి - సేల్స్ ఎంపోరియం, ఫోన్ 040-27535383.

**జూన్ 2017** ISSN : 0971-8729 **సంపుటి : 45** **సంచిక : 8**

# యోజన

ముఖ్య సంపాదకులు: **దీపికా కచ్చల్**
వరిష్ఠ సంపాదకుడు : **విజయకుమార్ వేదగిరి**
సంపాదకుడు : **మహమ్మద్ సిరాజుద్దీన్**

జాయింట్ డైరెక్టర్ (ప్రొడక్షన్) : **వి.కె. మీనా**

e-mail : yojana_telugu@yahoo.co.in
e-mail : yojana.telugu@nic.in

*ఆనోభద్రా క్రతవోయన్తు విశ్వతః (ఉత్తమ భావాలు అన్నివైపుల నుండి రావాలి)*

## ఈ సంచికలో...


1. ఉద్భవిస్తున్న భారతీయ యువశక్తి 5
 – ఎ.కె. దూబే
2. యువతకు ఉద్యోగ కల్పనలో సవాళ్లు 10
 – అలఖ్ ఎన్. శర్మ, బల్వంత్ సింగ్ మెహతా
3. సాధికారతే ఉపాధి అర్హతకు కీలకం 14
 – సునీత సంఘీ
4. పారిశ్రామికాభివృద్ధికి అంకుర సంస్థలు 18
 – సౌరభ్ సన్యాల్, డాక్టర్ రంజిత్ మెహతా
5. యువత ఆరోగ్యంలో యోగ పాత్ర 23
 – డా॥ ఈశ్వర ఎన్ ఆచార్య, డా॥ రాజీవ్ రస్తోగి
6. యువతకు ఆశా కిరణం – తెలంగాణ రాష్ట్రం 27
 – టి. పద్మారావు గౌడ్
7. విజ్ఞాన విపంచి – ప్రాతూరి పోతయ్య శర్మ 30
8. దర్పణం 33
9. యువత సాధికారికత ..... 34
 – ఐ. హెచ్.జి.ఎన్. ప్రసాద్, డా. కె. సరిత
10. భారత యువత – ఉద్భవిస్తున్న అద్భుత శక్తి 37
 – డా॥ యస్. విజయ్‌కుమార్
11. విశ్వ యవనికపై భారతీయ యువత 40
 – డా॥ శీతల్ శర్మ, భాస్కర్ జ్యోతి
12. అధిక జనాభా ప్రయోజనకరమా? 44
 – దామరాజు వెంకటేశ్వర్లు
13. ఉగ్రవాద ప్రాంతాల్లో యువతకు అవకాశాలు 48
 – రవి పోక్కర్ణ
14. దూర, ఆన్‌లైన్ పారిశ్రామిక నాయకత్వ విద్య 51
 – అమిత్ కుమార్ ద్వివేది
15. యువతరం సాధికారత... యోగా 56
 – డా॥ ఈశ్వర్ వి.బసవారెడ్డి


**ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాల గురించిన సమాచారాన్ని అందజేసేందుకు, తెలుగు, హిందీ, ఇంగ్లీషు, అస్సామి, బెంగాలి, తమిళం, ఉర్దూ, మరాఠీ, గుజరాతీ, మళయాళం, పంజాబీ, కన్నడ, ఒడియా భాషలలో వెలువడుతున్న మాసపత్రిక.**


### యోజన (తెలుగు) చందా వివరాలు

**1 సంవత్సరానికి - రూ. 230/- 2 సంవత్సరాలకు - రూ. 430/- 3 సంవత్సరాలకు - రూ. 610/-**

**మరిన్ని వివరాల కోసం : 040-27546312 /13 / 14 ఈ ఫోన్ నంబర్లకు సంప్రదించండి.**

**చందాను Bharatkosh.gov.in సైట్‌లో Publications Division లింకును క్లిక్ చేసి ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చు :**

ఎడిటర్, **యోజన (తెలుగు),** 205, 2వ అంతస్తు, సి.జి.ఓ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ – 500 080.


యోజన ప్రచురించిన వ్యాసాలలో వ్యక్తపరిచిన భావాలు ఆయా రచయితలవే, వారు పనిచేస్తున్న సంస్థలు, ప్రభుత్వ అభిప్రాయాలను అవి ప్రతిబింబించవు.

యోజనలో ప్రచురించే ప్రకటనలలోని అంశాలు ఆయా సంస్థలు, వారి ప్రతినిధులకు చెందినవి. ప్రకటన పాఠం / సారాంశం మూలంగా ఎదురయ్యే ఎటువంటి పర్యవసానాలకు యోజన బాధ్యత వహించదు.


ISSN : 0971-8729

# యోజన

చీఫ్ ఎడిటర్స్ డెస్క్

## సంపాదకీయం

### మనదేశ ప్రగతి ఆశాకిరణం యువత




యువత జాతి ప్రగతి సంధానకర్తలు. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలన్నీ వృద్ధాప్యంలో మునకలు వేస్తుంటే (అంటే ఆ దేశాలలో అధికశాతం ప్రజలు వృద్ధులవుతుంటే), మనదేశం మాత్రం 2020 నాటికి ప్రపంచంలో అత్యంత యువదేశంగా నిలవనున్నది. అంటే దేశ జనాభాలో దాదాపు 40 శాతంగా ఉండే ఈ యువజనాభా అత్యంత అమూల్య వనరు అని చెప్పవచ్చు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వేత్తలు, ప్రణాళిక కర్తలు ఈ అంశాన్ని ఎలా ఉపయోగించుకోవాలి అనే ఆలోచనలో తలమునకలై ఉన్నారు. జాతి భవిష్యత్తు వారే కనుక యువత నిర్వహించాల్సిన పాత్ర మహత్తరమైనది. వారి సృజనాత్మకత, ఉత్సాహము, శక్తి కలిసి ఏ దేశానికైనా అద్భుత ఫలితాలనివ్వగలవు.

ఇంజనీర్లుగాను, డాక్టర్లుగాను, న్యాయవాదులు, బ్యాంకర్లు, క్రీడాకారులు, వ్యాపారవేత్తలు ఇలా విభిన్న అవతారాలలో దేశాన్ని అన్నిరంగాలలోనూ ముందుకు నడిపించగల సత్తా ఉన్నవాళ్ళు మన యువత. కావలసిందల్లా, వారికి సరైన మార్గదర్శనము, శిక్షణ, వనరుల అందుబాటు అంతే! చిన్నప్పటి నుండి పిల్లలను అత్యంత ప్రేమప్రదమైన వాతావరణంలో పెంచి, మంచి ఆరోగ్యాన్ని, విద్యను అందచేయడం దీనిలో మొదటి అడుగు. విద్య హక్కు చట్టం, 2009 ఈ మార్గంలో మొదటి అడుగు వేసింది. సర్వ శిక్షా అభియాన్, ఈ-పాఠశాల, ఉడాన్ వంటి మరెన్నో కార్యక్రమాలు మార్గాన్ని మరింత సులభతరం చేశాయి. కొండ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాలలో విద్యాసౌకర్యాలు అంతగా అందుబాటులోలేవు. అయితే దూరవిద్య పథకం ఈ సమస్యను కొంతవరకు తీరుస్తున్నది. గ్యాన్ (GIAN), స్వయం (SWAYAM) వంటి పథకాలు, నేషనల్ డిజిటల్ లైబ్రరీ కూడ ఇందుకు సహకరిస్తున్నాయి.

అయితే కేవలం విద్యావంతులైతే చాలదు. వారికి తగిన వృత్తిగత నైపుణ్యాలను కూడ అందచేయాలి. నేటి సాంకేతిక పోటీ ప్రపంచంలో మామూలు స్కూలు చదువు, కాలేజి చదువులు వారికి తగిన ఉపాధిని కల్పించలేవు. అత్యధికమందిని ఉన్నత సాంకేతిక నిపుణులుగా మలచడమే దీనికి పరిష్కారం. ఇందుకోసమే స్కిల్ ఇండియా పథకాన్ని ప్రవేశపెట్టారు. 2022 నాటికి కనీసం 40 కోట్ల మందిని సుశిక్షితులను చేయడం ఈ పథకం లక్ష్యం. మొత్తం మీద లక్ష్యం గిట్టుబాటైన ఉపాధికి యువతను సుశిక్షితులను చేయడమే! ఎటువంటి లక్ష్యం, ఉపాధి లేని యువత సమాజానికి ప్రమాదకరమైన మార్గాలకు మళ్ళవచ్చు. అందుకనే, స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, ముద్ర, సేతు, అటల్ ఇన్నోవేషన్ మిషన్ వంటి అనేక పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. జాతి నిర్మాణానికి మూలస్థంభాలు యువత. దేశ గతిని మార్చాలన్నా, శృతిని మార్చాలన్నా, వారే సమర్థులు.

■

# ఉద్భవిస్తున్న భారతీయ యువశక్తి

- ఎ.కె. దూబే



**సాంఘిక, రాజకీయ లేదా పౌర ఉద్యమాల వ్యూహాల్లో, కార్యాకలాపాల్లో యువతనే కేంద్ర బిందువుగా ఉంటోంది. శాస్త్రీయ, సామాజిక, ఆర్థిక కార్యకలాపాల్లో నిరంతరం జరిగే మార్పులను ఎప్పటికప్పుడు ఆకళింపు చేసుకుని తగిన విధంగా తమను మలచుకునే సామర్థ్యం యువతలో అంతర్లీనంగా ఉండడం వల్లనే అన్ని కార్యక్రమాలలోను యువతకు ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఎంతో ఉంది.**

"చిన్నతంలో పెద్దలపై ఆధారపడటం నుంచి పెద్దరికంలో స్వంతంత్రంగా సమాజంలో సభ్యులుగా ఎలా వ్యవహరించాలో తెలుసుకునే పరివర్తన క్రమమే యువత" అని ఐక్యరాజ్యసమితి విద్యా సాంస్కృతిక వ్యవహారాల సంస్థ నిర్వచించింది. అందువల్ల ఒక వయసు గలిగిన వారే యువత అని ప్రత్యేకంగా వర్గీకరించలేము. ప్రభుత్వం నిర్వహించే ప్రతి కార్యక్రమంలోను యువతనే ఎక్కువ ఉత్సాహంగా పాల్గొంటున్నారని క్రీడలు, యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ 2016-17 సంవత్సరానికి తయారుచేసిన నివేదికలో స్పష్టం చేసింది. ఈ నివేదిక ప్రకారం 2020 నాటికీ భారత దేశంలో నివసిస్తున్న వారిలో నగటు వయసు 28 కాగా చైనా, దక్షిణాసియా, దేశాల్లో సగటు వయసు 38 ఏళ్లవరకు ఉంటుంది. సహజంగా సుమారు 35 ఏళ్లలోపు వయసుగలిగిన వారిలో ఉరకలెత్తే ఉత్సాహంతోపాటు ఆచరణాత్మకమైన క్రియాశీలక ధోరణి ఉంటుంది గనక అలాంటి చిన్న వయసుగలవారు 65 శాతం వరకు ఉన్న భారత దేశాన్నియువదేశంగా పరిగణించవచ్చు. భారత దేశంలో 15 నుంచి 29 ఏళ్ల మధ్య నుండే వారి శాతం మొత్తం జనాభాలో 27.5 శాతం కావడం వల్ల ఇది భవిష్యత్తులో అభివృద్ధికి ఎంతో అనుకూలంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.

సామాజికంగా ప్రయోజనకరమైన ఉత్పత్తికి, నిర్మాణాత్మకమైన పెట్టుబడికి ఇది ఎంతో సానుకూల అంశమని గ్రహించాలి. ఇలాంటి మహత్తర శక్తికలిగిన యువతను ప్రపంచస్థాయిలోనే అత్యంత శక్తివంతమైన యువశక్తిగా తీర్చి దిద్దుకునే దృక్పథంతో ప్రభుత్వపరంగా తగిన విధానం రూపొందించి సహకరించే సంకల్పం కూడా అవసరమవుతుంది. అయితే, వారు తమకు అందుబాటులో ఉన్న నైపుణ్యాల ఆధారంగా కొత్త అవకాశాలను సృష్టించేందుకు ఉపయోగపడే సాధనాలుగా వినియోగపడతారు. మైఖేల్ గ్రీన్ రాసిన "సామాజిక మార్పులో క్రియాశీల ప్రతినిధులుగా యువత" అనే పుస్తకంలో "యువతలో సానుకూలమైన దృక్పథాన్ని కలిగించి అభివృద్ధికి అనువుగా మలచు కోవడమనేది ఎప్పటికప్పుడు విస్తృతస్థాయిలో బలీయమైన ఉద్యమంగా చేపట్టాల్సి ఉంటుంది. ఈ

కార్యదర్శి, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, న్యూఢిల్లీ.
E-mail: secy-ya@nic.in

ఉద్యమంలో జరిగే లోపాల వల్ల బెంబేలెత్తిపోయి అభివృద్ధికి దూరం కాకుండా సమస్యలను తక్షణమే పరిష్కరించి దీర్ఘకాలిక ప్రయోజనాలపై దృష్టి సారించి మరింత అభివృద్ధి సాధించే దిశగా ఈ ప్రణాళికలను అమలు చేయవలసి ఉంటుంది" అని వివరిస్తారు.

సాంఘిక, రాజకీయ లేదా పౌర ఉద్యమాల వ్యూహాల్లో, కార్యాకలాపాల్లో యువతనే కేంద్ర బిందువుగా ఉంటోంది. స్వలింగ సంపర్క రక్షణ ఉద్యమం నుంచి స్త్రీలకు సమాన హక్కుల ఉద్యమం వరకు, పర్యావరణ పరిరక్షణ ఆందోళనల నుంచి మానవహక్కుల వరకు – ప్రజా జీవితంలో బహుళజాతి విభాగాలను కలిగి ఉన్న కార్యకలాపాలకు కేంద్రంగా ఉండడమే గాక యువతే తరచు కీలకమైన ఒత్తిడి సమూహంగా కూడా వ్యవహరిస్తోంది. యువత తన ఆసక్తిని ప్రదర్శించేందుకు, అభిప్రాయాన్ని వ్యక్తీకరించేందుకు, తన ఆందోళనలను విస్తృతం చేసేందుకు కొత్త మీడియా సాధనాలను సమర్థవంతంగా వినియోగించుకోగలుగుతున్నది. అందు వల్లనే మీడియా, ముఖ్యంగా సోషల్ మీడియా మరింత ముందుకు వచ్చి, విస్తృత స్థాయి చర్చలు చేపట్టి ప్రజల అభిప్రాయాన్ని విస్తృతంగా వ్యాపింపచేస్తోంది.

కొత్త మీడియా సాధనాలు ప్రజల ఆలోచనల రూపకల్పనలోను స్థాయి, పరస్పర సహకారంతో ఆ ఆలోచనలకు సంబంధించిన సమాచార మార్పిడికి సహాయ పడతాయి. ఫలితంగా జరిగే విస్తృత చర్చల నేపథ్యంలో చివరికి సామూహిక అంగీకా రంతో దీనిని ఒక ఆలోచన విధానంగా ఆచరణ యోగ్యంగా నిర్ధారిస్తాయి. శాస్త్రీయ, సామాజిక, ఆర్థిక కార్యకలాపాల్లో నిరంతరం జరిగే మార్పులను ఎప్పటికప్పుడు ఆకళింపు చేసుకుని తగిన విధంగా తమను మలచుకునే సామర్థ్యం యువతలో అంతర్లీనంగా ఉండడం వల్లనే అన్ని కార్యక్రమాలలోను యువతకు ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఎంతో ఉంది.

రెండు తరాల మధ్య వంతెనగా యువత ఆదర్శవంతంగా వ్యవహరించవచ్చు పరస్పరాభివృద్ధికోసం ఒకరి అభిప్రాయాన్ని ఒకరు గౌరవించే నమ్రతతో కూడిన సామరస్య భావన సాధించాలన్న విషయాన్ని అర్థం చేసుకోగల వయసు ఇదే. సైద్ధాంతిక పరమైన మంకుపట్టుతో వ్యవహరించడం, వేలంవెర్రిగా పాశ్చాత్య సంస్కృతిని అనుకరించడం వంటి రెండు తీవ్ర చర్యల వల్ల దీర్ఘకాలంలో ఈ దేశానికీ ఎలాంటి ప్రయోజనం ఉండదు. పరిపూర్ణత పేరిట స్వయంప్రతిపత్తితో ఏకాకిగా వ్యవహరిం చడం వల్ల సమస్యలకు ఎలాంటి పరిష్కారం లభించబోదని ప్రస్తుతం యువతకు స్పష్టం చేయగలిగితే వారు సులువుగా అర్థం చేసుకోగలుగుతారు. ఇందుకోసం పనిచేసే యువ బృందాలను అనుసంధానం చేస్తూ వారందరూ ఉమ్మడిగా సమష్టి కృషి చేసేందుకు అవకాశం కల్పించాల్సి ఉంటుంది. నూతన సామాజిక ఆలోచనలకు, ఆర్థిక, అభివృద్ధి, రాజకీయ కార్యకలాపాలకు యువత ప్రాథమిక ఉత్ప్రేరకంగా పని చేస్తుంది. అనేక మినహాయింపులు కలిగిన భారత ప్రజాస్వామ్య వ్యవస్థలోని భిన్నత్వం నుంచి ఏకతాసాధనకు కృషిచేసిన పలువురు పెద్దల అనుభవసారాన్ని ఆత్మపరిశీలనతో రంగరించి వాస్తవాన్ని గ్రహించగల సామర్థ్యం నేటి యువతకు ఉన్నదనడంలో సందేహం లేదు.

అనేక తర్కవితర్కాల మధ్య నూతన ఆవిష్కరణల నేపథ్యంలో మన సాంఘిక వ్యవస్థలో అభివృద్ధికి అడ్డుగోడలుగా నిలుస్తున్న అసమానతలపై ప్రస్తుత యువత ఆత్మపరిశోధన చేసుకుంటున్నది. అందు వల్లనే సహపంక్తి భోజనాలు, కులాంతర వివాహాల వంటి వాటిపై నేటి యువత పెద్దగా అభ్యంతరాలు లేవనెత్తడం లేదు. తోటి మానవులను వివక్షతకు గురిచేసి అవమాన పరచేలా కఠినంగా వ్యవహరించే కుల, మత, వర్ణ, లింగ విభేదాలపై నేటి యువత ఎలుగెత్తి ప్రశ్నిస్తోంది. ఈ తీరు ఒక ప్రత్యేక ఉద్యమంలా గరిష్ఠ స్థాయిలో లేనప్పటికీ చిన్న చిన్న సంఘటనల సందర్భంగా మన యువత దృఢ చిత్తంతోనే వ్యవహరిస్తున్నది. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో, అన్ని రంగాల్లో వాటి వినియోగానికి ప్రాధాన్యత లభించడం వల్ల సమస్యకు మూలమేమిటో యువత సులువుగా తెలుసుకోగలుగుతున్నారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఆర్థిక సామాజిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన డిజిటలైజేషన్ కార్యక్రమం "నగదురహిత ఆర్థిక వ్యవస్థ మరియు డిజిటల్ ఇండియా "దిశగా సాగుతుండడం వల్ల మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి. నిత్యజీవితంలో సాంకేతిక పరిజ్ఞానపు వినియోగం పెరుగుతుండడంవల్ల అభివృద్ధి ఫలితాలపై సానుకూల దృక్పథం ఏర్పడుతున్నది. ఒకప్పుడు అసాధ్యమనుకున్న అంశాలెన్నో ఇప్పుడు ఆధునిక పరిజ్ఞానం సహకారంతో మానవాళికి అత్యంత సులభ సాధ్యాలుగా మారుతున్నాయి. దీంతో ప్రతినిత్యం మనిషి ఎన్నో మైలురాళ్లు అధిగమిస్తుండడం మనం చూస్తున్నాం. అభివృద్ధి చెందుతున్న దేశాలలో కూడా మానవ జీవితాలను మెరుగుపరచ డానికి సాంకేతిక పరిజ్ఞానం ఎంతో వినియో గపడుతోంది.

దేశంలో నెలకొన్న డిజిటల్ పర్యావరణం భారత యువత ప్రపంచంలో సుస్థిర స్థానంలో నిలిచేందుకు అవకాశం కల్పించింది. ఇది వేగవంతమైన సమాచార

మార్పిడికి, వేగంగా నేర్చుకోవటానికి తోడ్పడడమేగాక భౌగోళికంగా ఎంతో దూరంగా ఉన్న వివిధ ప్రాంతాలను ఒకే వేదికపైకి తేవడం ద్వారా సమయం, సొమ్ము, శ్రమ ఆదా అవుతున్నాయి. ఏకాభిప్రాయం కలిగిన వ్యక్తుల మధ్య సంధానకర్తగా నిలిచి సమస్యలకు తగిన పరిష్కారాలు చూపడం వల్ల మంచి ఫలితాలు సాధించే అవకాశం లభిస్తుంది. ఒక మీట నొక్కినా వెంటనే మన, మన భావాలను వ్యక్తీకరించడం, ఆలోచనలను పంచుకోవడం, సంప్రదింపులు జరపడం, ఉమ్మడిగా పనిచేసే అవకాశం పొందగలగడం వంటివి సాధ్యమవుతాయి. సాంకేతిక పరిజ్ఞానం మన కళ్ళకు కనిపించేదానికంటే ఎన్నోరెట్ల వేగంగా ఫలితాన్ని అందించ గలుగుతుంది. విద్యార్థి తన అభిరుచికి తగిన విద్య ఎక్కడ లభిస్తుందో తెలుసుకుని అలాంటి ప్రత్యేక అధ్యయన కేంద్రాలకు లేదా విద్యా సంస్థలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇలా నూతన సాంకేతిక పరిజ్ఞానం ఇప్పుడు అందరికీ సమానమైన అవకాశాలు కల్పిస్తోంది. విద్యార్థి తనకు కావలసిన విద్యను నేర్చుకునే అవకాశం లభించడంతో నూతన సాంకేతిక పరిజ్ఞానం కల్పించిన మార్గంలో మరింత ముందుకు దూసుకెళ్లే అవకాశం లభిస్తోంది.

సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు తగిన భరోసా లభించడంతో నూతన ఆవిష్కరణలు కూడా పెరుగుతున్నాయి. నూతన సంస్థలను ప్రారంభించే అవకాశాలు గతంలో ఉన్నత వర్గాలకు చెందిన కొన్ని కుటుంబాలకు పరిమితం కాగా ఆ చట్రాన్ని ఛేదించి నూతన ఆవిష్కరణలు చేసేందుకు సామాన్యులకు కూడా తగిన సహకారాన్ని ఆధునిక సాంకేతికపరిజ్ఞానం కల్పిస్తున్నది. ఈ సాంకేతిక పరిజ్ఞానంవల్ల బండరాళ్లకు పదునుపెడితే అందమైన కళాఖండాలుగా మారినట్టు, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంవల్ల యువత ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా మారేందుకు అవకాశం లభిస్తున్నది.

శాస్త్ర సాంకేతికాభివృద్ధి వల్ల మన యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడంతోబాటు వారి సమగ్రాభివృద్ధికి ఎలాంటి అవకాశాలున్నాయో క్రీడలు, యువజన సర్వీసుల శాఖ ద్వారా ప్రభుత్వం పదేపదే పరిశీలిస్తున్నది. సాధారణ సమీక్షలు, కార్యక్రమాలతోపాటు యువతకు సంబంధించిన జీవనశైలి, నాయకత్వ నైపుణ్యాల శిక్షణ వంటి నూతన కార్యక్రమాలను కూడా చేపడుతున్నారు. భారత జాతీయ యువజన విధానం 2014 ప్రకారం యువత శక్తి సామర్థ్యాలను గుర్తించి అన్నిరంగాల్లో వారి సమగ్రాభివృద్ధికోసం ప్రభుత్వం చేపట్టే చర్యలకు మద్దతు పలకాలని 2016-17 వార్షిక నివేదిక పునరుద్ఘాటించింది. యువత శక్తిసామర్థ్యాలను గుర్తించి వారి సమగ్రాభివృద్ధి ద్వారా ప్రపంచ దేశాల్లో భారత దేశం తగిన గౌరవనీయ స్థానాన్ని దక్కించుకోవడానికి కృషి చేయాలనీ 2014 జాతీయ యువవిధానం స్పష్టం చేస్తోంది.

**జాతీయ యువవిధానం 2014 లక్ష్యాలు, ప్రాధాన్యరంగాలు : -.**

i) భారతదేశ ఆర్థిక అభివృద్ధికి నిరంతర సహకారాన్ని అందించగల ఉత్పాదక శ్రామిక శక్తిని సృష్టించడం.

**ఇందులో ప్రాధాన్య రంగాలు:**

(ఎ) విద్య, (బి) వ్యవస్థాపక సామర్థ్యం,(సి) ఉపాధి/వృత్తి నైపుణ్యాభివృద్ధి.

ii) భవిష్యత్తరాల బాధ్యతను స్వీకరించగల సామర్థ్యం కలిగిన ఆరోగ్యవంతమైన సమాజాన్నిసృష్టించడం దీని నిర్వహణ కోసం: ఆరోగ్యం – ఆరోగ్యవంతమైన జీవనవిధానం, క్రీడలు.

iii) సాంఘిక విలువలను పెంచడం ద్వారా హేతుబద్ధమైన సమాజ నిర్మాణానికి సేవా గుణాన్ని ప్రోత్సహించడం: ఇందుకు పనికొచ్చే సాధనాలు: సాంఘిక విలువల ప్రచారం; సామాజిక కార్యక్రమాలు.

iv) నిబంధనలను సడలించడం ద్వారా అన్ని పరిపాలన విభాగాల్లోనూ పాల్గొనేందుకు పౌరులకు తగిన వసతి కల్పించడం: ఇందుకోసం రాజకీయాల్లోనూ, పరిపాలన విభాగాల్లోనూ ప్రజలు పాల్గొనేలా చేయడం; అందులో యువతకు బాధ్యతలు అప్పగించడం.

v) ఆపన్నకాలంలో యువతకు మద్దతుగా నిలవడం, పేద, బలహీనవర్గాలకు చెందిన యువతకు సమాన అవకాశాలు సృష్టించడం. ఇందులో ప్రధానమైన అంశాలు : బలహీన వర్గాల వారిని కలుపుకొనివెళ్తూ, సామాజిక న్యాయం జరిగేలా చూడడం యువత సంపూర్ణమైన సమగ్రాభివృద్ధి కోసం ప్రస్తుత ప్రభుత్వం బహుముఖ కార్యక్రమాలు చేపట్టి వాటిలో పాల్గొనాలని యువకులను ఆహ్వానిస్తోంది. ఉదాహరణకు జాతీయ నిర్మాణ కార్యక్రమాల్లో యువకులు పెద్దసంఖ్యలో చురుకుగా పాల్గొనేలా చేయాలనీ నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ను ఆదేశించింది. జాతీయ సేవా పథకం (NSS) సభ్యులు సాంఘిక సేవా కార్యక్రమాల ద్వారా నీతినిజాయితీలతో కూడిన మానవీయ సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్నది.

**కౌమార, యువత అభివృద్ధి కోసం జాతీయ పథకాలు ఎన్నో ఉన్నాయి.**

జాతీయ యువజనోత్సవాల నిర్వహించడం, యువజనులకు అవార్డులు అందజేయడం వంటి కార్యక్రమాల ద్వారా

యువతను ప్రోత్సహిస్తున్నది. జనాభా లెక్కలు 2011 ప్రకారం దేశ జనాభాలో 41 శాతం మంది 20 ఏళ్ల లోపువారే కావడం విశేషం. వ్యక్తిత్వ వికాసం అంశానికి సంబంధించి ఇది కీలకమైన వయసు కావడం వల్ల ఈ వయసులో ఏ దిశలో వెళ్లాలన్న అంశంపై మార్గదర్శనం, గమన నిర్దేశనం, దర్శకత్వం చాల ముఖ్యమైనవి. అయితే వేగంగా విస్తరిస్తున్న పట్టణీకరణకు సంబంధించిన దుష్ప్రభావాలవైపు యువత ఆకర్షితులై సాధారణ జీవితం గడపలేక నేరప్రవృత్తికి వశులైపోతున్నారు. జీవన వనరుల లభ్యత, అందుబాటులకు మధ్య తీవ్రమైన అంతరం ఉండడమే ఈ విధమైన వ్యతిరేక ప్రభావానికి కారణం. అయితే, ప్రభుత్వం కల్పించే సౌకర్యాలు, ఇచ్చే రాయితీలు, చేపట్టిన కార్యక్రమాలపై తగిన ప్రచారం లేకున్నా యువతకు అవగాహన లేకున్నా వాటిని ఉపయోగించుకోవడం అంత సులభం కాదు. ఆలా వినియోగించుకోలేక పోవడానికి మన సామాజిక నిర్మాణంలో ఉన్న తేడాలు, ఆర్థిక ఇబ్బందులే ప్రధానమైన అడ్డుగోడలుగా నిలుస్తాయి. యువత ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని నివారించేందుకు ప్రభుత్వ యంత్రాంగం చేపట్టవలసిన చర్యలు విఫలమవడానికి మూల కారణం మన వ్యవస్థలో ఈ అంశాలపై తగిన అవగాహన కొరవడడమే! యువతలో పెరుగుతున్న గుర్తింపు సంక్షోభంపై మన విద్యావ్యవస్థ వ్యవహరిస్తున్న తీరు పూర్తిగా సంతృప్తికర మనిగాని, లేదా సున్నితంగా తిరస్కరించ గలిగి లేక ఆహ్వానించదగిన పరిణామం గానో భావించడానికి వీల్లేదు. విద్యార్థులలో ఉన్న సామర్థ్యాన్ని గుర్తించి వారినుంచి బహుళ ప్రయోజనాలు సాధించేవిధంగా వివిధ శాఖల సమన్వయంతో విద్యాబోధన సాగించే సత్తా మన విద్యాసంస్థలకు ఉన్నది. అందువల్ల యువత మనోభావాలను గుర్తించి, పనితీరును అంగీకరించి, మేధస్సును గౌరవించడం ఇప్పటి తక్షణా వసరం. అయితే ఈ గుర్తింపు యువత అంచనాలకు, దృఢమైన అభిప్రాయాలకు భిన్నంగా ఉంటుంది. కానీ దానికి బదులుగా చంచలమైన వారి అభిప్రాయాల్లో తేడాలను పసిగట్టి చర్చలు తదితర ప్రక్రియలద్వారా వాటిని సమన్వయపరచి ఒక స్థిరమైన అభిప్రాయానికి వచ్చేలా చేయవచ్చు. ఇప్పటికే విస్తృతంగా ప్రశంసలు పొందిన జాతీయ సేవా పథకం (నేషనల్ సర్వీస్ స్కీం) కార్యక్రమాలే కాకుండా బహుళ పరిష్కారాలతో సమస్యలను పరిష్కరిం చేందుకు నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ కూడా మరిన్ని ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించింది.

2014 యువజన విధానాన్ని విజయవంతం చేసేందుకు దాని నిర్వహణలో ప్రాధాన్యాంశాలతోబాటు ఏయే అంశాలపై వివిధ సందర్భాలలో జోక్యం చేసుకోవచ్చో కూడా సూచించారని క్రీడలు, యువజన సేవల మంత్రిత్వ శాఖ 2016-17 వార్షిక నివేదికలో పేర్కొన్నది. వాటిలో ముఖ్యమైనవి:

- నాణ్యమైన సమర్థవంతమైన విద్యా వ్యవస్థ నిర్మించడం;
- ఉపాధి, వృత్తి నైపుణ్యం అభివృద్ధిలో వివిధ సంస్థలు తదితర భాగస్వాములకూ యువతకూ మధ్య తగిన అవగాహన కల్పించేందుకు అవసరమైన సమన్వయ సాధనాలు ఏర్పాటు చేయడం;
- పరిశ్రమలో ఇప్పటికే అనుకూలంగా ఉన్నకార్యక్రమాలను కలుపుకోవడం;
- ఆరోగ్య రంగంలో అందవలసిన సేవలను మెరుగుపరచడం;

రాష్ట్రీయ యువ సశక్తీకరణ్ కార్యక్రం (ఆర్.వై.ఎస్.కే) ప్రస్తుతం సంపూర్ణ మైన సమగ్రాభివృద్ధి సాధనే లక్ష్యంగా పెట్టుకుంది. ఇది ఇప్పుడు ఒక వర్గీకరణ పద్ధతిలోకాకుండా వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తుంది.

**ప్రభుత్వం చేపట్టే కొన్ని ముఖ్యమైన కార్యక్రమాలు : -**

నైపుణ్యం పెంపు శిక్షణ కార్యక్రమం (స్కిల్ అప్ గ్రేడేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాం-ఎస్ యూటీపీ) : ఈ కార్యక్రమంలో శిక్షణ పొందిన అధ్యాపకుల సహాయంతో వృత్తి శిక్షణ నైపుణ్యాన్ని అభివృద్ధి చేయడం ద్వారా ఆత్మవిశ్వాసం పెంపొందించడమేగాక అదనపు ఆదాయాన్ని సమకూర్చడమే లక్ష్యంగా పెట్టుకుంది. స్థానిక అవసరాలను గుర్తించి అందుకు తగిన వృత్తి శిక్షణ కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతుంది

**జానపద కళ, సంస్కృతి, యువకృతి ప్రోత్సాహము:**

పాశ్చాత్య సంస్కృతిపై మక్కువ కనబరుస్తున్న వేళలో గ్రామీణ యువతకు వారి సంస్కృతి గొప్పదనాన్ని తెలియజేసి వారి ప్రతిభను ప్రోత్సహించడానికి, అవసరమైన ఉపాధి కల్పనకు మార్గదర్శకంగా ఉంటుంది.

**మహాత్మా గాంధీ యువ స్వచ్ఛత అభియాన్ మరియు శ్రమదాన్ కార్యక్రమం:**

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై యువతకు తగిన శిక్షణ ఇవ్వడం వల్ల తాగునీటి సంరక్షణ, తదితర కార్యక్రమాలకు ప్రోత్సాహం లభిస్తుంది.

దేశం అంతటా నెలకొన్న అసమానతల నేపథ్యంలో అందరినీ అభివృద్ధిలో పాలుపంచుకునేలా చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల్లో ముఖ్యమైనవి :

**కౌమార కోసం జీవిత నైపుణ్యం శిక్షణ (కౌమార సాధికారత):**

కౌమార దశలో ఆరోగ్యకరమైన

జీవిత లక్ష్యాలను ఎంపిక చేసుకుని మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు వీలుగా తగిన శిక్షణ కార్యక్రమాలను చేపట్టడం ప్రస్తుతం ప్రధానమైన అవసరం. ఈ పథకం కింద కౌమారప్రాయంలోనే పునరుత్పాదక లైంగిక ఆరోగ్యం తదితర అంశాల గురించి తెలుసుకోవడం వల్ల సమస్యలను పరిష్కరించుకోగలిగేలా చేయడమే లక్ష్యంగా ఉంటుంది. సమస్య పరిష్కారం కోసం వారికి తగిన సామర్థ్యాన్ని కల్పించేదిశగా ఏకాభిప్రాయాన్ని తీసుకురావాలన్న లక్ష్యంతో ఈ శిక్షణ ఉంటుంది. భౌగోళిక, సామాజిక అడ్డంకులు తొలగించేందుకు ఉపయోగపడే రెండు కార్యక్రమాలను ఇక్కడ పేర్కొనవచ్చు

**ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం (టీవైఈపీ):**

ఈ పథకం కింద తీవ్రవాదానికి గురైన గిరిజన ప్రాంతాల నుంచి యువతను ఎంచుకొని, దేశంలోని ఇతర ప్రాంతాలలో వారిని పర్యటింపజేస్తారు. దీనివల్ల స్థానిక ఆధిపత్య స్థానిక భావజాల ప్రభావం లేకుండా వారి మనస్సుని అభివృద్ధి వైపు మళ్లించడానికి, జాతిజీవన స్రవంతిలో భాగస్వాములుగా చేసేందుకు తోడ్పడుతుంది. పట్టణాల్లో అభివృద్ధి ఫలితాలను చూసిన అనుభవం ద్వారా నేర్చుకోవడం వల్ల గిరిజన యువత తమ గిరిజన గ్రామాల్లో కూడా పట్టణ వసతులు కల్పించేందుకు తోడ్పాటునందిస్తారు. ఇందువల్ల గిరిజన ప్రాంతాల్లో కూడా మౌలిక వసతులు ఏర్పడడమేగాక గిరిజన యువతలో కూడా సాంకేతిక వృత్తి నైపుణ్యం అభివృద్ధి జరిగే అవకాశం కలుగుతుంది.

**నార్త్ ఈస్ట్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం :**

యువజన వ్యవహారాలు, గృహ మంత్రిత్వ శాఖలు కలిసి సంయుక్తంగా నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆధ్వర్యంలో ఈశాన్య రాష్ట్రాల యువతకు మహారాష్ట్ర యువతతో సాంస్కృతిక వైవిధ్య జీవనశైలి, సాంఘిక-ఆర్థిక అభివృద్ధి, సంస్కృతి తదితర అంశాలపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో అమలు చేస్తున్నారు.

యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో తమిళనాడులోని శ్రీపెరంబుదూరులో "ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్" ఏర్పాటును ఒక మైలురాయిగా చెప్పుకోవచ్చు. 2012 చట్టం ద్వారా - "రాజీవ్ గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్‌ను స్థాపించారు. ఇది యువజనాభివృద్ధి రంగంలో అత్యుత్తమ విద్యాకేంద్రంగా ప్రపంచవ్యాప్త గుర్తింపు, ప్రశంసలు పొందుతోంది

ఈ సంస్థ ప్రధానంగా M.Sc తోపాటు వివిధ విద్యా బోధన కార్యక్రమాలు చేపట్టి ఉత్తీర్ణులైనవారికి డిగ్రీలను అందిస్తుంది. కౌన్సెలింగ్ సైకాలజీ, సోషల్ ఇన్నోవేషన్ అండ్ ఎంట్రప్రెన్యూర్షిప్, జెండర్ స్టడీస్, డెవలప్మెంట్ పాలసీ వంటి అంశాల్లో ఎం.ఏ పట్టాలు అందజేస్తుంది. అంతేగాకుండా పరస్పర మార్పిడి పద్ధతిలో వివిధ శాస్త్రాలలో యువతకు సంబంధించిన అంశాలపై డాక్టొరల్ డిగ్రీ సాధించే సదుపాయం కూడా ఇక్కడ లభిస్తుంది.

దేశంలోని వివిధ నగరాల్లో యువతకు చౌకగా, గౌరవప్రదంగా, తేలికగా అందుబాటులో ఉండేలా ప్రభుత్వం యూత్ హాస్టళ్లను స్థాపించింది. సాంస్కృతికంగాను చరిత్రకంగాను ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రాంతాల్లో నిరంతర విద్యుత్తు, నీటి సౌకర్యం కలిగిన ఈ హాస్టళ్ల ఏర్పాటు వల్ల జాతీయ స్థాయిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే యువత మధ్య సాంఘిక, సాంస్కృతిక అంశాలపై పరస్పర అవగాహన ఏర్పడుతుంది. వివిధ వర్గాల యువకుల శక్తి సామర్థ్యాలను వెలికి తేవడానికి ప్రభుత్వం ఎన్నో మార్గాల ద్వారా కృషిచేస్తోంది. ఈ కార్యక్రమాలన్నీ యువతలో వ్యక్తిత్వవికాసానికి దోహదపడుతున్నాయి. అభివృద్ధి చెందుతున్న భారత జాతీయ యువత తన ఆధిపత్య గళాన్ని సగర్వంగా ప్రపంచానికి వినిపిస్తోంది. పరివర్తన చెందుతున్న భారత యువత వెలుగు దివిటీలు పట్టుకుని సామాజిక స్పృహతో ప్రపంచాన్ని ముందుకు నడిపించాలి.

ఎవరికీ తలవంచని రీతిలో సంపూర్ణమైన ఆత్మవిశ్వాసంతో యువత ముందుకు సాగాలి.... ఈ సందర్భంగా "లే....మేల్కో....లక్ష్యాన్ని సాధించేవరకు ఆగకు..." అని స్వామి వివేకానంద యువతకు ఇచ్చిన పిలుపును గుర్తుకు తెచ్చుకుని నిరంతరం ముందుకు సాగాలి....

■


## ఏజెంట్లు కావలెను

యోజన తెలుగు మాస పత్రిక పంపిణీకి ఆంధ్రప్రదేశ్‌లో ఏజెంట్‌లు కావలెను. సోల్ సెల్లింగ్ విధానంలో కానీ, జిల్లాల వారీగా కానీ ఏజెంట్‌లు కావలెను.

**వివరాలకు సంప్రదించండి**

ఎడిటర్, **యోజన (తెలుగు),**
హైదరాబాద్.
ఫోన్ 9440406712.
e-mail : yojana_telugu@yahoo.co.in

ఉపాధి ద్వారా అవకాశాలు

# యువతకు ఉద్యోగ కల్పనలో సవాళ్లు

– అలఖ్ ఎన్. శర్మ
– బల్వంత్ సింగ్ మెహతా



**భారతదేశంలో ఏటా దాదాపు కోటి మంది యువకులు ఉద్యోగాలకు సిద్ధమవుతున్నారని తెలుస్తుంది. కార్మికులలో 30 ఏళ్ల పైబడిన వారు సుమారు సగం మంది స్వయం ఉపాధి పొందుతూ ఉంటే.. 18–29 వయసు విభాగంలోని సుమారు ఐదింట ఇద్దరు స్వయం ఉపాధి మార్గంలో ఉన్నారు చదువుకున్న యువతలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా పెరుగుతోంది. చదువు ఏ స్థాయిలో పెరుగుతోందో అదే స్థాయిలో నిరుద్యోగ యువత కూడా పెరుగుతోంది**

జనాభా విషయంలో ప్రపంచంలోని ఇతరదేశాలతో పోలిస్తే భారతదేశంలోనే అత్యధికంగా యువకులు ఉన్నారు. మొత్తం ప్రపంచ యువతలో ఐదో వంతు మంది మనదేశంలో ఉండటం గమనార్హం. మనదేశ యువతకు సరైన ఉపాధి కల్పించగలిగితే ఆర్థిక అభివృద్ధిలో వారు గణనీయమైన పాత్ర పోషిస్తారు. 2011 జనాభా లెక్కల ప్రకారం భారత జనాభాలో సగంకన్నా ఎక్కువ (60.3 శాతం) మంది పనిచేసే వయసు (15–59) విభాగంలో ఉన్నారు. వారిలో పావు శాతం పైగా (27.5 శాతం) యువజన విభాగం (15–29)లో ఉన్నారు. 2001–2011 మధ్య కాలంలో జనాభా మొత్తం పెరుగుదల (1.6)తో పోలిస్తే భారతదేశంలోయువ జనాభా ఏటా అత్యధిక స్థాయిలో (2 శాతం) పెరుగుతోంది. దీనినిబట్టి చూస్తే భారతదేశంలో ఏటా దాదాపు కోటి మంది యువకులు ఉద్యోగాలకు సిద్ధమవుతున్నారని తెలుస్తుంది. ఉత్తర, తూర్పు ప్రాంతంలోని వెనుకబడిన రాష్ట్రాల్లో నిరుద్యోగ యువత ఎక్కువగా ఉంది. పెరుగుతున్న యువ జనాభాకు సరిపడినన్ని ఉద్యోగాల సృష్టి సాధ్యపడడం లేదు. ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎంఈజీపీ), స్వర్ణజయంతి గ్రామ్ స్వరోజ్గార్ యోజన (ఎస్‌జిఎస్‌వై), స్వర్ణ జయంతి షహరీ రోజ్గార్ యోజన (ఎస్‌జెఎస్‌ఆర్‌వై), 'మేకిన్ ఇండియా' మరియు 'స్కిల్ ఇండియా' లాంటి పలు స్వయం ఉపాధి పథకాలను భారత ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ వ్యాసంలో దేశంలో యువకులకు ఉద్యోగ కల్పనలో సవాళ్లను చర్చించడంతోపాటు, ప్రభుత్వం తీసుకున్న చర్యలను పరిశీలించడం జరిగింది. ఈ వ్యాసంలోని సమాచారం లేబర్ బ్యూరో ఆఫ్ ఇండియా 2015–16కు సంబంధించి చేసిన ఐదో వార్షిక ఉద్యోగిత సర్వే నుంచి తీసుకోబడింది. సాధారణంగా 15–29 సంవత్సరాల మధ్య వయసు వారిని యువ జనాభాగా గుర్తించడం జరుగుతుంది. అయితే ఈ వ్యాసంలో దానిని 18–29గా తీసుకున్నాము. ఇలా చేయడం ఎందుకంటే.. 15–17 సంవత్సరాల మధ్య ఉన్న వారు చాలా తక్కువమంది తాము కార్మిక విపణిలో ఉన్నామని పేర్కొనడం వల్ల. ఇక 18–29 వయసు మధ్య ఉన్న వాళ్లు ఎక్కువగా ఉండటంతో వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం పెద్ద సవాలుగా ఉంది.

డైరెక్టర్, ఇనిస్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్, న్యూఢిల్లీ E-mail: alakh.sharma@ihdindia.org
పరిశోధక విద్యార్థి, ఇనిస్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్, న్యూఢిల్లీ E-mail: balwant.mehta@ihdindia.org

### కార్మికుల భాగస్వామ్య రేటు

మొత్తం జనాభాలో కార్మికులు లేదా ఉద్యోగుల నిష్పత్తిని కార్మికుల భాగస్వామ్య రేటు (డబ్ల్యూపీఆర్) సూచిస్తుంది. 2015-16లో యువకుల డబ్ల్యూపీఆర్ 39.2గా ఉంటే.. 30 సంవత్సరాల పైబడిన (టేబుల్ 1) విభాగంలో డబ్ల్యూపీఆర్ 57.3గా ఉంది. 18-29 ఏళ్ల విభాగంలో ఇది గణనీయమైన ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. మరో విషయం ఏమిటంటే 18-29 వయసు విభాగంలోని యువతుల కంటే యువకుల డబ్ల్యూపీఆర్ 3.5 రెట్లు ఎక్కువగా ఉంది.

కార్మికులలో 30 ఏళ్ల పైబడిన వారు సుమారు సగం మంది స్వయం ఉపాధి పొందుతూ ఉంటే.. 18-29 వయసు విభాగంలోని సుమారు ఐదింట ఇద్దరు

***టేబుల్-1:*** *2015-16కు సంబంధించి వయసుల విభాగాల వారీగా పని భాగస్వామ్య రేటు (యూపీఎస్)*

| ప్రాంతము | 15-17వయసు | | | 18-29 వయసు | | | 30 ఏళ్లు పైబడిన వారు | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | పు | మ | వ్య | పు | మ | వ్య | పు | మ | వ్య |
| గ్రామీణ | 11.1 | 4.3 | 8.0 | 63.1 | 19.1 | 42.3 | 89.0 | 29.8 | 60.1 |
| పట్టణ | 4.0 | 1.4 | 2.8 | 48.6 | 11.8 | 30.7 | 82.6 | 16.7 | 50.4 |
| మొత్తం | 9.3 | 3.6 | 6.7 | 59.3 | 17.1 | 39.2 | 87.1 | 26.0 | 57.3 |

*మూలం: లేబర్ బ్యూరో, యువత ఉపాధి మరియు నిరుద్యోగ పరిస్థితిపై నివేదిక, వాల్యూమ్ 2, 2015-16 భారత ప్రభుత్వం.*

*నోట్: యూపీఎస్ - యూజువల్ ప్రిన్సిపల్ స్టేటస్, పు: పురుషులు, మ: మహిళలు, వ్య: వ్యక్తులు*

నిష్పత్తి అని అంచనా వేస్తున్నారు. ఈ విభాగంలో వారు చాలా మంది విద్యాభ్యాసంలోనే ఉంటారు. టేబుల్ 1లో చూస్తే పట్టణ ప్రాంతాల్లో డబ్ల్యూపీఆర్ కంటే గ్రామీణ స్వయం ఉపాధి మార్గంలో ఉన్నారు (టేబుల్ 2). టేబుల్ 2 ద్వారా మరో విషయం స్పష్టంగా తెలుస్తున్నది ఏమంటే.. కార్మిక విపణిలో రెగ్యులర్ మరియు కేజువల్ కార్మికులుగా యువత ఎక్కువమంది చేరుతున్నారు. ఈ ధోరణి అటు గ్రామీణ ప్రాంతాలు, ఇటు పట్టణ ప్రాంతాల్లోకూడా గోచరమవుతోంది.

***టేబుల్-2:*** *వివిధ వయసుల విభాగాల్లో చేసే పనుల ఆధారంగా కార్మికుల పంపిణి (యూపీఎస్), 2015-16*

| | 15-17వయసు | | | 18-29 వయసు | | | 30 ఏళ్లు పైబడిన వారు | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | గ్రామీణ | పట్టణ | గ్రా.ప. | గ్రామీణ | పట్టణ | గ్రా.ప. | గ్రామీణ | పట్టణ | గ్రా.ప. |
| స్వయం ఉపాధి పొందుతున్నవారు | 40.8 | 30.9 | 39.7 | 40.5 | 33.3 | 39.0 | 51.2 | 43.4 | 49.2 |
| వేతనం లేదా జీతం తీసుకునే ఉద్యోగులు | 5.1 | 18.9 | 6.5 | 14.1 | 37.9 | 19.0 | 10.5 | 33.8 | 16.5 |
| కాంట్రాక్టు వర్కర్లు సాధారణ | 3.6 | 7.7 | 4.0 | 4.6 | 8.4 | 5.4 | 2.4 | 4.9 | 3.0 |
| కార్మికులు | 50.6 | 42.6 | 49.7 | 40.8 | 20.7 | 36.6 | 35.9 | 17.9 | 31.0 |
| **మొత్తం** | **100** | **100** | **100** | **100** | **100** | **100** | **100** | **100** | **100** |

*మూలం: లేబర్ బ్యూరో, యువత ఉపాధి మరియు నిరుద్యోగ పరిస్థితిపై నివేదిక, వాల్యూమ్ 2, 2015-16 భారత ప్రభుత్వం.*

### పారిశ్రామిక పంపిణీ

పారిశ్రామిక పంపిణీ ప్రకారం 18-29 సం॥ల వయసు విభాగంలోని వారిలో ఎక్కువ మంది (38.1 శాతం) వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ఉపాధి పొందుతున్నారు. దీని తర్వాత వాణిజ్యం, హోటల్ మరియు రెస్టారెంట్లలో (19.4 శాతం), నిర్మాణ రంగంలో (15.1 శాతం), తయారీ (13.1 శాతం)తో పాటు ఇతర రంగాల్లో ఉపాధి పొందుతున్నారు. అయితే 30 ఏళ్లు పైబడిన వారితో పోలిస్తే యువకులు వ్యవసాయేతర రంగాలైన నిర్మాణం, తయారీ మరియు వాణిజ్య తదితర రంగాల్లో ఎక్కువగా చేరుతున్నారు. వ్యవసాయేతర రంగాలను వీరు ఎందుకు ఎంచుకుంటున్నారంటే.. వ్యవసాయం రంగంలో సరైన వేతనాలు ఉండకపోవడంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా తక్కువగా ఉన్నాయి. దీంతో పాటు ఎక్కువ మంది చదుకున్న వాళ్లు ఇతర రంగాలపై ఆసక్తి చూపుతున్నారు.

### నిరుద్యోగిత సూచీ

పనిచేయడానికి సిద్ధంగా ఉన్నా ఉద్యోగం దొరకని వ్యక్తులు, ఉద్యోగం కోసం ఎదురు చూసే వ్యక్తుల నిష్పత్తిని నిరుద్యోగిత సూచీ తెలుపుతుంది. 2015-16 కాలంలో 18-29 ఏళ్ల మధ్య ఉన్న యువకుల నిరుద్యోగిత సూచీ 13.2 శాతంగా (టేబుల్ 3) ఉంది. ఇది 30 ఏళ్లకు పైబడిన వారి కంటే 8 రెట్లు ఎక్కువ. 30 ఏళ్లకు పైబడిన వారి నిరుద్యోగిత సూచీ 1.6 శాతంగా ఉంది. ఇక యువజన విభాగంలో యువతుల విషయానికి వస్తే అది 20.0 శాతంగా ఉంది. ఇది యువకుల కంటే సుమారు రెట్టింపుగా ఉంది. గ్రామీణ ప్రాంతాల కంటే

***టేబుల్-3:*** *వివిధ వయసుల విభాగాల్లో చేసే పనుల ఆధారంగా కార్మికుల పంపిణి (యూపీఎస్), 2015-16*

| రంగము | 15-17 వయసు | 18-29 వయసు | 30 ఏళ్లు పైబడిన |
|---|---|---|---|
| వ్యవసాయం మరియు అనుబంధం | 53.4 | 38.1 | 47.2 |
| గనులు, క్వారీ | 1.9 | 0.9 | 1.1 |
| తయారీ | 14.5 | 13.2 | 9.6 |
| ఎలక్ట్రిసిటీ, గ్యాస్ మరియు నీటి పంపిణీ | 0.2 | 0.6 | 0.6 |
| నిర్మాణ రంగం | 14.8 | 15.1 | 10.0 |
| వాణిజ్యం, హోటళ్లు, రెస్టారెంట్ | 12.2 | 19.4 | 17.5 |
| రవాణా, స్టోరేజీ మరియు సమాచారం | 1.1 | 3.7 | 3.9 |
| ఆర్థిక లావాదేవీలు, బీమా, రియల్ ఎస్టేట్, వ్యాపార సేవలు | 1.4 | 8.3 | 9.2 |
| సామాజిక, సాంఘిక, వ్యక్తిగత సేవలు | 0.6 | 0.7 | 0.8 |
| **మొత్తం** | **100.0** | **100.0** | **100.0** |

*మూలం: లేబర్ బ్యూరో, యువత ఉపాధి మరియు నిరుద్యోగ పరిస్థితిపై నివేదిక, వాల్యూమ్ 2, 2015-16 భారత ప్రభుత్వం.*

పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం రేటు ఎక్కువగా కనిపిస్తోంది. పురుషుల కంటే మహిళల్లో నిరుద్యోగం ఎక్కువగా ఉంది. యువజన విభాగంలో పట్టణ ప్రాంత యువకుల నిరుద్యోగిత సూచీ 11.5 శాతం ఉండగా... ఆందోళకరమైన రీతిలో యువతుల నిరుద్యోగిత 28 శాతంగా ఉంది. గమనించాల్సిన మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే.. 15-17 ఏళ్ల యువతలో చాలా తక్కువ మంది ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నప్పటికీ, వారి నిష్పత్తి ప్రకారం చూస్తే 18-29 ఏళ్ల విభాగంలోని యువత కంటే వారిలోనే ఎక్కువగా నిరుద్యోగిత కనిపిస్తోంది. ఈ పరిస్థితి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో, పురుషులు, మహిళల్లో ఒకేలా కనిపిస్తోంది.

చదువుకున్న యువతలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా పెరుగుతోంది. చదువు ఏ స్థాయిలో పెరుగుతోందో అదే స్థాయిలో నిరుద్యోగ యువత కూడా పెరుగుతోంది (టేబుల్ 4). అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలో సర్టిఫికెట్, లేదా గ్రాడ్యుయేట్ స్థాయిలో డిప్లమో కలిగిన వారిలో 23 శాతం నిరుద్యోగిత ఉంది. డిగ్రీ, ఆపైన చదివిన వారిలో అది సుమారు 35 శాతంగా ఉంది. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే విద్యావంతులైన యువకుల కంటే చదువుకున్న మహిళలలో నిరుద్యోగ శాతం చాలా ఎక్కువగా ఉంది.

***టేబుల్-4:*** *వయసుల విభాగాల వారీగా నిరుద్యోగిత సూచీ (యూపీఎస్), 2015-16*

| ప్రాంతము | 15-17వయసు | | | 18-29 వయసు | | | 30 ఏళ్లు పైబడిన వారు | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | పు | మ | వ్య | పు | మ | వ్య | పు | మ | వ్య |
| గ్రామీణ | 18.4 | 22.8 | 19.5 | 11.2 | 17.9 | 12.7 | 0.9 | 3.7 | 1.6 |
| పట్టణ | 22.1 | 21.4 | 22.0 | 11.5 | 27.9 | 15.1 | 0.7 | 5.3 | 1.5 |
| మొత్తం | 18.8 | 22.7 | 19.8 | 11.3 | 20.0 | 13.2 | 0.9 | 4.0 | 1.6 |

*మూలం: లేబర్ బ్యూరో, యువత ఉపాధి మరియు నిరుద్యోగ పరిస్థితిపై నివేదిక, వాల్యూమ్ 2, 2015-16 భారత ప్రభుత్వం.*

గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలో సర్టిఫికేట్ కోర్సు పూర్తి చేసి లేదా డిప్లమో, డిగ్రీలు పూర్తి చేసిన 18-29 ఏళ్ల మధ్య ఉన్న విద్యావంతులైన మహిళల్లో మూడో వంతు మంది నిరుద్యోగులుగా ఉంటున్నారు. గ్రాడ్యుయేషన్, ఆపైన చదువుకున్న మహిళలు తీవ్రమైన నిరుద్యోగ సమస్య ఎదుర్కొంటున్నారు. ఈ విభాగంలో నిరుద్యోగిత సూచీ 48 శాతంగా ఉంది. దీనిని బట్టి చూస్తే భారత కార్మిక విపణి సరిపడినన్ని ఉద్యోగాలు సృష్టించలేక పోవడంతో పాటు మహిళలకు ఉద్యోగాలు కల్పించడంలో వివక్ష చూపుతోందనేది స్పష్టమవుతోంది. దీనికితోడు మహిళలను అనువైన ఉద్యోగాల సృష్టి కూడా జరగడం లేదు లేదా రవాణా, క్రెచ్ వంటి ప్రాథమిక మౌలిక సదుపాయాల లేమి వారిని ఉద్యోగాలకు దూరం చేస్తోంది. మొత్తంగా చూస్తే యువకులకు సరిపడినన్ని ఉద్యోగాలను కల్పించే స్థితిలో భారతదేశం లేదు అనేది స్పష్టమవుతోంది. పట్టణాల్లోని యువతుల విషయానికి వస్తే ఈ సవాలు చాలా పెద్దగా ఉంది.

## ఇటీవల ప్రభుత్వం ప్రారంభించిన పథకాలు

గతంలో ప్రభుత్వం పలు స్వయం ఉపాధి పథకాలు ప్రారంభించింది. అయితే వాటి ఫలితాలు మాత్రం ఆశాజనకంగా లేవు. వ్యాపార రంగంలో యువతను ప్రోత్సహించ డానికి ఇటీవల కాలంలో ప్రభుత్వం పలు సరికొత్త పథకాలను ప్రారంభించింది. వాటిలో ముద్ర (సూక్ష్మ పరిశ్రమల అభివృద్ధి మరియు రీఫైనాన్స్ సంస్థ)తో స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, ప్రధాన మంత్రి ముద్ర యోజన, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, స్టార్టప్ విలేజ్ ఎంటర్ ప్రెన్యూర్షిప్ ప్రోగ్రాం తదితర పథకాలు ఉన్నాయి. ఈ పథకాల గురించి క్లుప్తంగా వివరణ కింద ఇవ్వబడింది.

## స్టార్టప్ ఇండియా మరియు స్టాండప్ ఇండియా

పది వేల కోట్ల రూపాయల భారీ ప్రారంభ నిధితో 2016 జనవరిలో భారత ప్రభుత్వం స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా పథకాలను ప్రారంభించింది. పన్ను మినహాయింపులు లాంటి సహాయం అందించి పరిశ్రమలను ప్రోత్సహించడానికి ప్రభుత్వ ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. స్టార్టప్ కంపెనీల స్థాపనకు సరైన వాతావరణం కల్పించడం ద్వారా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మెరుగునకు ప్రభుత్వం వివిధ రకాలైన చర్యలు తీసుకుంది. సులువుగా రిజిస్ట్రేషన్లు, చట్టపరమైన లాంఛనాలు, నియంత్రణపై వెసులుబాట్లు, పన్నుల్లో మినహాయింపులు తదితరమైన సదుపాయాలు కల్పిస్తూ స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహిస్తోంది. 2016 డిసెంబర్ నాటికి దేశంలో 4,700 స్టార్టప్ కంపెనీలు ప్రారంభమయ్యాయి. అయితే ఈ పథకాల ద్వారా అనుకున్నంతగా ఫలితాలు రాలేదు. ఒక ఏడాదిలోగానే 200 స్టార్టప్ కంపెనీలకు పైగా మూతబడ్డాయి. ఇలా మూతబడటం సర్వసాధారణమనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. పోటీ ప్రపంచంలో 20 శాతానికి మించి స్టార్టప్ కంపెనీలు మనుగడ సాగించలేవని (ఇండియా స్టార్టప్ అవుట్ లుక్ రిపోర్ట్ 2017) విశ్లేషిస్తున్నారు. స్టార్టప్ కంపెనీల మనుగడ రేటు పెంచడానికి మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. మరో పథకం స్టాండప్ ఇండియాను కూడా 2016 జనవరిలోనే ప్రారంభించారు. అట్టడుగు వర్గాలైన ఎస్సీ, ఎస్టీలతో పాటు మహిళలకు వ్యాపార అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ పథకాన్ని రూపొందించారు. డిసెంబర్ 2016 వరకు స్టాండప్ ఇండియా పథకంలో 15,341 మందికి లోన్లు ఇచ్చారు. లోన్లు పొందిన వారిలో 2,055 మంది మహిళలు, 2,568 ఎస్సీ మరియు 718 ఎస్టీ వర్గాలకు చెందిన వారు ఉన్నారు.

## ప్రధాన మంత్రి ముద్ర యోజన (పీఎంఎంవై)

సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు సంస్థాగత ఆర్థిక సాయం చేయడానికి 2015 ఏప్రిల్ నెలలో ప్రధాన మంత్రి ముద్ర యోజన (పీఎంఎంవై) పథకానికి శ్రీకారం చుట్టారు. పీఎంఎంవై కింద ఆర్థిక అవసరాలు, సంస్థ అభివృద్ధి కోసం మూడు రకాలైన లోన్లను మంజూరు చేస్తారు. వీటిలో శిశు (రూ. 50 వేలు), కిశోర్ (రూ. 50 వేల నుంచి రూ. 5 లక్షలు), తరుణ్ (రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలు) ఉన్నాయి. ఈ పీఎంఎంవై పథకం కింద మార్చి 2016 నాటికి మంజూరు చేసిన మొత్తం రూ. 1.25 లక్షల కోట్లు దాటింది. మొత్తం 3.27 కోట్ల మంది లబ్ధిదారులలో 3.03 కోట్ల మంది శిశు విభాగంలోనే ఉన్నారు.

## స్టార్టప్ విలేజ్ ఎంటర్ ప్రెన్యూర్షిప్ ప్రోగ్రామ్ (ఎస్వీఈపీ)

గ్రామీణ ప్రాంతాల్లో పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రభుత్వం స్టార్టప్ విలేజ్ ఎంటర్ ప్రెన్యూర్షిప్ ప్రోగ్రామ్ (ఎస్విఈపీ)పథకాన్ని ప్రారంభించబోతోంది. అవసరమైన సహాయం అందించడం ద్వారా ఆర్థిక అభివృద్ధిని గాడిలో పెట్టి, దానిని శక్తిమంతంచేసి గ్రామీణ ప్రాంతాల్లో స్థిరమైన స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించే ఉద్దేశంతో ఎస్వీఈపీ పథకానికి రూపకల్పన చేశారు. 2015-19 మధ్య కాలంలో 24 రాష్ట్రాల్లో, 125 బ్లాకుల్లోని 1.82 లక్షల గ్రామీణ ప్రాంత పరిశ్రమలను ఎస్వీఈపీ పథకం ద్వారా పటిష్ట పరచడం మరియు స్థాపించడం జరుగుతుందని అంచనా వేస్తున్నారు. దీని ద్వారా 3.78 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని భావిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేస్తే గ్రామీణ ప్రాంతంలో పెరుగుతున్న యువ జనాభాకు వ్యాపార అవకాశాలు మెరుగు పర్చడంలో గణనీయమైన పాత్ర పోషిస్తుంది.

## ముగింపు

జనాభాలో యువత శాతం పెరుగుదలతో ప్రస్తుతం భారతదేశం జనాభా పరివర్తన దశలో ఉంది. పెరుగుతున్న యువతకు మంచి విద్యతో పాటు నిలకడైన ఉపాధి అవకాశం ఉండాలి. పైన విశ్లేషణలు చూస్తే.. ముఖ్యంగా విద్యావంతులైన యువత విషయంలో సవాళ్లు చాలా పెద్దగా ఉన్నాయి. దురదృష్టకరమైన విషయం ఏమిటంటే.. ఒకవైపు ప్రపంచ యవనికపై భారత మహిళల ప్రాతినిధ్యం స్వల్పంగా ఉండగా, మరోపక్క శ్రామిక శక్తిలో చేరే యువతులలో నిరుద్యోగం చాలా ఎక్కువగా ఉంది. దీనిని సరిచేయడానికి ప్రభుత్వం నూతన పథకాలు ప్రవేశపెట్టింది. అయితే చేయాల్సినది చాలా ఉంది. నగ్దుల మరియు ఇతర ఆర్థిక పథకాలలో భాగంగా ఉద్యోగ అవకాశాలు సృష్టించడం జరగాలి. భారత ఆర్థిక వ్యవస్థ తగినన్ని ఉద్యోగాలను కల్పించలేదు. ఉపాధి కల్పన కార్యక్రమాలను వేగవంతం చేయలేదు. మంత్రిత్వ శాఖలు తమ పరిధిలోని పథకాలలో ఉపాధి కల్పన కార్యక్రమాన్ని చేర్చాలి. గుర్తించాల్సిన మరో విషయం.. పశ్చిమ, దక్షిణ భారతదేశంలో లాగా తూర్పు, మధ్య భారతంలోని చాలా భాగం అభివృద్ధి చెందకపోవడంతో అక్కడ ఉద్యోగాల సృష్టి జరగలేదు. ఇలాంటి అసమానతలు తొలగించాలి. అప్పుడు స్థానిక యువత వారి ప్రాంతంలోనే ఉపాధి పొందుతారు. మరింత మంది మహిళలకు ఉపాధి కల్పించడానికి అవసరమైన పథకాలను రూపొందించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం వేగవంతంగా చర్యలు తీసుకుంటే జనాభా ద్వారా వచ్చే లాభాన్ని పొందగలుగుతుంది. ఒకవేళ విఫలమైతే జనాభా ద్వారా వచ్చే లాభం కాస్తా జనాభా విపత్తుగా మారిపోయే ప్రమాదం ఉంది.

■

# సాధికారతే ఉపాధి అర్హతకు కీలకం

– సునీత సంఘీ



**2014లో ప్రభుత్వం ప్రకటించిన జాతీయ యువజన విధానం ప్రకారం 15 నుంచి 29 సంవత్సరాల మధ్య గల వారందరూ యువ జనాభాగా పరిగణనలోకి వస్తారు. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో యువతరం వాటా 28 శాతం ఉంది. భారత స్థూల జాతీయాదాయానికి (జిఎన్‌పి) వీరందిస్తున్న వాటా 34 శాతం ఉంది. యువతలోని సామర్థ్యాలను పూర్తిగా వినియోగంలోకి తీసుకురాగలిగితే నైపుణ్యాలు గల కార్మికశక్తి సరఫరాలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా నిలవగలుగుతుంది.**

"మెరుగైన భారతదేశం ఆవిష్కారం కావాలంటే నైపుణ్యాల వృద్ధి అత్యంత కీలకం. అభివృద్ధి పథంలో దేశాన్ని పయనింపచేయాలంటే యువతలో నైపుణ్యాలు పెంచడం ఒక ఉద్యమం కావాలి."

ప్రధాని నరేంద్రమోదీ 2014 ఆగస్టు 15వ తేదీన అన్న మాటలివి. భారతదేశం ప్రస్తుతం జనాభాపరంగా పరివర్తిత దశలో ఉంది. జనాభాలో 65 శాతం 15 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్కులైన వారే. ప్రపంచానికి నైపుణ్యాల రాజధాని కావడానికి మనకు ఇదే చక్కని అవకాశం. ప్రపంచ వ్యాప్తంగా భిన్న దేశాలు అనుసరిస్తున్న ప్రమాణాలకు దీటుగా భారత యువతలో నైపుణ్యాలను పెంచి వయసు మళ్లిన జనాభా కారణంగా అక్కడ ఏర్పడిన మానవ వనరుల కొరతను భర్తీ చేసేందుకు అవసరమైన మానవ వనరులను అందించగల స్థితిలో భారతదేశం ఉంది. 2014లో ప్రభుత్వం ప్రకటించిన జాతీయ యువజన విధానం ప్రకారం 15 నుంచి 29 సంవత్సరాల మధ్య గల వారందరూ యువ జనాభాగా పరిగణనలోకి వస్తారు. వారి అవసరాలు భిన్నంగా ఉండడంతో పాటు వారిలో ఎన్నో ఆశలు, ఆశయాలు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో యువతరం వాటా 28 శాతం ఉంది. భారత స్థూల జాతీయాదాయానికి (జిఎన్‌పి) వీరందిస్తున్న వాటా 34 శాతం ఉంది. కార్మిక శక్తిలో యువత భాగ స్వామ్యాన్ని, వారిలోని ఉత్పాదకతను పెంచడం ద్వారా జిడిపికి వారందించే వాటా మరింతగా పెంచవచ్చు. యువతలోని సామర్థ్యాలను పూర్తిగా వినియోగంలోకి తీసుకురాగలిగితే నైపుణ్యాలు గల కార్మికశక్తి సరఫరాలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా నిలవగలుగుతుంది.

జనాభాపరంగా భారతదేశం సాధించిన ఈ ప్రయోజనం దేశంలో అన్ని ప్రాంతాలకు సమానంగా విస్తరించలేదు. పశ్చిమబెంగాల్, కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ వంటి ద్వీపకల్ప రాష్ట్రాల్లో పని చేసే శక్తియుక్తులు గల, పని చేయగల వయస్సులోని యువజనాభా తగ్గుతుండగా వెనుకబాటుతనంతో అల్లాడుతున్న మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో యువజనాభా అధికంగా ఉన్నారు. జనాభాలో ఈ ధోరణిని బట్టి చూస్తే ద్వీపకల్ప రాష్ట్రాల్లో పెరగనున్న వృద్ధుల జనాభాకు అవసరమైన వసతులపై దృష్టి పెట్టి ఇతర రాష్ట్రాల్లో విద్య, నైపుణ్యాలు, ఉపాధి

నీతి ఆయోగ్ సలహాదారు, న్యూఢిల్లీ.
E-mail: sunitasanghi1960@gmail.com

అవకాశాలు పెంచడంపై దృష్టి కేంద్రీకరించాలి. కాని వెనుకబాటుతనంలో ఉన్న రాష్ట్రాల్లోని యువత మెరుగైన నైపుణ్యాలు సాధించడానికి ఇతర ప్రాంతాలకు వలస పోవడంపై ప్రదర్శిస్తున్న విముఖత ప్రధాన అవరోధంగా ఉంది. శిక్షణ వసతులకు ఖర్చు పెట్టుకోగల స్తోమత లేకపోవడం, అక్షరాస్యతలో వెనుకబాటు తనం, చైతన్యరాహిత్యం కూడా వారు ముందుకు రాకపోవడానికి కారణం.

అన్ని వయోశ్రేణుల్లోను స్త్రీ, పురుష లనే తేడా లేకుండా కార్మికశక్తి భాగస్వామ్యం గణనీయంగా క్షీణించినట్టు భిన్న గణాంకాల ద్వారా తెలుస్తోంది. గ్రామీణ మహిళల్లో ఈ క్షీణత శాతం మరింత ఎక్కువగా ఉండడం అక్కడ సరైన ఉపాధి అవకాశాలు లేవనేందుకు సంకేతం. అలాగే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని యువకులకు ఉపాధి మార్కెట్‌లో ప్రవేశించడానికి ముందే నైపుణ్యాలను పెంచాల్సిన అవసరం కూడా ఉంది. కార్మిక జనాభా నిష్పత్తి కూడా ఇదే తీరులో ఉంది. ఇక నిరుద్యోగిత రేటును పరిగణనలోకి తీసుకుంటే అన్ని వయోశ్రేణుల్లోనూ ఇది 6.1 శాతం నుంచి 15.6 శాతం మధ్యన ఉంది. పట్టణ మహిళల్లో (15-29) నిరుద్యోగిత గరిష్ఠంగా 15.6 శాతం ఉండగా అన్ని విభాగాల్లోనూ 15 నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్కుల్లోను నిరుద్యోగిత రేటు అధికంగా ఉంది. యువతలో నిరుద్యోగిత అధికంగా ఉండడం వల్ల జనాభాపరమైన ప్రయోజనం పూర్తిగా పొందలేక పోతున్నామన్నది వాస్తవం. సాధారణ విద్యావంతు ల్లోనేకాదు, వృత్తి విద్యల్లో డిప్లొమాలు, సర్టిఫికెట్లు గల వారిలో కూడా నిరుద్యోగిత రేటు అధికంగానే ఉంది.

ఈ విశ్లేషణను బట్టి చూస్తే యువతకు ఉద్యోగాలు కావాలి, పరిశ్రమకు నిపుణులైన మానవ వనరులు కావాలి. కాని ఈ రెండు వర్గాల కోర్కెలు తీరడానికైనా నైపుణ్యాలే ప్రధాన అవరోధంగా ఉన్నాయి. మొత్తం నిరుద్యోగితలో ఉద్యోగాన్వేషణలోని యువత 49 శాతం ఉన్నారు. 93 శాతం ఉపాధికి అవ్యవస్థీకృత రంగమే ఆలంబనగా ఉంది. మంచి విద్యార్హతలున్న వారిలో ఎక్కువ మంది నిరుద్యోగులుగా అయినా కాలం గడుపుతున్నారు లేదా తమ అర్హతల కన్నా తక్కువ స్థాయి ఉద్యోగాలు చేస్తున్నారు. 2017 సంవత్సరపు స్కిల్ నివేదిక ప్రకారం విద్యావంతులైన యువతలో 40 శాతం మందికి ఉపాధి అర్హత ఉంది. పని చేసే ప్రదేశాల్లో తగినన్ని వసతులు లేకపోవడం, అభద్రత, మార్కెట్ అనుసంధానిత నైపుణ్యాల లోటును తీర్చడం, నైపుణ్యాల అభివృద్ధిపై గల అపోహలు తొలగించడం చాలా అవసరం.

**ఉపాధి అర్హత పెంచేందుకు చర్యలు**

జనాభాపరంగా గల ప్రయోజనాన్ని పూర్తిగా వినియోగంలోకి తీసుకురావడం, యువతలో ఉపాధి అర్హతలను పెంచడం లక్ష్యంగా 2015 సంవత్సరంలో ప్రభుత్వం నైపుణ్యాల పెంపు, ఎంటర్- ప్రిన్యూర్‌షిప్ ప్రోత్సాహానికి జాతీయ నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం చేపట్టింది. నిపుణులైన మానవ వనరుల డిమాండు, సరఫరాల్లోని వ్యత్యాసాన్ని తొలగించడం, నైపుణ్యాలు పెంచడం, ఇప్పటికే నైపుణ్యాలు గల వారిలో వాటిని నవీకరించడం ఈ కార్యక్రమం లక్ష్యాలు. ఇందులో భాగంగా జాతీయంగాను, అంతర్జాతీయంగాను గుర్తించిన ప్రమాణాలతో కూడిన నైపుణ్యాలు అలవరచుకున్న వారికి సర్టిఫికెట్ జారీ చేస్తారు. భిన్న మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయం పెంచడం, సమాయత్తత, అంతర్జాతీయ భాగస్వామ్యాలు, ఐసిటి వినియోగం, బోధకులకు శిక్షణ వంటి కార్యకలాపాలు చేపడతారు. నాణ్యత, సామర్థ్యాల పెంపు ద్వారా వృత్తివిద్యా విభాగానికి కూడా కొత్త ఉత్తేజం కల్పిస్తారు. పాఠశాల విద్యలో కూడా వృత్తి విద్యల పరిమాణాన్ని పెంచుతారు. 9వ తరగతి, ఆ పైన పాఠ్యాంశాల్లో పరిశ్రమలకు సంబంధించిన పాఠ్యాంశాలు ప్రవేశపెట్టడంతో పాటు ప్రాక్టికల్ శిక్షణ, ఉపాధ్యాయ శిక్షణ చేపడతారు. పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో (ఐటిఐ) పరిశ్రమలకు అవసరమైన కోర్సులను ప్రవేశపెట్టడంతో పాటు పారిశ్రామిక సంస్థలతో భాగస్వామ్యాలు కుదుర్చుకుని అవసరమైన సహకారం తీసుకుంటారు. రంగాల వారీగా నైపుణ్యాల మండలులు ఏర్పాటు చేయడం ద్వారా పరిశ్రమలతో మరింత మెరుగైన అనుసంధానత సాధించడానికి, అప్రెంటిస్-షిప్ వసతుల పెంపునకు కృషి చేస్తారు. నైపుణ్యాల విశ్వవిద్యాలయాల ద్వారా మరింత మెరుగైన సామర్థ్యాలు గల అధ్యాపకులను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేయడంతో పాటు సరికొత్త పరిశోధనాంశాలను సిద్ధం చేస్తారు.

నైపుణ్యాల వృద్ధి, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మంత్రిత్వ శాఖతో పాటు 20 కేంద్ర మంత్రిత్వ శాఖలు తీసుకుంటున్న చొరవలను సార్వత్రిక కార్యక్రమాలు, ఆయా ప్రాంతాలకు, ఆయా రంగాలకు పనికివచ్చే కార్యక్రమాల పేరిట నాలుగు రకాలుగా వర్గీకరించవచ్చు. దేశ యువతలో నైపుణ్యాల అవసరాలు తీర్చేందుకు 1300 సంస్థలు, నాలుగు వేలకు పైగా పాలిటెక్నిక్‌లు, 20 వేలకు పైగా వృత్తి విద్యాసంస్థలు కృషి చేస్తున్నాయి. విశ్వసనీయమైన సర్టిఫికెట్ల మంజూరు, రుణాల కల్పన వంటి చర్యల ద్వారా వ్యక్తిగత సామర్థ్యాలు పూర్తిగా వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నాయి. అసంఘటిత రంగంలో నైపుణ్యాల కొరత తీవ్రంగా ఉన్న నేపథ్యంలో పిఎంకెవివై కింద ఎంత మందికి నైపుణ్యాల శిక్షణ అందించాలన్నది మదింపు చేసి నైపుణ్యాలను పెంచడం, కొత్త నైపుణ్యాలను అలవరచడం అత్యంత కీలకం. ప్రధానంగా ఉన్నత విద్య మధ్యలోనే వదిలివేసిన వారికి ఉద్యోగాలకు

అవసరమైన నైపుణ్యాలు అలవరచడం ద్వారా కార్మిక శక్తిలో ప్రవేశానికి మరో అవకాశం కల్పిస్తున్నారు.

జాతీయ నైపుణ్యాల అభివృద్ధి సంస్థ ఈ దిశగా పలు చొరవలు తీసుకుంటోంది. వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖల నిర్వహణలోని నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాల వ్యయాలు, కాలపరిమితి, పాఠ్యాంశాల్లో సారూప్యతలు తీసుకువచ్చేందుకు, భిన్న వర్గాలకు అందుబాటులో ఉంటున్న సమాచారంలోని లోటుపాట్లు సరిదిద్దేందుకు, నైపుణ్యాల కల్పనలో సాధిస్తున్న పురోగతి మదింపునకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. విధానంలో నిర్దేశించిన మేరకు లక్ష్యాలు సాధించడానికి ప్రైవేటు రంగంతో సమన్వయం చేసుకుంటోంది. రంగాలవారీగా ఏర్పాటు చేసిన నైపుణ్యాల మండలులు, పారిశ్రామిక విభాగాల ప్రతినిధుల సహకారంతో పాఠ్యాంశాలు రూపొందిస్తోంది. పేద విద్యార్థులు నైపుణ్యాల్లో శిక్షణ పొందేందుకు నైపుణ్య రుణాలను కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టింది. యువతలో నైపుణ్యాల వృద్ధి కోసం విధానపరమైన, చట్టపరమైన చొరవలతో పలు కార్యక్రమాలు చేపట్టినప్పటికీ యువశక్తిని సంపూర్ణంగా ఉపయోగించుకుని దేశాన్ని మరింత వేగవంతమైన అభివృద్ధి పథంలో ప్రవేశపెట్టడానికి చేయాల్సింది ఇంకా ఎంతో ఉంది. అదేమిటో చూద్దాం...

## యువతలోని ఆశల గుర్తింపు

సామాజిక, ఆర్థికాభివృద్ధిలో యువత మరింత చురుకైన భాగస్వాములు కావాలంటే వారి ఆశయాలను గుర్తించి వాటికి అనుగుణంగా వారిలోని నైపుణ్యాలు స్థిరంగా పెంచేందుకు ప్రయత్నం చేయాలి. 2011-12 సంవత్సరంలో జరిగిన సర్వే కింద అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం గ్రామీణ యువతలో 22.3 శాతం మంది యువకులు డ్రైవింగ్, మోటార్ మెకానిక్ విభాగంలో శిక్షణ పొందేందుకు ప్రాధాన్యం ఇవ్వగా పట్టణ ప్రాంత యువకుల్లో 26.3 శాతం మంది కంప్యూటర్ ట్రేడ్‌లో శిక్షణకు ప్రాధాన్యం ఇచ్చారు. మహిళల విషయానికి వస్తే గ్రామీణ యువతుల్లో 32.2 శాతం మంది టెక్స్‌టైల్స్‌కు సంబంధించిన నైపుణ్యాలు పెంచుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వగా పట్టణ యువతుల్లో 30.4 శాతం మంది కంప్యూటర్ ట్రేడ్‌లో శిక్షణకు ప్రాధాన్యం ఇచ్చారు. ఈ గణాంకాలను వాస్తవ పరిస్థితితో మదింపు చేసి చూడగా యువత అవసరాలకు, శిక్షణ వసతులకు మధ్య తీవ్ర అంతరం నెలకొన్నట్టు తేలింది. జాతీయ నైపుణ్యాల అభివృద్ధి మండలి నివేదికల ప్రకారం అధిక ఉపాధిని కల్పించే రంగాల్లో నిపుణులైన మానవ వనరులకు సంబంధించి సవాళ్లు న్నాయి. ప్రధానంగా రాష్ట్రాల స్థాయిలో నిర్మాణం, రవాణా, లాజిస్టిక్స్, వ్యవసాయ, ఆహార ప్రాసెసింగ్ రంగాల్లో నిపుణుల కోసం డిమాండు అధికంగా ఉన్నట్టు తేలింది. అందుకే డిమాండు, సరఫరాలో వ్యత్యాసాన్ని తొలగించాలంటే యువతలోని ఆశయాలపై అధ్యయనం నివేదికలు రూపొందించి అందుకు అనుగుణమైన చర్యలు తీసుకోవడం అవసరం.

## యువతలో చైతన్యం

జాతీయ నైపుణ్యాల అభివృద్ధి సంస్థ అంచనా ప్రకారం 2022 నాటికి దేశంలో 11 కోట్ల మందికి నైపుణ్యాల శిక్షణ అందించాలి. 29 కోట్ల మందిలో నైపుణ్యాలను పెంచేందుకు ప్రయత్నం చేయాలి. ఇవి జరగాలంటే ఈ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున భాగస్వాములయ్యేలా యువతను చైతన్యవంతులను చేయాలి. యువతను ఎంత పెద్ద మొత్తంలో సమీకరించగలిగామన్న దానిపై ఈ కార్యక్రమం విజయం ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం నైపుణ్యాల శిక్షణకు అభ్యర్థులను ఆకర్షించే బాధ్యత శిక్షకులదే. అయితే వృత్తి విద్యల పట్ల సమాచారం కొరత, కార్మిక మార్కెట్ తమ జీవితాల్లో తీసుకువచ్చే మార్పుపై చైతన్య రాహిత్యం కారణంగా తగినంత మంది ఈ దిశగా అడుగేయడంలేదు. నైపుణ్యాల అభివృద్ధి దిశగా యువతను ఆకర్షించాలంటే వారిలో శ్రమశక్తికి గల ఔన్నత్యంపై చైతన్యం పెంచాలి. కేవలం బ్లూ కాలర్ ఉద్యోగాలకే గౌరవం ఉంటుందన్న అపోహ తొలగించాలి. అంతే కాదు వృత్తి విద్యలు అల్పాదాయ వర్గాల వారికి భరించగల స్థాయికి దిగి రావాలి. కాలం చెల్లిపోయిన పాఠ్యాంశాలు తొలగించాలి. కార్మికశక్తిలోకి మహిళలను ఆకర్షించడానికి మహారాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన “స్కిల్ సఖి” కార్యక్రమం చక్కని ఉదాహరణ. ఆ రాష్ట్రంలో ఎంపిక చేసిన మహిళలకు శిక్షణ ఇచ్చి “స్కిల్ సఖి” గా నియమించి యువతుల్లో చైతన్యం పెంచడానికి సమాజంలోకి పంపుతు న్నారు. స్థానిక సంస్థలు కూడా ఈ విషయంలో చొరవ చూపించవచ్చు. తమ ప్రాంతంలో శిక్షణకు అనుకూలత, అర్హత గల యువత ఎంతమంది ఉన్నారన్న గణాంకాలు సేకరించి వారి డేటాబేస్‌ను ఎస్ఎస్‌డిఎంకి అందించవచ్చు. వారి వివరాల కోసం ఆధార్ కార్డు, ఓటర్ ఐడి, బ్యాంకు ఖాతా నంబర్ తీసుకుని ఎన్ఎస్‌డిఎం పోర్టల్‌కు పంపవచ్చు. యువతలోను, తల్లిదండ్రుల్లోను చైతన్యం నింపేందుకు ప్రత్యేకంగా శిక్షణ పొందిన సిబ్బందిని పంపి ప్రచారం చేయించడం వల్ల కూడా మంచి ఫలితాలుంటాయి. అంతే కాదు, ప్రభుత్వాలు తమ వంతుగా పాఠశాలలు, కళాశాలలకు ప్రచారకర్తలను పంపి కాంటాక్ట్ కార్యక్రమాల నిర్వహణ ద్వారా విద్యార్థుల్లో చైతన్యం కల్పించవచ్చు.

## శిక్షణ అవసరాల్లో వైరుధ్యం

భారత కార్మిక మార్కెట్ అత్యంత విలక్షణమైనది. లింగపరంగాను, ప్రాదేశికంగాను వైరుధ్యాలు చాలా ఉన్నాయి. ప్రధానంగా 93 శాతం మంది అవ్యవస్థీకృత రంగంలోని సంస్థల్లోనే పని చేస్తుండగా

కేవలం ఎనిమిది శాతం మంది వ్యవస్థీకృత సంస్థల్లో పని చేస్తున్నారు. ఈ రెండు వ్యవస్థలకు శిక్షణ అవసరాలు భిన్నంగా ఉంటాయి. ప్రత్యేక నైపుణ్యాల కొరత అవ్యవస్థీకృత రంగాన్ని కుంగదీస్తోంది. ఈ రంగంలో పని చేస్తున్న కార్మికుల్లో నిరక్షరాస్యతే కాకుండా నైపుణ్యాల లోపం కూడా చాలా ఎక్కువ. ఇలాంటి వారిని శిక్షితులను చేసేందుకు జాతీయ అప్రెంటిన్‌షిప్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలి. ఇది ఒక కోణం అయితే కార్మికశక్తిలో మహిళల భాగస్వామ్యం మరో కీలకాంశం. **దేశ జనాభాలో 48 శాతం మహిళలే ఉన్నప్పటికీ కార్మికశక్తిలో మాత్రం వారి భాగస్వామ్యం 22 శాతం మేరకు మాత్రమే ఉంది.** మహిళా శక్తిని సంపూర్ణంగా వినియోగించుకుని వారిని అభివృద్ధి కార్యక్రమాలతో అనుసంధానం చేస్తే దేశాభివృద్ధి వేగం అందుకుంటుందని ప్రధాని స్వయంగా అన్నారు. మహిళలకు సమానావకాశాలు కల్పించేలా పారిశ్రామికులను ఒప్పించడంతో పాటు మహిళల్లో నైపుణ్యాలు పెంచే కార్యక్రమాలు చేపట్టడం చాలా అవసరం. మహిళలు సాంప్రదాయిక శృంఖలాలు ఛేదించుకుని కొత్త కార్యకలాపాలు చేపట్టేందుకు ముందుకు వచ్చేలా ప్రోత్సహించాలి. జిందాల్ స్టీల్ సహకారంతో మహిళల్లో సామర్థ్యాల పెంపునకు హర్యాణా ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం ఇందుకు చక్కని ఉదాహరణ. రంగాల వారీగాను, లింగపరం గానే కాదు, మౌలిక వసతుల పరంగా కూడా ప్రాంతాలు, రాష్ట్రాల మధ్య వ్యత్యాసాలు న్నాయి. దక్షిణ, పశ్చిమ ప్రాంత రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐలు 67 శాతం ఉండగా జాతీయ స్థాయి సీట్లలో 60 శాతం సామర్థ్యాలతో 51 శాతం మంది జనాభా అవసరాలు తీర్చుతున్నాయి. కానీ, ఈశాన్య, తూర్పు ప్రాంతాల్లో 33 శాతం ఐటిఐలు మాత్రమే ఉన్నాయి. అవి కేవలం 40 శాతం సీట్లతో 49 శాతం జనాభా అవసరాలకు మాత్రమే ఉపయోగపడుతున్నాయి. ఈ లోటు రాష్ట్రాల్లో అంతర్గతంగాను, ప్రాంతాల వారీగాను కూడా ఉంది. ఈ తరహా వ్యత్యాసం వల్ల ఒక ప్రాంతంలోని వారు మరింత మెరుగైన వసతులున్న మరో ప్రాంతానికి వలస పోతున్నారు. ఈ లోపాన్ని సరిదిద్దడానికి ప్రైవేటు రంగం సహకారం అత్యంత అవసరం. కార్పొరేట్ సామాజిక బాధ్యతగా ప్రైవేటు రంగం క్రియాశీల పాత్ర పోషించడానికి ముందుకు రావాలి. మౌలిక వసతుల అభివృద్ధి, ఉపాధి శిక్షణ, అప్రెంటిస్ శిక్షణ, పాఠ్యాంశాల సవరణ, ఉపాధికి సిద్ధంగా ఉన్న మానవ వనరుల తయారీ కార్యకలాపాల్లో చురుకైన భాగస్వామి కావాలి.

**రెండో అవకాశం : నైపుణ్యాల పెంపు**

**దేశంలో భారీ సంఖ్యలో యువత సెకండరీ విద్యా స్థాయిలోనే చదువుకి స్వస్తి చెబుతున్నారు. 47 శాతం మంది ఈ స్థాయి నుంచే చదువు వదిలేస్తు న్నారని ఒక అధ్యయనంలో తేలింది. ఈ కారణంగా వారు అతి తక్కువ నైపుణ్యాలతో అతి తక్కువ వేతనాలతోనే ఉపాధి రంగంలో ప్రవేశిస్తున్నారు.**

ఇలాంటి వారందరికీ నైపుణ్యాలు మెరుగుపరుచుకునే అవకాశం కల్పించడం కూడా అత్యంత అవసరం. యువతను ఉపాధి రంగానికి సంసిద్ధులను చేసేందుకు పలు కార్యక్రమాలున్నప్పటికీ నైపుణ్యాల మెరుగుదల, కొత్త నైపుణ్యాలు అలవరచడం వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఇలాంటి అదనపు నైపుణ్యాలు అలవరచిన కార్మికశక్తిని గుర్తించడం, వారికి ఎలాంటి నైపుణ్యాలు అవసరమో గుర్తించడం ఒక సవాలు. ఇందుకోసం ఇలాంటి కార్మికశక్తిలో నైపుణ్యాల వ్యత్యాసంపై అధ్యయనం జరిపించాలి. ఆ అధ్యయనం ఆధారంగా వారిలోని నైపుణ్యాల్లో లోపాన్ని గుర్తించి ఉత్పాదకత పెంచడానికి అవసరమైన శిక్షణ ఇవ్వడం ద్వారా ఉద్యోగం, వేతనం, జీవనశైలి అన్నింటిలోనూ మార్పు తీసుకురావచ్చు. అలాగే కొన్ని నైపుణ్యాలుండి కూడా సర్టిఫికెట్లు లేని కారణంగా కొంత మంది తక్కువ హోదాల్లో పని చేస్తూ తక్కువ వేతనాలు పొందుతూ ఉండవచ్చు. హస్తకళాకారులు, చేతి వృత్తి పనివారు ఈ కోవలోకి వస్తారు. ఇలాంటి వారందరికీ ఒకే రకమైన శిక్షణ సరిపోదు. వారు పని చేస్తున్న విభాగాన్ని బట్టి అందులో వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి.

**పాఠశాల నుంచి పనికి పరివర్తనపై సర్వే**

దేశంలో కార్మికశక్తిలో నాణ్యత పెంచాలంటే 15 నుంచి 29 సంవత్సరాల మధ్య వయస్కులైన యువతకు అవసరం అయిన సమాచారం సరైన రీతిలో అందించడం అవసరం. దేశంలో ఉద్యోగిత, నిరుద్యోగిత తీరుతెన్నులు, కార్మికశక్తి, రంగాలవారీగా ఉపాధి అవకాశాలు వంటి అన్ని అంశాలపై సమగ్ర సర్వే నిర్వహించాలి. ఇలాంటి గణాంకాలు సేకరించడం వల్ల జాతీయ ఉపాధి కార్యక్రమాలను నిర్దిష్ట సవాళ్లకు అనుగుణంగా రూపొందించి అమలుపరచవచ్చు. ప్రధానంగా యువకులు, యువతులు ఎదుర్కొంటున్న సవాళ్లు కూడా తెలుస్తాయి. ఈ సమాచారం కారణంగా విధానకర్తలు ఆయా వర్గాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తీర్చగల రీతిలో చక్కని ముందస్తు సమాచారంతో నిర్ణయాలు తీసుకోగలుగుతారు. దీని వల్ల యువత విద్యారంగం నుంచి ఉపాధి రంగంలోకి సంతృప్తికరంగా ప్రవేశించి ఉద్యోగ భద్రత సాధించగలుగుతారు. కార్మిక మార్కెట్‌లో వైరుధ్యాలు సవరించే దిశగా ఇది కూడా ఒక చక్కని అడుగు అవుతుంది. పారిశ్రామికీకరణ వల్ల భవిష్యత్తులో ఎదురు కానున్న సవాళ్లను పరిష్కరించడంలో మార్గదర్శకంగా నిలవగలుగుతుంది.

■

**ప్రేరణే జీవం**

ప్రత్యేక వ్యాసం

# పారిశ్రామికాభివృద్ధికి అంకుర సంస్థలు

- సౌరభ్ సన్యాల్
- డాక్టర్ రంజిత్ మెహతా

**అంకుర సంస్థను ప్రారంభించడం ఒక కష్టసాధ్యమైన పని. ఈ విషయంలో ప్రతి దేశం విజయాల కంటే వైఫల్యాలనే ఎక్కువగా చవి చూసింది. అంకుర సంస్థల వైఫల్యం ఒక సామాన్య అపజయం గా స్వీకరించాలి. ముందు ముందు ఏమి చేయాలి, ఏమి చేయకూడదు అనే విషయాలను - ఆ వైఫల్యాలు - పారిశ్రామిక వేత్తకు అప్పుడప్పుడు తెలియజేస్తాయి. ఒక అంకుర సంస్థకు తగిన మార్గదర్శకులు ఉండడం చాలా ముఖ్యం.**

భారత్‌లో ప్రతి సంవత్సరం 10 మిలియన్ ఉద్యోగాల అవసరం ఉంది. "ఏ దేశంలోనైనా కొత్త ఉద్యోగాల కల్పన అంకుర సంస్థలలోనే కానీ - అది పెద్ద పెద్ద సంస్థలలో కాదు" - అని గ్లోబల్ డాటా తెలియజేస్తోంది. ఆవిష్కరణలకు అంకుర సంస్థలు కూడా కేంద్రాలుగా ఉన్నాయి. ఆర్థిక వ్యవస్థలో ఉపాధి కల్పనను విస్తరించేందుకు ఇదే గొప్ప మార్గం. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2016 జనవరి 16న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ నుండి "స్టార్ట్-అప్ ఇండియా'' అనే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. పారిశ్రామికాభివృద్ధి లక్ష్యంగా ఈ చర్యను చేపట్టారు. అంకుర సంస్థల వృద్ధికి అనుకూలమైన పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా ఆవిష్కరణలను ప్రోత్సహిస్తారు. భారతదేశం ఉద్యోగాలు అర్థించే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి తప్పకుండా మార్చాలన్నదే దీని లక్ష్యం. ప్రధానమంత్రి రూపొందించిన "స్టార్ట్-అప్ ఇండియా" ఇప్పటికే దేశంలోని పారిశ్రామిక వేత్తలలో భారీ సానుకూలతను తీసుకు వచ్చింది. అంతర్జాతీయంగా అతి ఎక్కువ సంఖ్యలో అంకుర సంస్థలు గల మూడో దేశంగా భారత్ గుర్తింపు పొందింది అనే వాస్తవంతో పారిశ్రామిక వర్గం మరింత ఉప్పొంగింది. దేశంలో ఆవిష్కరణ అనే ఫలవంతమైన సంస్కృతిని పెంపొందించడం ఒక దీర్ఘకాల, ముఖ్యమైన గమనం. భారతదేశాన్ని ఆవిష్కరణలు, రూపకల్పన, అంకుర సంస్థల కేంద్రంగా రూపొందించాలన్న భారత ప్రభుత్వం నిబద్ధతను పునరుద్ఘాటించేందుకు ఈ చర్య ఒక ముఖ్యమైన మార్గంగా దోహదపడు తుంది.

అంకుర సంస్థ అంటే అప్పుడే అభివృద్ధి ప్రారంభించిన ఒక చిన్న సంస్థ. అంకుర సంస్థలు సాధారణంగా చిన్నగా, స్వల్ప పెట్టుబడితో, కేవలం ఒకరు లేదా ఇద్దరు వ్యవస్థాపకులు లేదా వ్యక్తుల చేత నిర్వహించ బడుతుంది. మార్కెట్లో ఎక్కడా లేని లేదా వ్యవస్థాపకులు తాము తక్కువ స్థాయిలో చేయగలమని నమ్మిన ఒక వస్తువు లేదా సేవలను ఈ కంపెనీలు సమర్పిస్తాయి. ప్రారంభంలో ఈ అంకుర సంస్థల ఖర్చులు వాటి రాబడికంటే ఎక్కువగా ఉంటాయి. ఎందుకంటే ఆ సమయంలో వారు అభివృద్ధి, పరీక్షలు, తమ ఆలోచనలను మార్కెట్ చేయడం వంటి వాటిపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరిస్తారు. అందువల్ల, వాటికి తరచుగా

సెక్రటరీ జనరల్, పి హెచ్ డి సి సి ఐ. E-mail: saurabh.sanyal@phdcci.in
డైరెక్టర్, పి హెచ్ డి సి సి ఐ . E-mail: ranjeetmehta@gmail.com

పెట్టుబడి అవసరమవుతుంది. బ్యాంకులు, పరపతి సంఘాలు, సమకూర్చే సంప్రదాయ, చిన్న వ్యాపార రుణాలు, ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నిర్వహించే స్థానిక బ్యాంకులు అందించే చిన్న వ్యాపార నిర్వహణ రుణాలు లేదా లాభాపేక్ష లేని సంస్థల నుండి, రాష్ట్ర ప్రభుత్వాల నుండి గ్రాంట్లు మొదలైన వాటితో ఈ అంకుర సంస్థలు తమ నిధులను సమకూర్చుకుంటాయి.

అంకురసంస్థలు తప్పనిసరిగా రెండు రకాలుగా ఉంటాయి. ఒకటి, వినూత్నమైన దాన్ని ప్రారంభించడం, ఇప్పటి వరకూ ఎవ్వరూ ఆలోచించని, చేపట్టని పనిని ప్రారంభించడం. ఈ రకమైన అంకుర సంస్థను నెలకొల్పడం కష్టం. అయితే ఒకసారి ప్రారంభిస్తే అది అనూహ్యమైన పురోగతిని చవిచూస్తుంది. ఇక రెండో రకం అంకుర సంస్థలు ప్రాథమికంగా ఒకసారి కనిపెట్టిన విషయాన్ని మళ్ళీ కనిపెట్టాలని అనుకోవు. ఏదో ఒక కొత్త, వినూత్న విషయాన్ని సృష్టించడం కోసం " కొత్త సీసాలో పాత సారా" అనే చందాన వారు తపన పడుతూ ఉంటారు.

పారిశ్రామికత, అంకుర సంస్థలు అనేవి దేశంలో ఇటీవలి కాలంలో వచ్చిన అసాధారణ విషయాలు. అంకుర సంస్థను ప్రారంభించడం ఒక కష్టసాధ్యమైన పని. ఈ విషయంలో ప్రతి దేశం విజయాల కంటే వైఫల్యాలనే ఎక్కువగా చవి చూసింది. అపజయాలను, ఊహించని కష్టాలనూ తరచూ ఎదుర్కోడానికి ఒక పారిశ్రామిక వేత్త కంటే వీరు ఎక్కువగా సిద్ధపడవలసి ఉంటుంది. పారిశ్రామికత వేడుకలతో వృద్ధిలోకి వస్తుంది. వ్యాపార వైఫల్యాలను అభినందించడంలో ఒక సమాజం విఫలమైతే – ఆసంస్థల ఆవిష్కరణలు, సృజనాత్మకత ఆ సంస్థ ప్రారంభించడానికి ముందే తుడిచిపెట్టుకునిపోతాయి. అంకుర సంస్థల వైఫల్యం ఒక సామాన్య అపజయంగా స్వీకరించాలి. ముందు ముందు ఏమి చేయాలి, ఏమి చేయకూడదు అనే విషయాలను – ఆ వైఫల్యాలు – పారిశ్రామిక వేత్తకు అప్పుడప్పుడు తెలియజేస్తాయి. అంకురసంస్థల్లో మీకు సహ వ్యవస్థాపకులు ఉండవచ్చు. అయితే మీకు వ్యాపార విజయాలపై అవసరమైన చతురత ఉండ వలసిన అవసరం లేదు. ఒక గొప్ప ఆలోచన రావడం – ఆ ఆలోచనను ఒక వ్యాపార విజయంగా మలచుకోవడం – అనేవి రెండూ భిన్నమైనవి. ఒక అంకుర సంస్థకు తగిన మార్గదర్శకులు ఉండడం చాలా ముఖ్యం. వారు ఇదేవిధమైన ప్రక్రియను ప్రారంభించి, తగిన వ్యాపార అనుభవం కలిగి ఉండాలి. ఒక గొప్ప మార్గదర్శకుడు ఎప్పుడూ కూడా విలువైన వస్తువులను జోడించడం ద్వారా అపజయాలను విజయాలనుంచి దూరం చేస్తాడు. అయితే, దేశంలో అంకుర సంస్థల మార్గదర్శకులకు అధికారిక యంత్రాంగం ఏదీ లేదు. ప్రతి మార్గదర్శనం తాత్కాలిక ప్రాతిపదికపైనే ఉంటుంది. నిధులు సమకూర్చుకున్న అంకుర సంస్థలు తమ పెట్టుబడిదారుల నుండి కొంత మార్గదర్శ నాన్ని ఆశిస్తాయి. అయితే అది నిజాయితీగా, నిష్పక్షపాతంగా ఉండాలి. మంచి వ్యాపార మార్గదర్శకులు ఈమధ్య చాలా తక్కువమంది ఉన్నారు. మంచి మార్గదర్శకులను పొందడం అంకురసంస్థలకు ఎప్పుడూ ఒక అసాధ్యమైన పనిగానే ఉంది.

**అంకుర సంస్థలు ఎదుర్కొంటున్న సవాళ్ళు :**

దేశవ్యాప్తంగా మొదటి తరం పారిశ్రామికవేత్తలలో చాలా మంది – "స్టార్ట్–అప్ ఇండియా" పథకం కింద తమ వ్యాపార సంస్థలు గుర్తింపు పొందాలనే ఉద్దేశ్యంతో – ప్రభుత్వ కృషిని మెచ్చుకుంటున్నారు. అయితే నిధులు, పేటెంటు, మేధో సంపద సృష్టి మొదలైన సవాళ్ళలో చాలా వరకు అపరిష్కృతంగానే ఉంటున్నాయి. అదేవిధంగా, పేటెంటు నమోదుకు సుదీర్ఘ ప్రక్రియ, పరిశోధన, అభివృద్ధికి సరైన ప్రోత్సాహం లేకపోవడం మరొక అవాంతరంగా ఉంది. ఇదే కారణంతో చాలా మంది తమ అంకురసంస్థలను విదేశాలలో ప్రారంభించడానికి ఇష్టపడుతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం, 2015 నవంబర్ 1 నాటికి – సుమారుగా 2,46,495 దరఖాస్తులు పేటెంటు కోసం పెండింగ్ లో ఉన్నాయి. 5,32,682 దరఖాస్తులు ట్రేడ్ మార్క్ కోసం పెండింగు లో ఉన్నాయి.

ఇటీవలి ఒక అధ్యయనం ప్రకారం, 94 శాతం కంటే ఎక్కువ కొత్త వ్యాపారాలు ప్రారంభమైన మొదటి సంవత్సరంలోనే విఫలమౌతున్నాయి. నిధుల కొరత సాధారణ కారణాల్లో ఒకటిగా ఉంది. ఏ వ్యాపారానికైనా డబ్బు ప్రాణాధారం లాంటిది. ఎంతో కాలంగా నష్టాలు వస్తున్నా ఆదాయం వస్తుందన్న ఆశతో కొనసాగుతున్న వ్యాపారానికి మూలధనం అనే ఇంధనం కావాలి. ఆ కారణంగానే – వ్యాపారం యొక్క దాదాపు ప్రతి స్థాయిలోనూ – పారిశ్రామిక వేత్తలు–తమను తాము ప్రశ్నించుకుంటారు – నా అంకురసంస్థకు నేను ఏ విధంగా నిధులు సమకూర్చగలను? అని. అంకుర సంస్థలకు మార్కెట్‌లో నిధులు సమకూర్చే అనేక సంస్థలు అందుబాటులో ఉన్నాయి.

**అంకుర సంస్థలు తమ వ్యాపారం కోసం నిధులు సమకూర్చుకోడానికి వీలుగా కొన్నిఅవకాశాల వివరాలు ఇక్కడ పొందుపరచడం జరిగింది :**

1 సుమారు 10 లక్షల SME లకు 20,000 కోట్ల రూపాయల ప్రాథమిక కార్పస్ నిధితో – ప్రధానమంత్రి సూక్ష్మ యూనిట్ల అభివృద్ధి, రీఫైనాన్సు ఏజెన్సీ సంస్థ (ముద్రా) ను ప్రారంభించారు. మీ వ్యాపార ప్రణాళికను మీరు సమర్పించవచ్చు. అది ఆమోదం పొందగానే, రుణం మంజూరవుతుంది. మీకు క్రెడిట్ కార్డు లాగా ఉండే ముద్రా

కార్డు ఇవ్వడం జరుగుతుంది. దాన్ని మీరు ముడి సరుకు కొనుగోలు చేయడానికీ, ఇతర ఖర్చులకూ ఉపయోగించుకోవచ్చు. ఈ హామీ పథకంలో – శిశు, కిషోర్, తరుణ్ అనే మూడు రకాల రుణాలు అందుబాటులో ఉంటాయి.

2 **బూట్ స్ట్రాపింగ్ లేదా స్వీయ నిధుల సమీకరణ:** అంకుర సంస్థలకు నిధులు సమకూర్చడానికి ఇది ఒక సమర్థవంత మైన విధానం. మొదటిసారి పారిశ్రామిక వేత్తలుగా వచ్చిన వారు – వారి విజయానికి ఎటువంటి, ప్రణాళిక వంటివి ముందుగా చూపకుండా – మొదటి సారి నిధుల సమీకరణకు తరచుగా ఇబ్బందులు ఎదుర్కొంటారు.

3 **క్రౌడ్ ఫండింగ్** – క్రౌడ్ ఫండింగ్ అంటే ఒకే సారి ఒకరి కంటే ఎక్కువ మంది దగ్గర నుంచి ఒక ఋణం లాగా ప్రీ ఆర్డర్, సహకారం లేదా పెట్టుబడి తీసుకోవడం. ఈ విధానంలో తన వ్యాపారం గురించి వివరణాత్మక వివరాలను ఒక అంకురసంస్థ క్రౌడ్ ఫండింగ్ వేదికపై పొందుపరుస్తుంది. తన వ్యాపార లక్ష్యాలను, లాభార్జనకు ప్రణాళికలను, ఎన్ని నిధులు కావాలి? ఎందుకు కావాలి? మొదలైన వివరాలను పొందుపరుస్తారు. అప్పుడు ఆ వ్యాపారానికి సంబంధించిన వివరాలను – వినియోగదారులు చదివి, ఆ ఆలోచన నచ్చితే నిధులు సమకూరుస్తారు. నిధులు సమకూర్చిన వారు – ఉత్పత్తిని ముందుగా కొనుగోలు (ప్రీ–బైయింగ్) చేయడానికి లేదా ఒక విరాళం ఇవ్వడానికి ఆన్‌లైన్‌లో ప్రతిజ్ఞ తీసుకుంటారు. దాన్ని నిజంగా నమ్మినట్లైతే – ఒక వ్యాపారానికి సహాయం చేయడానికి ఎవరైనా నిధులు సమకూర్చవచ్చు. భారతదేశంలో ఈ విధమైన క్రౌడ్ ఫండింగ్ సైట్లలో ఇండియాగోగో (Indeigogo), విష్‌బెర్రీ (wishberry), కెట్టో (ketto), ఫండ్ లైన్డ్ (fundlined) మొదలైనవి ఉన్నాయి.

4 **ఏంజెల్ ఇన్వెస్ట్‌మెంట్** – మిగులు ధనంతో, రానున్న స్టార్ట్ అప్‌లలో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి కలిగిన వ్యక్తులను ఏంజెల్ పెట్టుబడిదారులు అంటారు. పెట్టుబడి పెట్టే ముందు, ప్రతిపాదనలను సమిష్టిగా పరిశీలించడం కోసం వారు గ్రూప్ నెట్ వర్క్ లలో కూడా పనిచేస్తారు. వారు సలహాలు ఇస్తారు లేదా పెట్టుబడితో పాటు సూచనలు కూడా ఇస్తారు. గూగుల్, యాహూ, ఆలీబాబాతో సహా అనేక ప్రముఖ కంపెనీలు ప్రారంభించడానికి ఏంజెల్ ఇన్వెస్టర్లు సహాయపడ్డారు. ఇటువంటి ప్రత్యామ్నాయ తరహా పెట్టుబడి – సాధారణంగా ఎదుగుదల ప్రారంభ దశలో ఉన్న కంపెనీలో జరుగుతుంది. 30 శాతం దాకా ఈక్విటీని పెట్టుబడి దారులు ఆశిస్తారు. ఎక్కువ లాభాల కోసం వారు పెట్టుబడిలో ఎక్కువ రిస్క్ తీసుకోడానికి ఇష్టపడతారు.

5 **వెంచర్ క్యాపిటల్** – భారీ సామర్థ్యం గల కంపెనీలలో పెట్టుబడి పెట్టే, వృత్తి పరంగా నిర్వహించే నిధులను "వెంచర్ క్యాపిటల్స్" అంటారు. వీరు సాధారణంగా ఈక్విటీకి బదులుగా వ్యాపారంలో పెట్టుబడి పెడతారు. IPO లేదా అధికార పూర్వక స్వాధీనం ఉన్నప్పుడు –ఉపసంహరించుకుంటారు. వెంచర్ క్యాపిటల్ నైపుణ్యాన్ని, సూచనలను కల్పిస్తుంది. సంస్థ ఎటు పోతోందో తెలిపే "లిట్మస్ పరీక్ష" లాగా ఇది పనిచేస్తుంది. స్థిరత్వం, వ్యాప్తి దృష్టితో ఇది వ్యాపారాన్ని విలువ కట్టడం జరుగుతుంది.

6 **బిజినెస్ ఇంక్యుబేటర్స్ & ఆక్సిలేరేటర్స్** – నిధుల సమీకరణ కోసం తొలి దశ వ్యాపారాలను ''ఇంక్యుబేటర్స్ & ఆక్సిలేరేటర్స్'' కార్యక్రమంగా పరిగణించవచ్చు. ఇవి దాదాపుగా ప్రతి పెద్ద నగరంలోనూ కనబడతాయి. ప్రతి ఏటా వందల కొద్దీ అంకురసంస్థలకు ఈ కార్యక్రమాలు సహాయం అందిస్తాయి. ఇంక్యుబేటర్స్ పిల్లకు తల్లి లాంటిది. వ్యాపారానికి అవసరమైన పనిముట్లు, శిక్షణ, నెట్‌వర్క్ వంటివి సమకూర్చి వాటికి పోషణ కల్పిస్తాయి. ఆక్సిలరేటర్స్ కూడా ఇంచుమించుగా ఇలాగే ఉంటాయి. అయితే ఇంక్యుబేటర్ వ్యాపారానికి సహాయం అందించి మంచిగా కొనసాగేటట్లు చేస్తుంది. కాగా ఆక్సిలరేటర్స్ వ్యాపారం వేగంగా అభివృద్ధి చెందడానికి తోడ్పడుతుంది.

7 సూక్ష్మ ఋణాలు సమకూర్చేవారు లేదా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్సియల్ కార్పొరేషన్లు (NBFC) – సంప్రదాయ బ్యాంకు సేవలు అందుబాటులో లేని వారికి ప్రాథమికంగా ఆర్థిక సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు సూక్ష్మ ఋణాలు ఉపయోగపడతాయి. ఎవరికైతే ఆర్థిక అవసరాలు పరిమితంగా ఉంటాయో, బ్యాంకు సేవలు పొందడానికి అవకాశం లేదో అటువంటివారికి ఉపయోగపడుతున్న ఈ విధానం పట్ల జనాదరణ పెరుగుతోంది. అదేవిధంగా, బ్యాంకులకు ఉండవలసిన ఎటువంటి చట్టపరమైన అవసరాలు / నిర్వచనం లేకుండా బ్యాంకు సేవలు కల్పించే ''నాన్ బ్యాంకింగ్ ఫైనాన్సియల్ కార్పొరేషన్లు'' ఈ NBFCలు.

**అంకుర సంస్థల ప్రోత్సాహానికి కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు :**

అంకుర సంస్థల కార్యాచరణ ప్రణాళికలో 19 అంశాల అజెండా ఉంది. అందులో కార్మిక, పర్యావరణ నిబంధనల స్వీయ ధృవీకరణ, పేటెంటు, మేధో సంపత్తి దరఖాస్తులు దాఖలు చేయడానికి సహాయ పడే బృందం, సీడ్ ఫండింగ్ కోసం పన్ను మినహాయింపులు, మూలధన లాభాలు, ఆదాయ పన్ను పై మూడేళ్ళ మినహాయింపు, నాలుగేళ్ల పాటు నిధుల నిధి ద్వారా 10,000 కోట్ల రూపాయల ఆర్థిక మద్దతు వంటి ప్రోత్సాహకాలు ఉన్నాయి.

**స్టార్ట్ అప్ ఇండియా యొక్క 19 అంశాల కార్యాచరణ ప్రణాళిక :**

(1) స్వీయ ధృవీకరణ వర్తింపు. (2) స్టార్ట్ అప్ ఇండియా హబ్ ద్వారా సింగిల్ పాయింట్ కాంటాక్ట్. (3) మొబైల్ ఆప్ మరియు పోర్టల్‌తో ప్రక్రియల సరళీకరణ. (నమోదు, కంప్లియన్సు ఫైలింగ్ మరియు సమాచార సేకరణ కోసం) (4) న్యాయ సహాయం, సత్వర ట్రాకింగ్ మరియు నమోదు రుసుములో 80 శాతం తగ్గింపు. (5) ప్రజా కొనుగోళ్లలో సడలించిన నిబంధనలు. (6) సులువుగా, త్వరగా నిష్క్రమణ. (7) 10 వేల కోట్ల రూపాయల నిధుల కార్పస్ నిధి ద్వారా నిధుల మద్దతు. (8) ఋణహామీ పై నిధులు. (9)మూలధనం లాభాలపై పన్ను మినహాయింపు. (10) మూడేళ్ళ పాటు ఆదాయపన్ను మినహాయింపు. (11) ఫెయిర్ మార్కెట్ వేల్యూ (FMV) కంటే అధికంగా ఉన్న పెట్టుబడులపై పన్ను మినహాయింపు. (12) వార్షిక అంకురసంస్థల మేళా (జాతీయ – అంతర్జాతీయ) (13) అటల్ ఆవిష్కరణల మిషన్ (AIM) కింద ప్రపంచ స్థాయి ఆవిష్కరణల కేంద్రాలు ప్రారంభం. (14) దేశవ్యాప్త ఇంక్యుబేటర్ నెట్‌వర్క్ ఏర్పాటు. (15) ఇంక్యుబేషన్ పెంపుదల, పరిశోధన, అభివృద్ధి కోసం ఆవిష్కరణల కేంద్రాలు. (16) సరైన ఆవిష్కరణల ప్రోత్సాహానికి పరిశోధన పార్కులు. (17) బయోటెక్నాలజీలో పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం. (18) విద్యార్థులకు ఆవిష్కరణల దిశగా కార్యక్రమాలు. (19) వార్షిక ఇంక్యుబేటర్ గ్రాండ్ ఛాలెంజ్.

**1. స్వీయ ధృవీకరణ :**

నియంత్రణ బాధ్యతలు తగ్గించుకోవడానికి అంకురసంస్థలు స్వీయ ధృవీకరణను అమలు చేస్తాయి. గ్రాట్యుటీ చెల్లింపు, లేబర్ కాంట్రాక్టు, భవిష్య నిధి యాజమాన్యం, జల కాలుష్యం, వాయు కాలుష్యం చట్టాలు మొదలైన వాటికి ఈ స్వీయ ధృవీకరణ వర్తిస్తుంది.

**2. స్టార్ట్ అప్ ఇండియా హబ్ :**

భారతదేశంలో స్టార్ట్ అప్ సంస్థలను ప్రారంభించడానికి సమాచారం కోసం సంప్రదించడానికి ఒకే కేంద్రంగా ఒక అఖిలభారత హబ్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. పారిశ్రామిక వేత్తలకు అవసరమైన పరిజ్ఞానం, ఆర్థిక సహాయన్ని అందుబాటులోకి తీసుకురావడానికి ఇది తోడ్పడుతుంది.

**3. ఆప్ ద్వారా నమోదు :**

అంకుర సంస్థల వ్యవస్థాపకులు సులువుగా నమోదుచేసుకోవడానికి సహాయపడేందుకు మొబైల్ అప్ రూపంలో ఆన్‌లైన్ పోర్టల్ ఏర్పాటు చేశారు.

**4. పేటెంట్ రక్షణ :**

ప్రభుత్వ భావనా విధానానికి అనుగుణంగా – పేటెంట్ పరీక్షకు – తక్కువ ఖర్చుతో ఒక ఫాస్ట్ ట్రాక్ పద్ధతిని – కేంద్రప్రభుత్వం రూపొందించింది. అంకుర సంస్థల ప్రారంభంలో మేధోసంపత్తి హక్కుల (IPR)పై అవగాహన, స్వీకరణలను ఈ విధానం పెంపొందిస్తుంది.

**5. 10,000 కోట్ల రూపాయల నిధి :**

త్వరలో ప్రారంభమయ్యే అంకుర సంస్థలకు సహాయపడేందుకు గాను – నాలుగేళ్ల కాలంలో ఏర్పాటు చేసే మొత్తం 10,000 కోట్ల కార్పస్ ఫండ్ లో తొలిదశగా ప్రభుత్వం 2,500 కోట్ల రూపాయలతో ఒక నిధిని అభివృద్ధి చేస్తుంది. ఈ కార్పస్ ఫండ్ ను అభివృద్ధి చేయడంలో భారతీయ జీవిత బీమా సంస్థ ప్రధాన పాత్ర పోషిస్తుంది. స్టార్ట్ అప్ పరిశ్రమ నుండి ఎంపిక చేసిన కొంతమంది ప్రయివేటు నిపుణులతో కూడిన కమిటీ ఈ నిధిని నిర్వహిస్తుంది.

**6.జాతీయ ఋణ హామీ ట్రస్ట్ కంపెనీ:**

అంకుర సంస్థలకు వచ్చే నాలుగేళ్ల వరకు నిధుల విడుదలకు మద్దతుగా ఏడాదికీ 500 కోట్ల రూపాయల బడ్జెట్‌తో జాతీయ రుణ హామీ ట్రస్ట్ కంపెనీ (NCGTC) ని రూపొందించడం జరిగింది.

**7. మూలధన లాభాలపై పన్ను లేదు :**

ప్రస్తుతం, వెంచర్ కాపిటల్ ఫండ్స్ ద్వారా పెట్టుబడులకు – కాపిటల్ గెయిన్స్ పన్ను నుండి మినహాయింపు ఉంది. అదే విధానాన్ని అంకురసంస్థల్లో ప్రాథమిక స్థాయి పెట్టుబడులపై అమలుచేయనున్నారు.

**8. మూడేళ్లవరకు ఆదాయపన్ను లేదు :**

మూడేళ్ళ వరకు అంకుర సంస్థలు ఆదాయ పన్ను చెల్లించవలసిన పని లేదు. భవిష్యత్తులో అభివృద్ధి చెందే విధంగా ఈ విధానం స్టార్ట్ అప్ సంస్థల్లో విప్లవాత్మకమైన మార్పులను తీసుకువచ్చింది.

**9. పెద్ద మొత్తంలో పెట్టుబడులకు పన్ను రాయితీ :**

మార్కెట్ ధర కంటే ఎక్కువ విలువతో ఉన్న పెట్టుబడులకు – పన్ను చెల్లింపు మినహాయించబడుతుంది

**10. పారిశ్రామికవేత్తలను తయారుచేయడం:**

సుమారు 5 లక్షల పైగా పాఠశాలల్లో విద్యార్థులకు ఇన్నోవేషన్ సంబంధమైన అధ్యయన ప్రణాళికలతో పాటు

ప్రపంచస్థాయి ఇంక్యుబేటర్స్‌ను అభివృద్ధి చేయడం కోసం వార్షిక ఇంక్యుబేటర్ గ్రాండ్ ఛాలెంజ్‌ను అక్కడ నిర్వహిస్తారు.

**11. అటల్ ఇన్నోవేషన్ మిషన్ :**

ప్రతిభావంతులైన యువతలో సృజనాత్మకతను పెంపొందించి, ప్రోత్స హించడానికి అటల్ ఇన్నోవేషన్ మిషన్‌ను ప్రారంభించడం జరుగుతుంది.

**12. ఇంక్యుబేటర్ల ఏర్పాటు :**

జాతీయ స్థాయి సంస్థలలో ప్రభుత్వ–ప్రయివేటు భాగస్వామ్య తరహాలో 35 కొత్త ఇంక్యూబేటర్లు, 31 ఇన్నోవేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని పరిగణలోకి తీసు కోవడం జరిగింది.

**13. పరిశోధన పార్కులు :**

ప్రభుత్వం ఏడు కొత్త పరిశోధన పార్కులను నెలకొల్పాలని ప్రణాళిక రూపొందించింది. ఒక్కొక్కటీ 100 కోట్ల రూపాయల పెట్టుబడితో వీటిని ఏర్పాటు చేస్తారు. ఇందులో ఆరు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (IIT) ప్రాంగణాలలోనూ, ఒకటి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రాంగణంలోనూ నెలకొల్పుతారు.

**14. బయోటెక్నాలజీలో వ్యవస్థాపకత :**

ప్రభుత్వం దేశంలో ఐదు కొత్త బయోటెక్ క్లస్టర్లను, 50 కొత్త బయో ఇంక్యుబేటర్లను, 150 సాంకేతికత మార్పిడి కార్యాలయాలనూ, 20 బయోటెక్ కార్యాలయాలనూ ఏర్పాటు చేయనుంది.

**15. పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు**

ప్రభుత్వం దేశంలోని ఐదు లక్షలకు పైగా పాఠశాలల్లోని విద్యార్థుల కోసం ఆవిష్కరణలకు సంబంధించిన కార్యక్రమా లను ప్రవేశపెట్టనుంది.

**16. న్యాయసహాయం :**

న్యాయ సహాయం అందించడానికి – పేటెంట్ దరఖాస్తులు, ఇతర అధికార పత్రాలు సమర్పించడంలో సహాయ పడడానికీ ఒక సహాయక బృందం అందుబాటులో ఉంటుంది.

**17. రాయితీ :**

పేటెంట్ దరఖాస్తు సమర్పించిన అనంతరం మొత్తం విలువలో 80 శాతం మొత్తాన్ని పారిశ్రామికవేత్తలకు రిబేటుగా అందిస్తారు.

**18. సరళమైన నియమాలు :**

అంకురసంస్థల కోసం ప్రజా సేకరణ (Public Procurement) నిబంధనలు, వాణిజ్య నియమాలు సరళీకృతం చేయడమైనది.

**19. వేగంగా నిష్క్రమణ :**

ఒక వేళ అంకురసంస్థలు విఫలమైతే, ఆ పారిశ్రామిక వేత్తలు తమ సమస్యలకు తగిన పరిష్కారాలు కనుగొనేందుకు కూడా ప్రభుత్వం సహాయం అందిస్తుంది. వారు తిరిగి విఫలమైతే, వారు సులువుగా నిష్క్రమించడానికి ప్రభుత్వం ఒక మార్గాన్ని సూచిస్తుంది.

భారతీయ అంకురసంస్థలు – 2016 సంవత్సరం మొదటి, మూడవ త్రైమాసికాల మధ్య కాలంలో–మొత్తం 815 కంటే ఎక్కువ ఒప్పందాల్లో 3.5 బిలియన్ అమెరికన్ డాలర్లను ఏంజెల్ మరియు వెంచర్ కాపిటల్ పెట్టుబడిగా పెట్టాయి. అయితే, గత ఏడాది ఇదే సమయంలో జరిగిన మొత్తం ఒప్పందాల విలువ కంటే ఇది చాలా తక్కువగా ఉంది. "యువర్ స్టోరీ" పరిశోధన ప్రకారం – 2015 జనవరి నుండి సెప్టెంబర్ మధ్య కాలంలో మొత్తం 639 ఒప్పందాల్లో 7.3 బిలియన్ అమెరికా డాలర్లు పెట్టుబడిగా పెట్టారు. ఈ ఏడాది మొత్తం ఒప్పందాల సంఖ్య 27 శాతం పెరిగినప్పటికీ – ఒప్పందాల విలువ, టికెట్ పరిమాణం తగ్గాయి. ఇదే దృష్టి కోణంతో చూస్తే – 2014 లో కేవలం 300 వెంచర్ క్యాపిటల్ ఒప్పందాలు కుదిరాయి. ఆర్థిక విధానంలో కొత్త పోటీ డైనమిక్స్ తీసుకురావాలి అంటే మార్కెట్లో అంకురసంస్థలే ఎంతో డైనమిక్ ఆర్థిక సంస్థలుగా ఉన్నాయి అని నిర్ధారించవచ్చు. ఎందుకంటే, అవి ఏ ఆర్థిక విధానంలోనైనా అదనపు డైనమిక్స్, పోటీ తత్వాన్ని కల్పిస్తున్నాయి. అవి మార్పుకు ఒక ఉత్ప్రేరకంగా పనిచేస్తాయి. అవి వరుస స్పందనకు దారితీస్తాయి. ఒకసారి ఒక సంస్థ ఏర్పాటయ్యిందంటే, పారిశ్రామికీ కరణ ప్రక్రియ పనిచేయడం ప్రారంభిస్తుంది. ఈ కార్యకలాపాలన్నీ పారిశ్రామికతను ప్రోత్సహించి, వివిధ రకాల యూనిట్లకు డిమాండ్ సృష్టిస్తుంది. ఫలితంగా ఆ ప్రాంతంలో డిమాండ్ పెరగడం, చాలా ఎక్కువగా యూనిట్లను నెలకొల్పడం ద్వారా – సర్వతోముఖాభివృద్ధికి దారితీస్తుంది. భారతీయ అంకురసంస్థలు తమ సరసమైన, అనుకూలమైన సేవల ద్వారా ప్రజల జీవితాలను సులభతరం చేయడం మాత్రమే కాదు – అవి భారతీయ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి, ప్రగతికి ప్రధాన ప్రోత్సాహకంగా కూడా పనిచేస్తాయి భారత దేశంలో శ్రేయస్సును కల్పించడానికే స్టార్ట్ అప్ ఇండియా అని మేము విశ్వసిస్తున్నాము. తమ స్వంత వ్యాపారం ప్రారంభించాలని కలలు కనే ఎంతోమంది ఔత్సాహిక యువకులకు వనరులు అందుబాటులో లేవు. ఫలితంగా, వారి ఆలోచనలు, ప్రతిభ, సామర్థ్యం నిరుపయోగమౌతున్నాయి. దేశం సంపదను, ఆర్థికాభివృద్ధిని, ఉపాధిని కోల్పోతోంది. ఆవిష్కరణలకు సామర్థ్యం ఉండి, స్వంతంగా వ్యాపారం ప్రారంభించే వారిని గుర్తించి, ప్రోత్సహించి – వారికి చురుకుగా మద్దతు, వివిధ స్థాయిల్లో ప్రోత్సాహకాలు అందించడం ద్వారా – పారిశ్రామికతను, ఆర్థికాభివృద్ధిని పెంపొందించడానికి స్టార్ట్ అప్ ఇండియా సహాయపడుతోంది. ■

**ఆనందానికి యోగా**

**విశిష్ట వ్యాసం**

# యువత ఆరోగ్యంలో యోగ పాత్ర

– డా॥ ఈశ్వర ఎన్ ఆచార్య
– డా॥ రాజీవ్ రస్తోగి



**యోగశాస్త్రంలో జీవన సంపూర్ణతకు ప్రాధాన్యమివ్వడం జరిగింది. ఇందులో శారీరక, మానసిక, నైతిక, సామాజిక, భావోద్వేగ, ఆధ్యాత్మికాలకు సమప్రాధాన్యం ఉంది. ఇతర చికిత్సా విధానాలతో పాటుగా వీటిని మేళవించి వినియోగించుకోవచ్చు కూడా. యోగా ఇప్పుడు ప్రపంచదృష్టిని ఆకర్షించింది. వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు యోగా గురించి తెలుసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇది కేవలం ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసమో, ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవడం కోసమో మాత్రమే కాకుండా వ్యాధులను అదుపులో ఉంచేందుకు కూడా ఉపయోగ పడుతుంది.**

ఇప్పుడు యోగా గురించి ప్రపంచమంతా తెలుసు. ప్రాంతం, మతం, కులం, వర్గం, జాతీయత వంటి సరిహద్దులను ఇప్పుడు యోగా దాటిపోయింది. ఆరోగ్య పరిరక్షణలో, రోగనివారణలో, విభిన్నమైన జీవనశైలుల కారణంగా ఏర్పడిన సమస్యలకు చికిత్స అందించడంలో యోగాకు ఉన్న విశిష్టమైన, నిర్దిష్టమైన సామర్థ్యం కారణంగా యోగా ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. యోగా ఒక ఆధ్యాత్మిక రంగ విభాగం కూడా. శరీరానికి, బుద్ధికి మధ్య ఖచ్చితమైన సమతుల్యత సాధించడం యోగా లక్ష్యం. ఈనాటి ప్రపంచం సాధించిన సాంకేతిక పురోగతి కారణంగా జీవితం ఎంతో సౌకర్యవంతం అయింది. అయితే, అసమగ్రమైన జీవన విధానం, పర్యావరణ పరిస్థితులు, కాలుష్యం, ఆధునిక కార్యాలయ సంస్కృతులు వంటి వాటి వల్ల జీవితం ఇబ్బందికరంగా తయారువుతోంది. శారీరకంగా, మానసికంగా, మేథోపరంగా, భావోద్వేగాలపరంగా, సామాజికంగా, ఆధ్యాత్మికంగా..... ఇలా అన్ని రంగాల్లో ఆధునిక జీవన విధానం మనిషిని గందరగోళానికి గురిచేసి సమస్యలను సృష్టిస్తోంది. సరైన జీవన విధానాన్ని యోగా నిర్దేశిస్తుంది. యోగా ఇతర ఆరోగ్య విధానాలకు వ్యతిరేకం కాదు. వాటితో కలిసిపోతుంది. అదే యోగా వైశిష్ట్యం. అందువల్ల రకరకాల వైద్య విధానాలకు చెందిన వైద్యులు కూడా తమతమ సాంప్రదాయికమైన మందులతో పాటు యోగ చికిత్సా విధానాన్ని కూడా రోగులకు సూచించేందుకు వెసులుబాటు ఉంటుంది.

2014 సెప్టెంబరు 27న ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ ఇలా అన్నారు – "ప్రాచీనమైన మా సంప్రదాయం ప్రపంచానికి ఇచ్చిన ఒక అమూల్యమైన బహుమతి యోగా. మనసును, శరీరాన్ని యోగా ఏకం చేస్తుంది. ఆలోచనను, క్రియను అనుసంధానం చేస్తుంది. కోర్కెలను నెరవేర్చుకోవడానికి, సంయమనానికి మధ్య సమన్వయం సాధిస్తుంది. మనిషికి, ప్రకృతికి మధ్య సామరస్యం తెస్తుంది. ఆరోగ్యానికి, చక్కగా జీవించేందుకు ఒక సంపూర్ణత్వాన్ని ప్రసాదిస్తుంది. యోగా అంటే వ్యాయామం కాదు. మనల్ని మనతోనూ, ప్రకృతితోనూ, ప్రపంచంతోనూ ఐక్యం చేసుకోవడం. మన జీవన విధానాన్ని మార్చుకోవడం ద్వారా, మన చేతనను జాగృతం చేసుకోవడం ద్వారా,

డైరెక్టర్, (నేచురోపతి) E-mail: ccryn.goi@gmail.com
సహాయక డైరెక్టర్, (నేచురోపతి) E-mail: rrastogi.2009@gmail.com

వాతావరణ పరిస్థితులతో మనం మెరుగ్గా సర్దుబాటు చేసుకోగలం. అంతర్జాతీయ యోగా దినోత్సవం దిశగా మనం కృషి చేద్దాం.”

యోగాను అందరూ అంగీకరిస్తారు కనుక ప్రపంచవ్యాప్తంగా యోగాకు ప్రజాదరణ దక్కేలా కృషి చేయాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి అభిప్రాయ పడ్డారు. యోగాను మరింత మెరుగ్గా వినియోగించుకోవచ్చని ఆయన వివరించారు. తర్వాతి కాలంలో 177 దేశాల మద్దతుతో జూన్ 21ని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించింది. ఇప్పుడు యావత్ప్రపంచమూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఎంతో ఉత్సాహంతో జరుపుకుంటోంది. భారత దేశంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించే బాధ్యతను ఆయుష్ మంత్రిత్వ శాఖకు అప్పగించడం జరిగింది. ఇతర మంత్రిత్వశాఖలు అందులో సాయపడతాయి. ఈ ఏడాది మనం మూడో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.

**అసలు యోగా అంటే ఏమిటి?**

ప్రాచీన భారతీయ ఋషులు కనిపెట్టిన ఆధ్యాత్మకశాస్త్రం యోగా. దీని మూలాలు భారతీయ సంప్రదాయం, సంస్కృతుల్లో ఇమిడి ఉన్నాయి. సంపూర్ణ జీవన విధానానికి మార్గం యోగా. ఎందరో ఋషులు, మునులు యోగ శాస్త్ర అభివృద్ధికి కృషి చేశారు. దాదాపు ప్రాచీన భారతీయ సాహిత్యమంతటా యోగ శాస్త్ర ప్రస్తావన ఉంది. మధ్యయుగంలో, ఆధునిక సాహిత్యంలో, ప్రస్తుత సాహిత్యంలో కూడా యోగా గురించిన అధ్యయనాలున్నాయి. పతంజలి రాసిన యోగసూత్రాలు (దాదాపు క్రీస్తుపూర్వం 400 సంవత్సరాలు) యోగశాస్త్రానికి సంబంధించిన తొలి శాస్త్ర గ్రంథంగా పరిగణించబడుతోంది. ఈ పతంజలి యోగ సూత్రాల మీద ఎన్నో వ్యాఖ్యానాలు వచ్చాయి. పతంజలి ఎనిమిది అంచెల యోగ శాస్త్రాన్ని ప్రతిపాదించాడు. దాన్నే అష్టాంగయోగం అని అంటున్నాం.

ఈ అష్టాంగయోగం ఒక వ్యక్తిని అన్ని రకాలుగా కాపాడుతుంది. మందులతో పనిలేకుండా చికిత్య చేసే వైద్యశాస్త్రం యోగా. ఆరోగ్యరక్షణకు, ఆరోగ్యకరమైన జీవనానికి ఆలంబన యోగా. రోగం, వైద్యం వంటి వాటి విషయంలో యోగశాస్త్రంలో ప్రత్యేకమైన విశిష్ట సిద్ధాంతాలు ఉన్నాయి. యోగశాస్త్రంలో జీవన సంపూర్ణతకు ప్రాధాన్యమివ్వడం జరిగింది. ఇందులో శారీరక, మానసిక, నైతిక, సామాజిక, భావోద్వేగ, ఆధ్యాత్మికాలకు సమప్రాధాన్యం ఉంది. మన అవసరాలకు తగిన విధంగా నిత్య జీవన విధానంలో సులువుగా, తేలికగా పాటించగలిగే ఆరోగ్యకరమైన అంశాలను ఇందులో పొందుపర్చడం జరిగింది. వీటివల్ల మనిషి రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటాడు. ఇతర చికిత్సా విధానాలతో పాటుగా వీటిని మేళవించి వినియోగించుకోవచ్చు కూడా. ఇప్పుడు ఎంతో మంది పరిశోధకులు, సాధకులు మారుతున్న మానవజాతి అవసరాలకు అనుగుణంగా యోగాపద్ధతులను వినియోగించాలని చెబుతున్నారు. యోగా ఇప్పుడు ప్రపంచదృష్టిని ఆకర్షించింది. వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు యోగా గురించి తెలుసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇది కేవలం ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసమో, ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవడం కోసమో మాత్రమే కాకుండా వ్యాధులను అదుపులో ఉంచేందుకు కూడా ఉపయోగ పడుతుంది. యోగా జీవన విధానాన్ని అలవర్చుకోవాలంటూ పలువురు యోగా గురువులు, వైద్య నిపుణులు సూచిస్తున్నారు. దీని వల్ల ఒత్తిడి మాయమై, మానసికమైన అవలక్షణాలు దూరమౌతాయి.

యోగాభ్యాసం ద్వారా ఉన్నతమైన చైతన్యం పట్ల అవగాహన పెరుగుతుంది. యోగశాస్త్రంలో శరీరంలోని భాగాలను విడివిడిగా పరిగణించరు. యోగా వ్యక్తిని ఒక మొత్తంగా పరిగణిస్తుంది. యోగాభ్యాసంలో క్రియలు ఉంటాయి. అంటే శరీరాన్ని శుద్ధి చేసే విధానాలు. సూర్య నమస్కారాలు ఉంటాయి. ఆసనాలు ఉంటాయి. శ్వాస నియంత్రకు సంబంధించిన ప్రాణాయామం ఉంటుంది. విశ్రాంతి కలిగించి విధానాలు ఉంటాయి. ఇంకా బంధన, ముద్ర, ధ్యానం వంటివి కూడా ఉంటాయి. వాటిని గురించి క్లుప్తంగా చూద్దాం.

**సూర్యనమస్కారాలు:**

యోగభ్యాస విధానాల్లో చాలా ప్రాచుర్యం పొందిన వ్యాయామాలు సూర్యనమస్కారాలు. ఇందులో 12 రకాల భంగిమలు ఉంటాయి. సూర్యోదయ కాలంలో వీటిని వేయాలి. సూర్యాభిముఖంగా ఉండి వీటిని ప్రదర్శించాలి. శరీరంలోనీ నాడీ మండలం మొత్తాన్ని ఈ సూర్యనమస్కారాలు ఉత్తేజితం చేస్తాయి. వీటిని క్రమంతప్పకుండా అభ్యసిస్తే శరీర మంతటికి సరైన రీతిలో ప్రాణవాయువు (ఆక్సిజన్) అందుబాటు జరిగి శరీరాంగాలన్నింటి మధ్య ఒక సమన్వయం ఏర్పడుతుంది. ఫలితంగా మానసిక వ్యవస్థ మీద సానుకూల ప్రభావం పడుతుంది.

**ఆసనాలు:**

ఒక స్థితి లేదా భంగిమలో ఉంటూ శరీరాన్ని చాచడం ద్వారా శరీరాన్ని, మనసును స్థిరపరిచే ప్రత్యేక భంగిమలను ఆసనాలు అంటారు. కండరాల కదలికల శక్తిని మెరుగుపర్చడమే ఆసనాలు వేయడంలో ముఖ్య ఉద్దేశ్యం. ఈ శారీరక భంగిమల వెనుక ఇమిడి ఉన్న ప్రాథమిక సూత్రం శారీరక స్థితి మాత్రమే కాదు, మానసికమైనది, నరాలకు బలమిచ్చేది. సైకో-న్యూరో ఫిజికల్ అని చెప్పవచ్చు.

ఆసనాలను కష్టపడుతున్నట్టు వేయకూడదు. వాటిని హాయిగా, సులువుగా వేయాలి. వెంటనే భంగిమ నుంచి విరమించుకో కూడదు. కాసేపు హాయిగా ఆయా భంగిమల్లోనే ఉండే ప్రయత్నం చేయాలి.

**ప్రాణాయామం:**

నరాలకు కావల్సిన శక్తి శ్వాస క్రియ ద్వారా అందుతుంది. ఈ శ్వాసక్రియను ఒక పద్ధతి ప్రకారం అదుపు చేయడమే ప్రాణా యామం. శ్వాసయోగాలో సుదీర్ఘ సమయం పాటు హాయిగా ఉపిరిని నిలపగలగడం చాలా కీలకం. స్వయం చోదితమైన నరాల వ్యవస్థను శ్వాస యోగా ద్వారా నియంత్రణ లోకి తెచ్చుకోవడం, తద్వారా మనస్సు, బుద్ధి పని చేసే తీరును నియంత్ర ణలోకి తీసుకునిరావడం ఇందులో ప్రధాన ఉద్దేశం. ధ్యానం వంటి ఉన్నత స్థాయి యోగాభ్యాసా నికి ప్రాణాయామం చాలా ముఖ్యమైనది.

**ధ్యానం:**

మనస్సును ఒక మార్గం మీద నిలిచి నప్పుడు ఆ మార్గంలోనే అసిధార మాదిరిగా అనాహతంగా మనోప్రయాణాన్ని కొనసాగిం చడమే ధ్యానం. అంతర్గత చైతన్యాన్ని జాగృతం చేయడం ధ్యానానికి మూల సూత్రం. వెలుపలి పదార్థాల నుంచి, వస్తువుల నుంచి ఇంద్రియాలను ఉపసంహ రించి, వెలుపలి పరిసరాల పట్ల పూర్తిగా విస్మరస్థితికి చేరుకోవడమే ధ్యానసాధన. మనో, బుద్ధి ప్రవృత్తుల మీద నియంత్రణ సాధించడం ఈ సాధనలో ముఖ్యం. దృష్టిని అనుభవంలోకి తెచ్చుకో వడం ద్వారా వ్యక్తి తనలో తాను లీనం కావడం ధ్యానం. నిత్యధ్యాన సాధన ద్వారా వ్యక్తి ఏకాగ్రచిత్తాన్ని సాధించగలడు. తత్ఫలితంగా శారీరక శక్తి, మానసిక దారుఢ్యం, సృజనాత్మకత, మన శ్శాంతి, జ్ఞాపకశక్తి, మేధస్సు, అతీంద్రియ శక్తులు, స్ఫురణ వంటి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి.

**ఆరోగ్యం అంటే?:**

ఆరోగ్యం అంటే ఎన్నో రకాలు నిర్వచించుకోవచ్చు. అయితే మనం ప్రస్తుతం ఎక్కువగా ఉపయోగిస్తున్న నిర్వచనం మాత్రం 1946 జూన్ 19–22 తేదీల మధ్య జరిగిన అంతర్జాతీయ ఆరోగ్య సదస్సులో ప్రపంచ ఆరోగ్య సంస్థ రాజ్యాంగాన్ని పీఠికగా స్వీకరించిన ఆధునిక నిర్వచనమే. ఈ నిర్వచనాన్ని 61 దేశాల ప్రతినిధులు 1946 జూలై 22 న సంతకం చేసి ఆమోదించారు. 1948 ఏప్రిల్ 7 నుంచి ఇది వ్యాప్తిలోకి వచ్చింది. ఆ నిర్వచనం ఇలా చెప్తుంది. "రోగం లేకపోవడం లేదా ఏదైనా వైకల్యం లేకపోవడమే ఆరోగ్యం కాదు. ఆరోగ్యం అంటే సంపూర్ణమైన రీతిలో శారీరకంగా, మానసికంగా, సామాజికంగా బాగా ఉండడం."

**యువత – యోగా:**

యోగా ఒక శాస్త్రం. ఆరోగ్యంగా జీవించే ఒక కళ కూడా. రోగాలకు దూరంగా ఆరోగ్యంగా ఉండాలనుకునే వారందరికీ యోగా ఉపయోగపడుతుంది. యోగా అంటే ఒక రకంగా మనలోని అంతర్గత నైపుణ్యాలను మెరుగుపర్చి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే ఉపకరణమే. ఇప్పటి యువతకు అదేగా కావల్సింది. విద్యలో, ఉద్యోగాల్లో యువతకు సంక్లిష్టతలు, సమస్యలు పెరిగిపోతున్నాయి. సవాళ్లు విసురుతున్నాయి. యోగులు నిజమైన బలమైన యోగులుగా తయారై ఈ సవాళ్లు సమర్థంగా ఎదుర్కోగలరు. యోగా వ్యక్తిత్వానికి సంబంధించిన అన్ని కోణాల్లోనూ ఉపయోగపడుతుంది – శారీరకంగా, మానసికంగా, సామాజికంగా, నైతికంగా, భావోద్వేగపరంగా, ఆధ్యాత్మికంగా యోగా మనిషిని ఉన్నత స్థాయికి చేరుస్తుంది.

శరీరంలోని అన్ని వ్యవస్థలను యోగా ప్రభావితం చేస్తుంది. ఏకాగ్రతను, ఓర్పును పెంచుతుంది. ఈనాటి సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనేందుకు కావల్సిన ప్రశాంతతను సాధకుడికి అందిస్తుంది.

భారతదేశం 125 కోట్లకు పైగా జనాభా ఉన్న దేశం. దేశాభివృద్ధికి ప్రజారోగ్యం కీలకం. ప్రజలు ఆరోగ్యంగా లేకుంటే దేశం వేగంగా అభివృద్ధి చెందదు. ప్రజలు ఆరోగ్యంగా లేకుంటే దేశ ప్రధానవనరులను ప్రజల ఆరోగ్యం కోసమే వెచ్చించాల్సి రావచ్చు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటే, యువత ఉత్సాహంగా ఉంటే దేశం వేగంగా, దీర్ఘకాలం అభివృద్ధి చెందగలదు. కనుక యువత ఆరోగ్యం చాలా ముఖ్యం.

యోగా ఆరోగ్యానికి సంబంధించిన విజ్ఞానమే అయినా ఇంకా ముఖ్యంగా యోగా ప్రధానంగా ఆధ్యాత్మిక శాస్త్రం. రోగాలను నివారించి, ఆరోగ్యాన్ని మెరుగుచేసే సామర్థ్యం యోగాకు ఉన్నది. యోగాలోని సంపూర్ణ దృష్టి కారణంగా జీవితాలను అన్ని కోణాల్లోనూ సమన్వయం ఏర్పడి, నిత్య జీవితం మీద సానుకూల ప్రభావం ఏర్పడుతుంది. నిత్యం యోగసాధన చేస్తే ప్రవర్తనలో సానుకూలమైన మార్పులు సంభవించి, ప్రవృత్తి మెరుగుపడి, ఇంటా, బయటా మానవసంబంధాలు ఆహ్లాదకరంగా మారి సాధకుణ్ణి ఉత్సాహంగా ఉంచుతాయి. ఎన్నో వైద్య పరిశోధనల్లో యోగా వల్ల చికిత్స ప్రయోజనాలున్నాయని ప్రపంచవ్యాప్తంగా నిరూపణ అయింది. నివారణ, నిత్యజీవన నిర్వహణల కారణంగా యోగా ప్రజాదరణ పొందింది. శారీరక, మానసిక సమస్యలను దూరం చేయడంలో యోగా పాత్ర వల్ల అది ప్రజలకు మరింత చేరువ అయింది.

**యోగా – పరిశోధనలు:**

ఎన్నో మానసికమైన, సక్రమం కాని జీవన రీతుల కారణంగా ఏర్పడిన సమస్యలను నియంత్రించడంలో యోగా సామర్థ్యం తిరుగులేనిదని ఎన్నో వైద్య అధ్యయనాల్లో రుజువైంది. శస్త్ర చికిత్స

అవసరం లేని ఒక వైద్య విధానపు స్థాయి యోగా అందుకుంది. ముఖ్యంగా చెప్పుకోలేని ఎన్నో సమస్యలకు యోగా పరిష్కారం చూపగలుగుతుంది. మన నిత్య జీవితంలో సానుకూలమైన మార్పులను చేసుకోవడం ద్వారా ఇలాంటి రోగాలను నివారిస్తుంది. ఉపవాసం, పత్యం, మృతికా చికిత్స, జల చికిత్స, మర్దన, వాయుచికిత్స వంటి ప్రకృతి చికిత్సలతో పాటు షట్కర్మ, సూర్యనమస్కారాలు, ఆసనాలు, ప్రాణాయామం వంటివి ఆచరిచండం వల్ల రోగరహితమైన, ఆరోగ్యకరమైన, సంతోషకరమైన జీవితాన్ని గడపవచ్చు. అధిక రక్తపోటు, గుండె సమస్యలు, మధుమేహం, ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి వంటివి ఈనాడు యువత కూడా ఎదుర్కుంటున్న కొన్ని సమస్యలు. రక్తనాళాలకు సంబంధించి దీర్ఘకాలికంగా బాధపడుతున్న ఉదంతాల్లో యోగభరిత జీవనశైలి వల్ల మెరుగైన ఫలితాలు కనిపించాయని మంచాండ తదితరులు 2000 లో నిరూపించారు. అధిక బరువు, లిపిడ్ స్థాయులు, ఎనిగ్మా వంటి వాటి విషయంలో యోగా సానుకూల ప్రభావం చూపింది. రక్తనాళాల్లో ఆటంకాలను తొలగించింది. ఆర్థరోస్కెలె- రోటిక్ ప్లేక్‌ను స్థిరీకరించడం ద్వారా యోగభరిత జీవనశైలి బైపాస్ శస్త్ర చికిత్స, యాంజియోప్లాస్టీ వంటి వాటి అవసరాలను తగ్గిస్తుంది. అందువల్ల గుండె సమస్యలున్న వారికి యోగజీవన విధానం ఎంతో ఆచరణీయమైంది. పైగా ఖర్చుతో కూడుకున్నది కాదు. రక్తనాళాలకు సంబంధించిన వ్యాధులు, హైపర్ టెన్షన్ వంటి వాటిని నిత్య యోగాభ్యాసంతో నివారించడమే కాకుండా అదుపులో ఉంచవచ్చు.

యువత జీవన విధానంలో ఆహారం కూడా ముఖ్య విషయమే. యోగా మీద ఆచార్య, రస్తోగి ద్వయం చేసిన అధ్యయనం (2016) “యోగా – ఆరోగ్య సమతుల్యత, వత్తిడి లేని జీవితం” లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. నిల్వ ఉన్న ఆహారం (ప్రిజర్వుడు ఫుడ్), ఫాస్టు ఫుడ్లు, నానా తిళ్లు (జంక్ ఫుడ్), అధిక కెలోరీలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం, పొగతాగడు, మద్యపానం, మాదకద్రవ్యాలు, విశ్రాంతి లేమి, వ్యాయమ రహిత జీవనం మనలను అసహనం ఉన్న వారిగా తయారు చేశాయని, ఫలితంగా మనకు ఎన్నో మానసిక సమస్యలు తలెత్తుతున్నాయని, మధుమేహం, రక్తపోటు, కీళ్లనొప్పులు, వెన్నునొప్పి వంటి సమస్యలు పీడిస్తున్నాయని అభిప్రాయ పడ్డారు. ఈ కారణాల వల్లే మానసిక రోగాల సమస్య నానాటికీ పెరిగిపోతోంది. ఈనాడు ఎంతో మంది కుంగుబాటు సమస్యను ఎదుర్కుంటున్నారు. అలాగే వైరుధ్యవ్యక్తిత్వం, మద్యపానం, మాదకద్రవ్యాలకు సంబంధించిన వ్యాధుల బారిన పడుతున్నారు. ఆసనాలు, ప్రాణాయామం, షట్కర్మ, సూర్య నమస్కారం, ధ్యానం వంటివి మనస్సు, శరీరాన్ని ప్రశాంతంగా ఉంచి చికిత్సలో ఉపయోగపడతాయి.

ఒక్కమాటలో చెప్పాలంటే యువత ఆరోగ్యపరమైన సమస్యల బారిన పడకుండా కాపాడే సిసలైన రక్షణ యోగా. ఫలితంగా దేశం పురోగమిస్తుంది. యోగా సానుకూల ఆరోగ్యస్థితిని ప్రోత్సహిస్తుంది. సానుకూల దృక్పథాన్ని అందిస్తుంది. శరీరం, మనసు సరైన ఆరోగ్యంతో, సమన్వయంతో సమతూకంతో ఉండాలంటే యోగసాధనే రాజమార్గం.

■

## గమనిక

**వ్యాసకర్తలకు సూచన** యోజన మాసపత్రికకు వ్యాసాలు పంపేవారు తమ వ్యాసం సాఫ్ట్ కాపీని పేజిమేకర్ 6.5 లేదా 7 మరియు “అను” 7 ఫాంట్‌లో, వర్డ్‌లోనూ పంపాలి. వ్రాతప్రతిని కూడ హామీ పత్రంతో కలిపి పోస్టుద్వారా పంపాలి. హామీ పత్రంలో ఇది తమ స్వంత రచన అనీ, దేనికీ అనువాదం, అనుసరణ కాదనీ, మరే పత్రికకూ పంపలేదనీ, ఇంతకుముందు పుస్తకంగా ముద్రించలేదని పేర్కొనాలి. రచనలు ప్రతి నెలా 15వ తేదీ లోపు మాకు చేరాలి. ప్రచురణకు నోచుకోని రచనలు తిరిగి పంపబడవు. దీనిపై ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలకూ చోటులేదు. గమనించగలరు.

***సీనియర్ ఎడిటర్***

యోజన తెలుగు మాసపత్రిక, 205, రెండవ అంతస్తు, సి.జి.ఓ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ – 500 080.
E-mail: yojana_telugu@yahoo.co.in - yojana.telugu@nic.in

# యువతకు ఆశా కిరణం - తెలంగాణ రాష్ట్రం

- టి. పద్మారావు గౌడ్



**ప్రస్తుతం రాష్ట్రంలో సెట్విన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 22 స్వంత శిక్షణా సంస్థలలో ప్రతి సంవత్సరం సుమారు 10,000 మంది యువతీ, యువకులు శిక్షణ పొందుతున్నారు. అలాగే సెట్విన్ అధీకృత సెంటర్లు రాష్ట్రంలో 25 ఉండగా, వాటి ద్వారా కూడా సుమారు 5,000 మంది ప్రతి సంవత్సరం శిక్షణ పొందుతున్నారు. తక్కువ రుసుముతో 20 కోర్సులలో శిక్షణ అందిస్తున్నారు. దీనితో శిక్షణ పూర్తి చేసుకొని ఉత్తీర్ణులయిన వారు. స్వదేశంలోనే కాకుండా విదేశాలలో కూడా ఉద్యోగాలు సంపాదించుకుంటున్నారు.**

మానవ జీవితంలో యువదశ అత్యంత కీలకమైనది. దేశ భవితను వ్యక్తిగత అభివృద్ధిని నిర్దేశిస్తుంది అనేది నిర్వివాదాంశం.

భారత దేశం, రాష్ట్రాలు యువశక్తిపై ఆధారపడటమే కాక వారికి దిశా నిర్దేశం చేయడంలో అత్యంత ప్రధాన భూమికను పోషిస్తూ విధాన రూపకల్పన, అమలు చేయడంలో అహర్నిశలు కృషి చేస్తున్నాయి.

తెలంగాణ రాష్ట్రం నూతనంగా ఉనికిలోకి వచ్చి అన్ని రాష్ట్రాల అనుభవాలను ఆకళింపు చేసుకొని యువతను జాగృత పరచి దిశా నిర్దేశం చేయడానికి కంకణ బద్ధమై, మార్గ నిర్దేశం చేయడానికి, యువజన సర్వీసుల శాఖ, సెట్విన్ సంస్థ, NCCల ద్వారా వివిధ పథకాలను అమలు చేస్తూ యువత భవితకు బాటలు వేస్తున్నది.

తెలంగాణ రాష్ట్ర జనాభాలో 40 శాతంపైన ఉన్న యువజనుల సర్వతో ముఖాభివృద్ధికి రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ అనేక కార్యక్రమాలు చేపడుతున్నది. హైదరబాద్, సికింద్రాబాద్ జంట నగరాలలోని నిరుద్యోగ యువతకు వివిధ కోర్సులలో శిక్షణ అందించి వారికి ఉపాధి కల్పించే లక్ష్యంతో శిక్షణ మరియు ఉపాధి ప్రోత్సాహక సంస్థ (సెట్విన్) పనిచేస్తోంది.

### ఆవిర్భావం

1972లో ప్రారంభమైన యువజన సర్వీసుల శాఖ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో జిల్లా యువజన మరియు క్రీడల అధికారుల ఆధ్వర్యంలో యువజనుల కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారు.

### సామాజిక సేవ

మహిళా స్వయంశక్తి సంఘాల తరహాలో 18-35 సంవత్సరాల మధ్య వయస్సుగల యువతీ, యువకులతో యువజన సంఘాల ఏర్పాటుకు ప్రోత్సాహం అందిస్తున్నారు. ప్రతి గ్రామంలో యువజన సంఘాలు ఏర్పాటు చేసి వారి ద్వారా గ్రామంలో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పిస్తూ వారిని స్వచ్ఛభారత్ వంటి కార్యక్రమాలలో భాగస్వాములను చేస్తూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు.

### శిక్షణ

నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ కోర్సులలో స్వల్పకాలిక శిక్షణ

తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ & ప్రొహిబిషన్, క్రీడలు మరియు యువజన సర్వీసుల శాఖ మంత్రి, హైదరాబాద్.



సెట్విన్ ముషీరాబాద్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర కార్మిక శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ, తెలంగాణ రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి టి. పద్మారావు గౌడ్.

అందిస్తూ వారికి ఉద్యోగాల కల్పనకు దోహదపడే కార్యక్రమాలు అమలుచేస్తున్నారు. ఆర్మీ, వాయుసేన, నేవీ వంటి రంగాలలో యువకులు చేరేలా ప్రోత్సహిస్తూ వారికి తగిన శిక్షణ అందజేస్తున్నారు.

**ఆత్మీయ సేవ**

యువజన సంఘాల సభ్యులు స్వచ్ఛందంగా రక్తదానం, అవయవదానం చేసేలా ప్రోత్సహిస్తూ గ్రామీణ ప్రాంతాలలో యువత సహకారంతో రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. జాతీయ నాయకుల జన్మదినాల సందర్భంగా వారిని స్మరిస్తూ అనేక కార్యక్రమాలు అమలుచేస్తున్నారు. యువతకు స్ఫూర్తి ప్రదాత అయిన స్వామి వివేకానందుని జన్మదినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం జనవరి 11 నుండి వారం రోజులపాటు జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలో జాతీయ యువజన వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇవేకాకుండా యువజనుల ప్రయోజనం కోసం యువ నాయకత్వ శిక్షణా శిబిరాలు, యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాలు, యువతలోని కళా ప్రతిభను వెలికి తీయడానికి జిల్లా మరియు రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలు నిర్వహించి జాతీయ యువజనోత్సవాలకు మన రాష్ట్ర బృందాన్ని పంపుతున్నారు.

**తెలంగాణ యువరత్నాలు**

జాతీయ స్థాయిలో దాదాపు 26 యువ నాయకులకు వివిధ సేవారంగాలలో యువజన అవార్డులను, 6 యువజన సంఘాలకు అవార్డులను దేశస్థాయి అవార్డులను బహూకరించడం జరిగింది.

**సెట్విన్**

జంట నగరాలలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించే విధంగా విధాన రూపకల్పన చేసి, శిక్షణా కార్యక్రమాలు అమలు చేయడానికి నాలుగు దశాబ్దాల క్రితం సెట్విన్ సంస్థ ఆవిర్భవించింది. ప్రారంభంలో పాత నగరానికే పరిమితమైన సెట్విన్ కార్యకలాపాలు అంచలంచెలుగా జంట నగరాలలోని అన్ని ప్రాంతాలలో శిక్షణ సంస్థలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు సేవలు అందిస్తున్నది.

**వృత్తి శిక్షణ**

దుస్తుల తయారీ, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, జరీజర్దోసి వంటి కోర్సులలో మహిళలకు చక్కటి శిక్షణ అందిస్తూ వారు స్వయం ఉపాధి చేపట్టి జీవితంలో స్థిరపడేలా ప్రోత్సాహం అందిస్తున్నారు. రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషనింగ్, డీజిల్ మెకానిజం, ఆటో ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రీషియన్ వంటి కోర్సులలో శిక్షణ అందిస్తూ యువకులు మన దేశంలోనే కాకుండా విదేశాలలో కూడా ఉద్యోగాలు పొందేలా కృషి చేస్తున్నారు. వీటితోపాటు అత్యంత డిమాండ్ కలిగిన కంప్యూటర్ కోర్సులలో స్వల్పకాలిక శిక్షణ అందిస్తూ యువతీ, యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు సంపాదించుకునేలా ప్రోత్సహిస్తున్నారు.

**సెట్విన్ సాంకేతిక శిక్షణ కేంద్రాలు**

ప్రస్తుతం రాష్ట్రంలో సెట్విన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 22 స్వంత శిక్షణా సంస్థలలో ప్రతి సంవత్సరం సుమారు 10,000 మంది యువతీ, యువకులు శిక్షణ పొందుతున్నారు. అలాగే సెట్విన్ అధీకృత సెంటర్లు రాష్ట్రంలో 25 ఉండగా, వాటి ద్వారా కూడా సుమారు 5,000 మంది ప్రతి సంవత్సరం శిక్షణ పొందుతున్నారు. తక్కువ రుసుముతో 20 కోర్సులలో శిక్షణ అందిస్తూ, శిక్షణ పూర్తయిన తర్వాత పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులయిన వారికి సర్టిఫికెట్లు అందజేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన NIMSME వారి సర్టిఫికెట్ కూడా అందజేస్తున్నారు. దీనితో శిక్షణ పూర్తి చేసుకొని ఉత్తీర్ణులయిన వారు. స్వదేశంలోనే కాకుండా విదేశాలలో కూడా ఉద్యోగాలు సంపాదించుకుంటున్నారు.

**ఉపాధి**

సెట్విన్ ప్రధాన కార్యాలయంలో శిక్షణ పొందిన అభ్యర్థులు ప్రయోజనార్థం ప్లేస్



యువతకు స్వయం ఉపాధి శిక్షణ

మెంట్ సెల్ కూడా నిర్వహిస్తున్నారు. సుమారు 40 కంపెనీలకు చెందిన ప్రతినిధులు సెట్విన్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులకు ఉద్యోగాలలో ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రస్తుతం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొత్త కోర్సులకు ప్రారంభించి ఎక్కువమందికి శిక్షణ అందించి ఉపాధి కల్పించే లక్ష్యంతో సెట్విన్ పని చేస్తోంది. పాత నగరంలోని నిరపేద ముస్లిం యువతీ, యువకుల ప్రయోజనార్థం కొన్ని కేంద్రాలలో సగం ఫీజు రాయితీగా కల్పించి, నామమాత్రపు రుసుముతో శిక్షణ అందిస్తున్నారు. దాదాపు 3,482 మంది యువతకు 2015-16, 2016-17 సం॥లలో వివిధ సంస్థలలో ఉద్యోగాలు కల్పించడం జరిగింది.

## ట్రేడింగ్

సెట్విన్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఉత్పత్తి కేంద్రాలలో ప్రభుత్వ కార్యాలయాలకు కావలసిన వివిధ రకాలైన స్టేషనరీ ఉత్పత్తి చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వం కార్యాలయాలకు అవసరమైన వివిధ రకాల వస్తువులు సెట్విన్ ద్వారా ఎటువంటి టెండర్ ప్రక్రియ లేకుండా కొనుగోలు చేయవచ్చును.

## రవాణా సౌకర్యం

జంటనగరాలలో సెట్విన్ ఆధ్వర్యంలో నడుస్తున్న 100 మిని బస్‌లు వివిధ మార్గాలలో ప్రయాణికులకు సేవలందిస్తున్నాయి. ఆర్టీసీ వారు నిర్ణయించిన టికెట్ ధరలకే సెట్విన్ బస్‌లలో కూడా ప్రయాణించ వచ్చును. పట్టణ యువతకు, గ్రామీణ యువతకు వివిధ శాఖల ద్వారా సమన్వయం చేసి వారిక మార్గదర్శిగా సెట్విన్ పనిచేస్తున్నది.

వివిధ భారత ప్రభుత్వ పథకాలపై రాష్ట్ర స్థాయి పథకాల అమలుకై యువతకు దిశా నిర్దేశం చేయడానికి, వర్క్‌షాప్‌లను, సెమినార్‌లను, జాబ్‌మేళాలను నిర్వహిస్తూ, కొత్త కోర్సులను ప్రవేశపెట్టి యువతకు అండదండగా ఉంటున్నది.

ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు మార్గనిర్దేశంతో, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి పద్మారావు గౌడ్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం యువతకు విలువలతో కూడిన వ్యక్తిత్వంతో పాటు ఆర్థిక పరిపుష్టి చేయడానికి యువజన సర్వీసులు మరియు సెట్విన్ సంస్థ ఆహర్నిశలు కృషి చేస్తున్నాయి. ■




జాబ్‌మేళాను ప్రారంభిస్తున్న తెలంగాణ రాష్ట్ర క్రీడలు మరియు యువజన సర్వీసుల శాఖ మంత్రి టి. పద్మారావు గౌడ్



# విజ్ఞాన విపంచి

ప్రాతూరి పోతయ్య శర్మ

1) భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మే 5 , 2017న శ్రీహరి కోట నుండి GSLV-F 09 రాకెట్ ద్వారా ప్రయోగించిన, సుమారు 2,230 కిలోల బరువున్న GSAT–9 'దక్షిణ ఆసియా ఉపగ్రహం' వివరాలేవీ?
   - ఎ) దీనిలో 12 Ku బ్యాండ్ ట్రాన్స్ పాండర్స్ ఉన్నాయి.
   - బి) దక్షిణాసియాలో ఉన్న ఆరు దేశాలకు ఉపగ్రహ సౌకర్యాలు లభిస్తాయి.
   - సి) దాదాపు రూ. 450 కోట్లు ఖర్చు అయ్యింది.
   - డి) పైవన్నీ (దీన్ని 'స్పేస్ డిప్లోమసి' /అంతరిక్ష దౌత్య నీతి అంటున్నారు)

2) భారతీయ బ్యాంకింగ్ సిస్టంలో ఉన్న రూ. 14 లక్షల కోట్ల స్ట్రెస్డ్ ఎసెట్స్ సమస్య పరిష్క రించటానికి కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్ వల్ల కలిగే ప్రయోజనాలు ఏవి?
   - ఎ) ఎసెట్స్ అమ్మకం
   - బి) ఇన్‌సాల్‌వెన్సి & బ్యాంకరప్టసి ప్రొసీడింగ్స్ అమలు చేయటం.
   - సి) NPA పరిష్కారంలో RBI కి చట్ట పరంగా ప్రత్యక్ష పాత్ర ఉండటం
   - డి) పైవన్నీ

3) 64వ జాతీయ ఫిల్మ్ అవార్డులలో, ఇటీవల ఎవరెవరికి ఏ ఏ బహుమతులు ఇచ్చారు?
   - ఎ) దాదాసాహెబ్ ఫాల్కే వార్డ్ : కాశీనాథుని విశ్వనాథ్
   - బి) ఉత్తమ నటుడు : అక్షయ్ కుమార్
   - సి) ఉత్తమ నటి (మలయాళం సినిమాలో నటించినందుకు ) : C. M. సురభి
   - డి) పైవన్నీ

4) జాతీయ ఫిలిం అవార్డులలో, ఉత్తమ ఫీచర్ ఫిల్మ్‌కి స్వర్ణ కమలంతో పాటు ఎంత నగదు బహుమతి ఇస్తారు ?
   - ఎ) రూ. 10 లక్షలు బి) రూ. 2,50,000
   - సి) రూ. 50,000 డి) రూ. 10,000

5) ఇటీవల అండమాన్ & నికోబార్ దీవులలో పరీక్షించిన అడ్వాన్స్ బ్రహ్మోస్ బ్లాక్ – III ల్యాండ్ క్రూ యిజ్ మిస్సైల్ (LACM) ప్రస్తుత రేంజ్ ఎంత ? (కి.మి.లలో )
   - ఎ) 290 బి) 450 సి) 600 డి) 1000

6) రూ. 6000 కోట్ల నిధుల కేటాయింపుతో ప్రారంభించబడే 'సంపద' స్కీం ఎందుకోసం?
   - ఎ) వ్యవసాయ మరియు తదితర రంగంలో వ్యర్థ పదార్థాలు తగ్గించటం మరియు ప్రాసెసింగ్ ఆధునీ కరించటం
   - బి) కంప్యూటర్ కొనుగోలు
   - సి) విద్యాభ్యాసం డి) విదేశీ యానం

7) శారదా ప్రసాద్ కమిటీని నియమించిన మంత్రిత్వ శాఖ ఏది ?
   - ఎ) స్కిల్ డెవలప్‌మెంట్ & ఎంటర్ ప్రెన్యువర్‌షిప్ మినిస్ట్రీ
   - బి) ఆర్థిక మంత్రిత్వ శాఖ
   - సి) హోం అఫైర్స్ డి) రైల్వేస్

8) SEBI డేటాప్రకారం భారతీయ స్టాక్ మార్కెట్ లాభాల దిశగా నడవటానికి ప్రధానంగా ఏ దేశాల నుండి వచ్చిన ఫారిన్ పోర్ట్ ఫోలియో ఇన్వెస్టర్లు (FPI) కారణం?
   - ఎ) USA బి) లగ్జెంబర్గ్
   - సి) కెనడా, మారిషస్ డి) పైవన్నీ వరుసగా

9) ఇటీవల స్టాక్ మార్కెట్ వార్తల్లో ఉన్న 'గుర్నీ & జెర్సీ' అనే దీవులు ఎక్కడ ఉన్నాయి ?
   - ఎ) పాక్ స్ట్రైట్ బి) ఇంగ్లీష్ ఛానల్
   - సి) 4 డిగ్రీ ఛానల్ డి) బెర్రింగ్ స్ట్రైట్

10) 'ట్విన్ బాలెన్స్‌షీట్' సమస్యదేనికి సంబంధించినది?
   - ఎ) ఒక పక్క స్ట్రెస్ డ్ కంపెనీలు (అనగా బ్యాంకుల నుండి అప్పులు తీసుకున్న కంపెనీలు, అప్పులు తీర్చటం లేదు) మరో పక్క NPA లతో సతమత మయ్యే బ్యాంకుల గురించి.
   - బి) ఎగుమతులు దిగుమతులు
   - సి) విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు
   - డి) సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్స్

11) టీ బోర్డు అఫ్ ఇండియా కొత్త చైర్మన్ ఎవరు ?
   - ఎ) MGVK భాను బి) P.K. బేజ్ బారువా
   - సి) రాధా మోహన్ సింగ్
   - డి) నిర్మలా సీతారామన్

12) ఏప్రిల్ 28 , 2017 నాటికీ RBI లో ఉన్న విదేశీ మారక ద్రవ్య నిధులు ఎంత (US $ బిలియన్లలో)
   - ఎ) 27 4 బి) 372.7 సి) 371 డి) 300

13) ఇండెక్స్ అఫ్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ (IIP) యొక్క కొత్త సిరీస్ కోసం దేన్నీ 'బేస్ ఇయర్' గా చేసుకుని ప్రతి నెలా వృద్ధిని లెక్క కడతారు?
   - ఎ) 2004 – 05 బి) 2011 – 12
   - సి) 1994 – 95 డి) 2001 – 02

14) ఎయిడ్స్ వ్యాధిగ్రస్తునికి CD4 కౌంట్ ఒక క్యూబిక్ మిల్లి మీటర్‌లో 200 కణాల కన్నా తక్కువగా ఉంటే ART ట్రీట్ మెంట్ ప్రారంభించాలని WHO, 2002లో తెలిపింది. CD4 ఏమిటి?
   - ఎ) ఇవి ఒక రకమైన తెల్ల రక్త కణాలు.
   - బి) ఎర్ర రక్త కణాలు.
   - సి) స్టెమ్ సెల్స్ డి) న్యూరాన్‌లు

15) USA, ఏ దేశంలో టెర్మినల్ హై ఆల్టిట్యూడ్ ఏరియా డిఫెన్సు (THAAD) బాటరీని, ఏర్పాటు చేయ తలచినది ?
   - ఎ) సౌత్ కొరియా బి) జపాన్
   - సి) అర్జెంటినా డి) బ్రెజిల్

16) స్వచ్ఛ సర్వేక్షణ్–2017, సర్వే ప్రకారం ఏది స్వచ్ఛ నగరాల జాబితాలో ప్రథమ స్థానంలో ఉంది ?
   - ఎ) ఇండోర్ బి) విశాఖపట్నం
   - సి) సూరత్ డి) మైసూరు

17) ప్రస్తుత మలబార్ ఎక్సర్‌సైజ్‌లో పాల్గొనే దేశాలు ఏవి?
   - ఎ) USA బి) ఇండియా
   - సి) జపాన్ డి) పై మూడు దేశాలు

18) క్రూసిబుల్ థియేటర్‌లో నిర్వహించే 2017 వరల్డ్ స్నూకర్ ఛాంపియన్ షిప్ విజేత ఎవరు?
   - ఎ) స్టీవ్ డేవిస్ బి) మార్క్ సెల్బీ
   - సి) స్టీఫెన్ హేన్ డ్రీ డి) రోనీ ఓసుల్లి వాన్

19) విశ్వవిద్యాలయాలలో 15x20 అడుగుల గోడలపై 21 మంది పరం వీర్ చక్ర అవార్డులో పొందిన 21 మంది చిత్రాలను ఏర్పాటు చేయదలచిన కార్యక్రమం ఏది ? (దీన్ని కేంద్ర మనవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖమంత్రి ప్రారంభించారు)
   - ఎ) 'వాల్స్ అఫ్ హీరోస్' (విద్యా వీరతా అభియాన్) బి) స్వచ్ భారత్
   - సి) ఉడాన్ డి) ఉమంగ్

20) భూ గోళ వాతావరణం వేడెక్కటం వల్ల సముద్ర మట్టం పెరిగి, రాబోయే70 ఏళ్లలో సముద్రపు నీళ్లలో తొలిసారిగా మునిగి పోయే చిన్న ద్వీపం ఏది ?
   - ఎ) తువాలు (ఇది దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలో ఉంది)
   - బి) నౌరు సి) కిరిబాటి డి) ఫిజి

21) కోడై కెనాల్ సోలార్ అబ్జర్వేటరీ, తమిళనాడులో ఉంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్ ఎక్కడ ఉంది ?
ఎ) గొట్టిన్ జెన్ బి) బెంగళూరు
సి) బీజింగ్ డి) టోక్యో

22) ఒకినొషిమా దీవి ఎక్కడుంది ?
ఎ) ఫ్రాన్స్ బి) జపాన్
సి) స్వీడన్ డి) ఫిన్ ల్యాండ్

23) 1801లో ఈస్ట్ ఇండియా కంపెనీ అవధ్ (అయోధ్య) రాజ్యం నుండి గోరఖ్‌పూర్‌ను వేరుచేశారు. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ వివరాలు ఏవి?
ఎ) ఇక్కడ గోరఖ్ నాథ్ మందిరం ఉంది.
బి) గీతాప్రెస్ ఉంది.
సి) ఫిరాఖ్ గోరఖ్ పూరి అనే ప్రఖ్యాత ఉర్దూ కవి తన పేరులో ఈ ఊరు పేరు ఉంచుకుని, అనేక సినిమా రచనలు చేసాడు. (ఈయన అసలు పేరు రఘుపతి సహాయ్)
డి) పైవన్నీ

24) 'జియో పార్సీ' అనే పథకం దేనికి సంబంధించింది?
ఎ) పార్సీల జనాభా తగ్గి పోకుండా తీసుకునే ప్రోత్సాహకర చర్యల ప్రాజెక్ట్ ఇది.
బి) మహిళా సాధికారత
సి) బాలికల సంరక్షణ డి) క్రీడల ప్రోత్సాహం

25) ఫరక్కా బారేజ్, ఏ నది మీద ఉంది ? వివరాలేవీ?
ఎ) గంగా నది మీద (పశ్చిమ బెంగాల్‌లో ఉంది) బి) పొడవు: 2.6 కి.మి.
సి) 40 ఏళ్ల క్రితం నిర్మించారు
డి) పైవన్నీ

26) సుక్మా( ఛత్తీస్ గఢ్)లో నివసించే గిరిజన తెగలు ఏవి?
ఎ) గోండ్ బి) మురియా; డోర్ల
సి) హల్బా & మహారా డి) పైవన్నీ

27) 'సార్క్ మైనస్ వన్' అంటే, సార్క్ దేశాలలోని ఏ దేశాన్ని కలుపు కొలేదనే అర్థాన్ని తెలియ చేస్తుంది?
ఎ) చైనా బి) పాకిస్తాన్
సి) రష్యా డి) జపాన్

28) UN వేసక్డే సెలెబ్రేషన్స్, బుద్ధ పూర్ణిమ రోజున శ్రీలంకలో ఎక్కడ నిర్వహించ దలచారు?
ఎ) జాఫ్న బి) కొలంబో
సి) బన్నెర హట్ట డి) కొడగు

29) గౌతమ బుద్ధుని దంతం ఉన్న దేవాలయం/ గుడి శ్రీలంకలో ఎక్కడ ఉంది ?
ఎ) హంబంతోట బి) కాండీ
సి) ముళ్ళ తీవు డి) మన్నార్ గల్ఫ్

30) ట్రిపుల్ తలాక్ అంశం మీద అమికస్ క్యూరీ'గా పనిచేయటానికి , సుప్రీమ్ కోర్ట్ ఎవరికీ అనుమతి ఇచ్చింది?
ఎ) ముకుల్ రోహాత్గి బి) ఫాలి S నారిమన్
సి) సల్మాన్ ఖుర్షీద్ డి) రామ్ జఠ్మలాని

31) జమ్మూ & కాశ్మీర్‌లో ప్రతి ఏటా శీతాకాలంలో సెక్రటేరియట్‌లో పనిచేసే అధికారులు ఫైళ్ళతో సహా శ్రీనగర్ నుండి జమ్ముకి మారతారు. దీన్ని 'దర్బార్ మూవ్' లేక 'డోగ్రా కాలపు పని తీరు' అంటారు. దీన్ని క్రీస్తు శకం 1872లో కాశ్మీర్‌ని పాలించిన ఏ మహారాజు ప్రారంభించారు ?
ఎ) మహారాజ గులాబ్ సింగ్
బి) మహారాజ కరణ్ సింగ్
సి) రాజా జై సింగ్ డి) రాజా మాన్ సింగ్

32) 9.15 కి.మీ. పొడవున్న ధోలా - సడియా బ్రిడ్జిని ఏ నదిపై నిర్మించారు. వివరాలు ఏవి?
ఎ) బ్రహ్మ పుత్ర నది మీద.
బి) తిన్ సుఖియా జిల్లా, అరుణాచల్ ప్రదేశ్
సి) ఇది అస్సాంని, తూర్పు - అరుణాచల్ ప్రదేశ్‌ని కలుపుతుంది డి) పైవన్నీ

33) 359 మీటర్ల ఎత్తుతో రూ. 1200 కోట్ల రూపాయల ఖర్చుతో చీనాబ్ నది మీద నిర్మిస్తున్న 1.3 కి.మీ. పొడవున్న రైలు బ్రిడ్జి దేని కంటే ఎత్తైనది?
ఎ) ఈఫిల్ టవర్ కన్నా 35 రెట్లు ఎత్తైనది.
బి) కుతుబ్ మినార్ కన్నా 5 రెట్లు ఎత్తైనది.
సి) ఎవరెస్ట్ శిఖరం కన్నా ఎత్తైనది.
డి) (ఎ) & (బి) రెండూ కరెక్ట్.

34) ఇటీవల ఫ్రాన్స్‌లో 'ఎన్ మార్చ్' అనే ఉద్యమం మొదలు పెట్టి అధ్యక్ష ఎన్నికల్లో 66 శాతం ఓట్లు పొంది గెలిచినది ఎవరు?
ఎ) మారిన్ లెపెన్
బి) ఎమ్మాన్యుయేల్ మక్రాన్
సి) జాక్వెస్ చిరాక్
డి) నెపోలియన్ బోనాపార్టే

35) SPARK అనే అబ్రివేషన్ విస్తరించండి? వివరాలు ఇవ్వండి?
ఎ) సస్టెయినబుల్ ప్రోగ్రెస్‌త్రూ అప్లికేషన్ అఫ్ రీసెర్చ్ & నాలెడ్జ్.
బి) భారతదేశంలో సైన్సు అభివృద్ధి చేయటానికి వచ్చిన ప్రతిపాదన.
సి) NITI అయోగ్ సైన్సు మేనేజ్ మెంట్ గురించి చర్చిస్తోంది. డి) పైవన్నీ

36) ప్రాచీన మానవుల (హోమో నేలాడి) అస్థికలు విస్తారంగా లభించిన 'రైజింగ్ స్టార్ కేవ్ సిస్టం' ఎక్కడుంది?
ఎ) హిమాలయాలు
బి) జోహాన్స్‌బెర్గ్ (దక్షిణ ఆఫ్రికా)కి 50 కి.మీ. దూరంలో ఉంది.
సి) అమెజాన్ లోయ డి) నైల్ నది లోయ

37) "ప్రెసిడెంట్‌ఈజ్ మిస్సింగ్" అనే పుస్తకాన్ని ఎవరు రాయదలచారు ?
ఎ) జేమ్స్ పాటర్‌సన్, బిల్ క్లింటన్‌తో కల్సి
బి) అమితావ్ ఘోష్
సి) అరుంధతి రాయ్ డి) బిల్ గేట్స్

38) పేలియో రివర్స్ (ప్రాచీన నదులు) ప్రస్తుతం కొన్ని ఎండి పోయాయి. కాని వాటిని పునరుద్ధరించటం వలన, భూగర్భజల సంపద పెరుగుతుంది. భారత దేశంలోని పేలియో నదులు ఏవి?
ఎ) మిథికల్ సరస్వతి నది (ఋగ్వేదంలో మరియు హిందూ పురాణాలలో చెప్పబడినది)
బి) మార్కండ నది
సి) సర్సుతి నది (ఇప్పుడు దీన్ని టోన్ - యమునా నది అని అంటున్నారు)
డి) పైవన్నీ (ప్రాచీనకాలంలో సరస్వతి నది రాజస్తాన్ దరిదాపు ప్రాంతంతో ప్రవహించేది)

39) K2 (లేక) మౌంట్ ఆస్టిన్ గాడ్విన్ (లేక) భోగోరి పర్వతం ఎత్తు ఎంత (మీటర్లలో).
ఎ) సుమారు 8000 బి) 5000
సి) 2000 డి) 1000

40) మల్టీ-డ్రగ్-రెసిస్టంట్ TB ఏ దేశాలలో అధికంగా ఉంది ?
ఎ) రష్యా బి) ఇండియా
సి) ఫిలిప్పైన్స్ డి) పైవన్నీ వరుసగా

41) దక్షిణ కొరియా కొత్త అధ్యక్షుడు ఎవరు ?
ఎ) మూన్ జే-ఇన్ బి) పార్క్ గ్యున్ హై
సి) బాన్ కి మూన్ డి) లేకేక్యియాంగ్

42) సుప్రీమ్ కోర్ట్‌లో ఇంటిగ్రేటెడ్ కేస్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం (ICMIS) ను ప్రవేశపెట్టారు. త్వరలో ఇంకా ఎక్కడ ప్రవేశ పెట్టదలిచారు? దీని వల్ల ఉపయోగాలేవి?
ఎ) 24 హైకోర్టులు & సబార్డినేట్ కోర్ట్‌లలో
బి) దీనితో 'పేపర్ లెస్ వర్క్' మొదలౌతుంది
సి) ఒక A4 సైజు పేపర్ తయారీకి 10 లీటర్ల నీరు ఖర్చు అవుతుంది .
డి) పైవన్నీ

43) కోరమండల్ కోస్ట్‌లో బీచ్ ప్రోమేనేడ్‌లో 181 సంవత్సరాల పురాతన లైట్ హౌస్ ఉంది. బీచ్ ప్రోమేనేడ్ ఏ ప్రాంతంలో ఉంది?
ఎ) కేరళ బి) పుదుచ్చేరి
సి) కర్ణాటక డి) మహారాష్ట్ర

44) మౌర్య సామ్రాజ్య స్థాపకుడు, చంద్రగుప్త మౌర్య ఆఖరి రోజులలో శ్రావణ బెల్గోలలో నివశించాడు. ఇక్కడున్న వింధ్య గిరిపై 57 అడుగుల ఎత్తున్న గోమటేశ్వర విగ్రహం ఏ మతానికి చెందినది?
ఎ) బౌద్ధ బి) జైన
సి) హీనయాన డి) పార్శి

45) ఛిన్నార్ వన్యప్రాణి సంరక్షణ ఎక్కడ ఉంది?
ఎ) ఒడిశా బి) కేరళ
సి) పశ్చిమ బెంగాల్ డి) బీహార్

46) 2011-12 అర్ధక సంవత్సరం, వేటికి బేస్ ఇయర్‌గా కాలిక్యులేషన్స్‌లో ఉండబోతోంది?
ఎ) ఇండెక్స్ అఫ్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్
బి) హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్
సి) కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ & గ్రాస్ వాల్యూ యాడెడ్ డి) పై అన్నింటికీ

47) నార్త్ ఇండియన్ ఓషన్ (NIO)లో ఏవేవి ఉన్నాయి?
ఎ) అరేబియా సముద్రం బి) బంగాళాఖాతం
సి) 5 డిగ్రీల లాటిట్యూడ్ వరకు గల హిందూ మహాసముద్రం డి) పైవన్నీ

48) ASEAN మరియు ఆరు ఇతర దేశాలు కలిసి రీజినల్ కంప్రెహెన్సివ్ ఎకనామిక్ పార్టనర్ షిప్ (RCEP) అనే ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ చేసుకో దలిచారు. ఇందులో గల ఆరు ఇతర దేశాలు ఏవి?
ఎ) ఆస్ట్రేలియా, చైనా, ఇండియా.
బి) జపాన్, దక్షిణ కొరియా.
సి) న్యూజిలాండ్ డి) పైవన్నీ

49) రియల్ ఎస్టేట్ రెగ్యులేటరి యాక్ట్ ఎప్పటి నుండి అమలులోకి వచ్చింది? దీని వివరాలు ఏవి?
ఎ) మే 1, 2017
బి) 500 చ.మీ. వైశాల్యం లేక కనీసం 8 అపార్ట్‌మెంట్స్ ప్రాజెక్టులను రిజిస్టర్ చేయాలి.
సి) డెవలపర్స్ & కొనుగోలు దారులు ఇద్దరి యొక్క ఆలస్యాలకు పెనాల్టి విధించవచ్చును.
డి) పైవన్నీ

50) టాస్రా ఓపెన్ కాస్ట్ గని ఎక్కడ ఉంది? వివరాలు ఏవి?
ఎ) ఝరియ కోల్ ఫీల్డ్స్, ధన్‌బాద్‌లో ఉంది.
బి) ఇక్కడ 3 లక్షల ప్రైమ్ కోకింగ్ కోల్ బయటికి తీస్తారు.
సి) స్టీల్‌అథారిటీ అఫ్ ఇండియా అభివృద్ధి చేస్తుంది. డి) పైవన్నీ

51) నాలుగు వాటర్ కాన్సెప్టులు ఏవి?
ఎ) వర్షపు నీరు వాడటం (ఇది ప్రధాన పాత్ర వహిస్తుంది)
బి) ఉపరితల నీరు వాడటం మరియు భూగర్భ జలవాడకం.
సి) మట్టిలో ఉండే నీటి తేమ శాతాన్ని హై లెవెల్‌లో మెయిన్‌టైన్ చేయటం.
డి) పైవన్నీ.

52) ఎర్త్‌డే ఎప్పుడు?
ఎ) ఏప్రిల్ 22, 2017 బి) ఏప్రిల్ 7
సి) ఏప్రిల్ 23 డి) ఏప్రిల్ 24

53) గోల్డ్ మాన్ ఎన్విరాన్ మెంటల్ ప్రైజ్, 2017 ఎవరికి ఇచ్చారు ?
ఎ) ప్రఫుల్ల సమంతారా (ఒడిశాలోని నియంగిరి కొండల్లో నివసించే డోంగ్రియా ఖోండ్ తెగ ప్రజల బాగు కోసం కృషి చేశాడు.)
బి) అమర్త్యసేన్ సి) బెజావాడ విల్సన్
డి) ఝుంపా లాహిరి

54) 20 అడుగుల ఎత్తు ఉన్న బుద్ధుని శిలా విగ్రహాలు (ఆఫ్ఘనిస్తాన్‌లోని బమియాన్‌లో మాదిరిగా) హిమాలయ పర్వతాలలో, క్రీస్తు శకం మొదటి శతాబ్దంలో చెక్కారు. అవి ఎక్కడ ఉన్నాయి?
ఎ) కార్త్‌సేఖార్ (సురులోయ)
బి) అపతి, కార్గిల్ దగ్గర
సి) ముల్బేఖ్ & ద్రాస్ డి) పైవన్నీ

55) ఏప్రిల్ 2017లో FII లు భారతీయ ఈక్విటీస్ (షేర్ మార్కెట్)లో ఎంత కన్న ఎక్కువగా పెట్టుబడి పెట్టారు (US బిలియన్ డాలర్లు).
ఎ) 3.4 బి) 2.0 సి) 5.0 డి) 6.0

56) NITI అయోగ్ సమర్పించిన మూడు సంవత్సరాల యాక్షన్ ప్లాన్‌లో చర్చించిన అంశాలు ఏవి?
ఎ) ఆహార సబ్సిడీలు తగ్గించటం.
బి) సోషల్ సబ్సిడీలను రీ ఓరియంట్ చేయటం
సి) ఎరువుల సబ్సిడీ రూ. 70,000 కోట్లుగా రాబోయే 3 ఏళ్లు కూడా కొనసాగించటం
డి) పైవన్నీ.

57) సార్క్ దేశాల సబ్ గ్రూప్ అయిన BBIN చేసుకున్న మోటార్ వెహికల్స్ అగ్రిమెంట్ నుండి ఏ దేశం తప్పుకున్నది ?
ఎ) భూటాన్ బి) బంగ్లాదేశ్
సి) నేపాల్ డి) ఇండియా

58) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్?
ఎ) సైప్రస్ : నికోస్ అనస్టాసియాడెస్
బి) టర్కీ : రిసెప్ తయ్యిప్ ఎర్డోగాన్
సి) ఆస్ట్రేలియా : మాల్కం టర్న్‌బుల్
డి) పై అందరూ.

59) జుడీషియల్ పెర్ఫార్మన్స్ ఇండెక్స్‌ను ప్రవేశపెట్టాలని ఎవరు సూచించారు?
ఎ) ప్లానింగ్ కమిషన్ బి) NITI ఆయోగ్
సి) CII డి) FICCI

60) రోనాల్డ్ రాస్ ఇన్స్టిట్యూట్ అఫ్ పారా సైటోలజి ఎక్కడుంది? (రోనాల్డ్ రాస్ ఇక్కడ ఆగష్టు 1897లో మలేరియా పరాన్న జీవిని కనుగొన్నారు)
ఎ) చెన్నై బి) బేగంపేట్, సికింద్రాబాద్
సి) ముంబై డి) కోల్‌కత

61) ప్రతిపాదిత IDEAS వివరాలేవీ?
ఎ) ఇన్నోవేషన్స్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఎఫిషియెంట్ & ఎఫోర్డబుల్ సిస్టమ్స్.
బి) వివిధ రంగాలలో పరిశోధనలు చేయటం కోసం, విద్యార్థులకు అవకాశాలు కల్పిస్తారు
సి) ఉత్తమ పరిశోధనలకి ఒక కోటి రూపాయల బహుమతి ఇస్తారు. డి) పైవన్నీ

62) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్?
ఎ) 'ఏ హార్స్ వాక్స్ ఇన్ టు ఏ బార్' : డేవిడ్ గ్రాస్ మాన్ (ఇజ్రాయిల్).
బి) 'కంపాస్' : మాథియాస్ఏ నార్డ్ (ఫ్రాన్స్)
సి) 'ఫీవర్ డ్రీం' : సమంతాష్వే బ్లిన్; 'జుదాస్': అమోస్ ఓజ్ (ఇజ్రాయెల్) డి) పైవన్నీ

63) మ్యాన్ ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్, లండన్‌లో ఇస్తారు. బహుమతి విలువ ఎంత? (బ్రిటిష్ పౌండ్లలో)
ఎ) 40,000 బి) 50,000
సి) 10,000 డి) 25,000

64) రాజీవ్ గాంధీ స్టేడియం, ఐజ్వాల్, మిజోరంలో ఉంది. ఇటీవల ఇక్కడ ఏ పోటీని నిర్వహించటం వల్ల ఆ రాష్ట్ర క్రీడా కారులకి మంచి పేరు వచ్చింది?
ఎ) బాక్సింగ్ బి) ఫుట్ బాల్
సి) క్రికెట్ డి) టెన్నిస్

65) నేషనల్ సివిల్ సర్వీసెస్ డే ఎప్పుడు?
ఎ) మార్చ్, 8 బి) ఏప్రిల్, 21
సి) మే, 11 డి) జూన్, 11

66) కాఫీ వాసన వెదజల్లే పోస్టల్ స్టాంప్ ఇటీవల విడుదల చేశారు. గతంలో ఏ దేశాల వాళ్ళు తొలిసారిగా సువాసనలు వెదజల్లే పోస్టల్ స్టాంప్ విడుదల చేశారు?
ఎ) భూటాన్ బి) బ్రెజిల్
సి) చైనా డి) అర్జంటినా

67) NITI అయోగ్ ప్రతిపాదించిన 15 సంవత్సరాల విజన్ డాక్యుమెంట్ వివరాలేవీ?
ఎ) 7 సంవత్సరాల స్ట్రాటజి మరియు 3 సంవత్సరాల యాక్షన్ ప్లాన్‌లు ఉంటాయి.
బి) సంపన్న వర్గాల ఆదాయాలు
సి) ధనికుల విదేశీ పర్యటనలు
డి) ఇవేవి కావు

## జవాబులు (జూన్ - 2017)

| | | | |
|---|---|---|---|
| 1-డి | 18-బి | 35-డి | 52-ఎ |
| 2-డి | 19-ఎ | 36-బి | 53-ఎ |
| 3-డి | 20-ఎ | 37-ఎ | 54-డి |
| 4-బి | 21-బి | 38-డి | 55-ఎ |
| 5-బి | 22-బి | 39-ఎ | 56-డి |
| 6-ఎ | 23-డి | 40-డి | 57-ఎ |
| 7-ఎ | 24-ఎ | 41-ఎ | 58-డి |
| 8-డి | 25-డి | 42-డి | 59-బి |
| 9-ఎ | 26-డి | 43-బి | 60-బి |
| 10-ఎ | 27-బి | 44-బి | 61-డి |
| 11-బి | 28-బి | 45-బి | 62-డి |
| 12-బి | 29-బి | 46-డి | 63-బి |
| 13-బి | 30-సి | 47-డి | 64-బి |
| 14-ఎ | 31-ఎ | 48-డి | 65-బి |
| 15-ఎ | 32-డి | 49-డి | 66-ఎ |
| 16-ఎ | 33-డి | 50-డి | 67-ఎ |
| 17-డి | 34-బి | 51-డి | |

**ఇస్రో మరో ఘనకీర్తి:**

భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), 'మంగళ్‌యాన్' విజయం తరువాత మనుషులను అంతరిక్షంలోకి పంపే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కక్ష్యలో రెండు అంతరిక్ష వాహనాలను అనుసంధానం చేసి, అంటే డాకింగ్ చేసి, ఒకదానిలోని సామాన్లను మరోదానిలోకి పంపే ఏర్పాట్లు చేస్తున్నది. దీని అంచనా వ్యయం రూ. 10 కోట్లు. చివరగా ఇదే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, మనుషులను కూడా అంతరిక్షంలోకి పంపవచ్చు. అయితే, మొదటి లక్ష్యం మాత్రం ఇంధన మార్పిడి. ఇలా అంతరిక్షం నుండి సామానును కిందకు తీసుకువచ్చే అవకాశం ఉంటే, అక్కడి చెత్తను తగ్గించవచ్చుకదా! అయితే దీనికి ముందుగా రెండు వాహనాలను ఒకే కక్ష్యలో ఎదురెదురుగా నిలపగలిగే సామర్థ్యాన్ని మనం పరీక్షించుకోవాలి.

**ఇకపై గృహహింస చట్టం పురుషులకు కూడా!:**





ఇకపై పురుషులు కూడా తమ జీవిత భాగస్వామి, సంబంధిత బంధువులపై గృహహింస చట్టాన్ని ప్రయోగించవచ్చు. ఒక కేసులో స్పందిస్తూ కర్ణాటక హైకోర్ట్ ఇకపై పురుషులు కూడా గృహహింస విషయంలో ఈ చట్టాన్ని ఆశ్రయించవచ్చని తెలిపింది. ఈ చట్టం కేవలం మహిళా రక్షణకు మాత్రమే కాదని, అవసరమైతే పురుషులు కూడా ఈ చట్టాన్ని ఆశ్రయించవచ్చని జస్టిస్ ఆనంద్ బైరరెడ్డి అన్నారు. ఈ చట్టంలో దీనిని కేవలం మహిళలు మాత్రమే ఉపయోగించాలన్న నిబంధన ఎక్కడా లేదనీ, ఒక కేసులో తీర్పునిస్తూ సుప్రీం కోర్ట్ సెక్షన్ 2(ఏ) ను సవరించిందనీ, దీని ప్రకారం స్త్రీ/పురుషులెవరైనా ఈ చట్టాన్ని ఆశ్రయించవచ్చని కోర్ట్ తీర్పు చెప్పింది.

**కార్మిక బీమా సౌకర్యం:**

కార్మిక బీమా సౌకర్యాన్ని (ESI) పొందుతున్న కార్మికులు ఇకపై రెండు వైద్యశాలల సేవలను పొందవచ్చు. వ్యక్తి తను పనిచేస్తున్న కర్మాగారం/కార్యాలయం పరిసరాలలోనున్న వైద్యశాల సౌకర్యాన్ని తనకు, తన ఇంటి దగ్గరున్న వైద్యశాల సౌకర్యాన్ని తన కుటుంబానికి వినియోగించు కోవచ్చు. "ఒక బీమా–రెండు వైద్యశాలలు'' పథకాన్ని ప్రారంభిస్తూ కేంద్ర కార్మిక మంత్రి బండారు దత్తాత్రేయ, కార్మికుడు ఒక చోట పనిచేస్తు, కుటుంబం వేరొక ఊరిలో ఉన్నపుడు ఈ సౌకర్యం ఉపయోగపడుతుందని అన్నారు. ప్రతి ఒక్క లబ్దిదారుడూ తన ఆధార్ కార్డును అనుసంధానం చేస్తే, క్లెయిమ్ ల పరిష్కారం సులభమవుతుందని అన్నారు. త్వరలోనే అసంఘటిత కార్మికులకు కూడా ఈ సౌకర్యాన్ని విస్తరింపచేసేందుకు కృషి జరుగుతోందని తెలియచేస్తూ మంత్రి ఇందుకోసం ESIC ఇటీవల "SPREE" అనే ఒక కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ఇందులో ఇప్పటికే 66 వేల సంస్థలు, 77 వేల వ్యక్తులు సభ్యులుగా చేరారని వెల్లడించారు.

**ఫిన్లాండ్ విద్యా విధానం:**




ఫిన్లెండ్‌లో అమలవుతున్న విద్యా విధానం మొత్తం ప్రపంచానికే ఆదర్శవంత మైనది. తమకు నాలుగు రెట్లు బరువున్న పుస్తకాల సంచీలతో, పాలుతాగే వయసు నుండి హోం వర్క్ ఒత్తిడితో కునారిల్లుతున్న మన పిల్లలకు ఫిన్లెండ్ తరహా విద్యా విధానం ఎంతో ఉపయోగకరమైనది. దీనిని గురించి ముఖ్యంగా తల్లితండ్రులు, విద్యా విభాగాల ప్రతినిధులు తెలుసు కోవాలి. అక్కడ ఫిన్లెండ్‌లో పిల్లలను కనీసం ఏడు సంవత్సరాలు నిండితేనే పాఠశాలకు పంపుతారు. మొదటి ఆరు సంవత్సరాలు పరీక్షలు, గ్రేడింగ్, హోంవర్క్ వంటి బాదరబందీలేమీ ఉండవు. వారు పాఠశాల చదువు పూర్తయిన తరువాతనే, అంటే 16 సంవత్సరాల తరువాతే మొదటి పరీక్ష ఉంటుంది. ఎలిమెంటరీ దశలో పిల్లలకు వారానికి కేవలం 20 గంటలు, అంటే రోజుకు నాలుగు గంటలు మాత్రమే స్కూల్ ఉంటుంది. హోం వర్క్ అసలు ఉండదు. ప్రతి క్లాస్ తరువాత, 15 నిముషాల బ్రేక్ ఉంటుంది. భోజన విరామం 75 నిముషాలు ఉంటుంది. స్కూల్ స్థాయి వరకు మొత్తం ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది.

■

భవిత కోసం యువత

# యువత సాధికారికత .....

– ఐ.హెచ్.జి.ఎన్. ప్రసాద్
– డా. కె. సరిత



**జనాభా సగటు వయస్సు చైనాలో 37 సం॥ గా వుంటే భారత్‌లో 29 సం॥లుగా ఉంది. దీనిని బట్టి గమనిస్తే దేశంలో అత్యధిక శాతం యువత జనాభాను కలిగియుంది. నాసా ఒక్క ఉపగ్రహం పంపడానికి 700 కోట్ల రూపాయల వ్యయం చేస్తుంది. అలాంటిది 104 ఉపగ్రహాలను కేవలం 100 కోట్ల ఖర్చుతో పంపటం భారతీయ శాస్త్రవేత్తల పరిశోధన నైపుణ్యానికి అతిపెద్ద సాక్ష్యం.**

ఏ దేశ పురోభివృద్ధి అయినా ఆ దేశ యువత శక్తి సామర్థ్యాలపై ఆధారపడి ఉంటుంది. కాని మన దేశ యువత సామర్థ్యం, తెలివితేటలు, సృజనాత్మకశక్తి అనేక దేశాల అభివృద్ధికి పునాదిగా ఉంది. మనవాడు సుందర్‌పిచై గూగుల్ సి.ఇ.ఓ.గా పదవీబాధ్యతలు నిర్వహిస్తూ సాఫ్ట్‌వేర్ రంగ శిఖరాగ్రస్థానంలో ఉండి తన అంచెంచెల సృజనాత్మకతలో అమెరికా దేశ అభివృద్ధికి ఒక పునాది రాయిగా నిలబడడం భారతదేశం గర్వించదగ్గ విషయం అలాగే ఎంతోమంది ప్రతిష్టాత్మక సాంకేతిక కళాశాలయిన ఐ.ఐ.టి.ల నుండి విడుదలవుతున్న అత్యంత మేధో సంపత్తి కలిగిన మన యువత విదేశీయుల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారు. అందులో సత్యనాదెండ్ల మైక్రోసాఫ్ట్ సి.ఇ.ఓ.గా 1992లో అత్యంత ప్రతిభావంతులలో 72వ స్థానాన్ని సాధించారు.

అలాగే సంజయ్ ఝా గ్లోబల్ ఫౌండర్స్ సి.ఇ.ఓ.గాను, శంతన్ నారాయణ్ అడోబ్ సి.ఇ.ఓ.గా 2007లో ప్రతిష్టాత్మక స్థానాలను ఆక్రమించారు. ఈ సందర్భములో మనం స్వామి వివేకనంద మాటలు గుర్తుకు తెచ్చుకోవాలి “భారతీయులే భారతదేశ చరిత్రని రచించాలి.” పై ఉదాహరణను పరిశీలిస్తే వివేకానందుని కల నిజమవుతున్నదని అనిపిస్తుంది.

ఈ రోజు ప్రపంచ దేశాలాన్నింటిలో కంటే కూడా యువత అధిక శాతం కలిగిన దేశం భారత దేశం, మొత్తం జనాభాలో యువత 1/5 వ వంతు స్థానాన్ని ఆక్రమించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 41శాతం 20 సం॥ లోపువారున్నారు. సగం ప్రజానీకం 20–59 సం॥ల మధ్య వయస్సు వారున్నారు. 60 సం॥ దాటిన ప్రజానీకం కేవలం 9 శాతం మాత్రమే మన దేశంలో ఉన్నారు.

2011 జనాభా లెక్కల ప్రకారం ఇండియా జనాభా 102 కోట్లు అందులో 121.73 మిలియన్ జనం 15–19 సం॥ మధ్య వయస్సు వారుంటే, 118.04 మిలియన్ 20–24 సం॥ మధ్య వయస్సు వారున్నారు. అత్యధిక జనాభాకల్గిన చైనా కంటే కూడా భారత దేశంలోనే యువత అధికంగా యున్నారు. జనాభా సగటు వయస్సు చైనాలో 37 సం॥లుగా వుంటే భారత్‌లో 29 సం॥లుగా ఉంది. దీనిని బట్టి గమనిస్తే దేశంలో అత్యధిక శాతం యువత

ప్రిన్సిపాల్, యస్.జి.యస్. గవర్నమెంటు, ఐ.ఎ.యస్.ఇ., రాజమహేంద్రవరం.
లెక్చరర్ ఇన్ ఎడ్యుకేషన్, యస్.జి.యస్. గవర్నమెంటు, ఐ.ఎ.యస్.ఇ., రాజమహేంద్రవరం.
E-mail: sarithakotipalli@gmail.com

జనాభాను కలిగియుంది. అలాగే ప్రతి సంవత్సరం అన్ని రకాల కళాశాలల నుండి డాక్టర్లు 52715 మంది, ఇంజనీర్లు 1.5 మిలియన్లు మంది, వ్యాపార శాస్త్ర గ్రాడ్యుయేట్లు 3,13,920 మంది భారత దేశం నుండి ఉత్పత్తి అవుతున్నారు. కాని అభివృద్ధిలో మాత్రము వెనుకంజగానే ఉన్నాము. యువతను వారి సామర్థ్యాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవడంలో విజయవంతం కాలేకపోయిందనే చెప్పాలి. ఎందుకంటే యువతను అన్ని రంగాలలో, అంటే శాస్త్ర, సాంకేతిక, వ్యవసాయ, పారిశ్రామిక, రక్షణ ఇలా అన్ని రంగాలలో భాగస్వామ్యం చేసినట్లయితే మనదేశం ఖచ్చితంగా అభివృద్ధి చెందిన దేశంగా పరిగణించబడేది.

యువతను అన్ని రంగాలలో ప్రవేశపెట్టడానికి, వారిని చైతన్య వంతులను చేయడానికి స్వామి వివేకనందుడు యువతను ఉద్దేశించి ఇలా ప్రసాంగించే వారు.

- మార్గం పదునైన కత్తి అంచులా నిశితమై
- ఎన్నో అవరోధలతో నిండివుంది
- అయిన నిష్పృహ చెందకండి
- లేవండి, మేల్కొండి
- గమ్యాన్ని చేరేవరకు విశ్రమించకండి
- బలవంతుడవై, ధైర్యశాలివై నిలబడు,
- భాధ్యతనంత నీమీదే పెట్టుకో
- నీ విధికి నీవే విధాతవని తెలుసుకో

అని ప్రేరణపూరితమైన ప్రసంగాలతో దేశయువతను మేలుకొల్పి దేశ పురోగతిలో భాగస్వామ్యులు కావడానికి తనవంతు కృషిచేసారు.

ప్రతిదేశ సాంఘిక, ఆర్థిక పురోభివృద్ధి, రాజకీయ సుస్థిరత ఇవన్నికూడా ఆ దేశ యువత శక్తి సామర్థ్యలపైనే ఆధారపడి వుంటాయి.

ఈ క్షణంలో ఒకసారి భారతీయ యువత సాంకేతిక మేధస్సును ఒక్కసారి గమనించినట్లయితే ఇస్రో ప్రపంచ సంచలనాన్నే సృష్టిస్తున్నది. 104 ఉపగ్రహాలను ఒకే ఒక్క మిషన్ ద్వారా ఆరు దేశాల కజకిస్తాన్, నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్, ఇజ్రాయిల్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మరియు ఇండియా కలయికతో అంతరిక్షం లోకి పంపడం జరిగింది. దీనికైన ఖర్చు కేవలం 100 కోట్ల రూపాయలు నాసాతో పోలిస్తే ఇది చాలా తక్కువ. నాసా ఒక్క ఉపగ్రహం పంపడానికి 700 కోట్ల రూపాయల వ్యయం చేస్తుంది. అలాంటిది 104 ఉపగ్రహాలను కేవలం 100 కోట్ల ఖర్చుతో పంపటం భారతీయ శాస్త్రవేత్తల పరిశోధన నైపుణ్యానికి అతిపెద్ద సాక్ష్యం. ఈ ప్రాజెక్టు ఖర్చులో సగం మిగిలిన దేశాలు పంచుకోగా, సగం అంటే 50 కోట్ల ఖర్చుతో విజయవంతంగా నిర్వహించడం హర్షదాయకం.

భారతీయ యువ శాస్త్రజ్ఞులు అత్యంత ప్రతిష్టాత్మకంగా అంతరిక్షంలోకి 114 ఉపగ్రహాలు ప్రయోగం చేయటం నిజంగా భారతీయ చరిత్రలో మరచిపోలేని అంశం. దీనిలో భారతీయ హోదా ప్రపంచదేశాల నడుమ, గర్వంగా నిర్వచించబడుతుంది. భారతీయ యువతలో ఉన్న తెగువ, తెలివితేటలు వారి ఉదారత సమయానుకూల ఆలోచన, సమన్వయం, సహకారం, మానవత్వం వంటివి ప్రపంచ దేశాలకి కనిపించేలా వినిపించేలా చేసిన అత్యంత సాహస కృత్యం. అంతరిక్షంలోకి. ఇన్ని ఉపగ్రహాల ప్రయోగం! ఆరోజు ప్రపంచం మొత్తం తన కళ్ళు విప్పార్చి భారతీయులపై దృష్టి కేంద్రీకరించింది. ఇంతటి సృజనాత్మక శక్తులు కలిగిన భారతీయ యువత మరింత శక్తి సామర్థ్యాలతో ముందుకు రావలసివుంది. మన ఆర్థిక సుస్థిర స్థానానికి మరింత పునాదులు వేయవలసివుంది.

దీనిని గమనించిన మన ప్రభుత్వం యువత కార్యదీక్షాసామర్థ్యాలను వెలికితీసి వారికి ఆర్థిక సుస్థిరతను కల్పించి తద్వారా దేశపురోభివృద్ధికి బాటలు వేయాలనే సుదీర్ఘ ఆలోచన వటిమతో అనేక ఆర్థిక స్వావలంబన పథకాలను ప్రవేశపెట్టడం జరిగింది. అందులో భాగంగా బ్యాంకు నుండి యువత పొందగలిగే అనేక రకాలయిన ఋణ సంబంధ సహాయ కార్యకలాపాలు ....

ఎ) Stand up India అనే పథకం ద్వారా 10 లక్షలు నుండి కోటిరూపాయల వరకు ఋణ సదరుపాయం యువతకు ఎలాంటి తనఖాలు లేకుండా పరిశ్రమలు పెట్టుకోవడానికి ప్రస్తుత ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ పరిశ్రమలు స్థాపన ద్వారా నిరుద్యోగులకు ఉపాది కలిగి యువతకు ఆర్థిక సాధికారత లభిస్తుంది. ఈ కార్యక్రమ నిర్వహణ కొరకు ప్రభుత్వం రూ. 10,000/- కోట్ల రూపాయలు మంజూరు చేసింది.

బి) ముద్ర ఋణాల ద్వారా రూ. 50,000/- నుండి రూ. 10,00,000/-లు వరకు యువతకు ఋణ సదరుపాయం కల్పించి వారి ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం తోడ్పడుతుంది. దీని కొరకు 2,000/- కోట్ల రూపాయలు మంజూరు చేయటం జరిగింది.

సి) Small Scale Industries పెట్టుకోవడానికి 10 లక్షల నుండి కోటి ఆపైన కూడా ఆ పరిశ్రమ స్థాపన అనుగుణంగా సామాజిక వర్గాల వారికి వారి వారి కుల ప్రాతిపదికన 25% నుండి 30% సబ్సిడి (రాయితి) ఋణాలు ఇవ్వడం జరిగింది. 30% నుండి 35% వరకు స్త్రీలకు కూడా రాయితీ ఇవ్వడం జరిగింది. దీనివల్ల వ్యక్తిగత

అభివృద్ధితో పాటు నిరుద్యోగులకు ఎక్కువ సంఖ్యలో ఉపాధి కల్పించటం జరిగింది. వాటిని గ్రామ ప్రాంతాల్లో కూడా స్థాపించడానికి ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ పేరుతో ఋణాలు మంజూరు చేయటం జరుగుతుంది.

డి) గ్రామీణ జీవనోపాధి పథకాల రూపంలో నాబార్డ్ ద్వారా పాల ఉత్పత్తి, చేపల పెంపకం హార్టికల్చర్, కోళ్ళ పెంపకం, పశువుల పెంపకం, తేనెటీగల పెంపకం వంటి వాటి కొరకు గవర్నమెంట్ బ్యాంకుల ద్వారా ఋణం ఇవ్వటం వల్ల బయట అధిక వడ్డీకి వెళ్ళకుండా తక్కువ వడ్డీతో సామాన్య యువత కూడా ఉన్నతి సాధించగలడు.

గ్రామ ప్రాంతాలలో వున్న యువతకు ఆర్థిక స్వావలంబన అందించాలని గ్రామ ప్రాంతాలలో బీదరికాన్ని నిర్మూలించాలని భావించి సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టి అనే విభాగం ద్వారా వెలుగు అనే కార్యక్రమాన్ని పరిచయం చేయడం జరిగింది. దీని ద్వారా వారి జీవితాలలో వెలుగు తీసుకురావాలన్నదే దీని ప్రధాన ధ్యేయం. దీంట్లో బాగంగా సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ అనే కార్యక్రమం వెలుగులోనికి వచ్చింది. దీని కొరకు 1999 నుండి ఈరోజు వరకు రూ. 65,274 కోట్లు కేటాయించడం జరిగింది.

మహాత్మాగాంధి జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నిర్వహించ బడుతున్న కార్యక్రమం ఇది. దీని ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికి సంవత్సరా నికి కనీసం 100 రోజుల పని దినాలు ఉండాలనే ఆశయంతో నిర్వహిం చబడిన కార్యక్రమం ఇది. దీని ద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. దీనికి కేంద్ర నిధులు 90 శాతం రాష్ట్ర నిధులు 10 శాతంగా నిర్ణయించడం జరిగింది. మొత్తం ఖర్చు రూ. 2,425 కోట్లు.

అదే విధంగా పట్టణ ప్రాంతంలో ఉన్న నిరుద్యోగాన్ని నిర్మూలించడానికి మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మున్సిపల్ ఏరియాస్ అనే పథకం కింద స్వయం ఉపాధి నైపుణ్యాల అభివృద్ధి నిమిత్తం 70.96 లక్షల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసింది. వడ్డీలేని ఋణాలను కూడా వారి వారి అవసరాలను బట్టి ఋణ సదుపాయం కల్పించడం కోసం 234 లక్షల రూపాయలను మంజూరు చేసింది.

యువత సాధికారతను సుసాధ్యం చేయడంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు దేశ పురోభివృద్ధి బాటకు పునాదులుగా ఉన్నాయి. దేశ పురోభివృద్ధికి దిశ, దశ నివ్వడంలో యువత ప్రాధాన్యతను గుర్తించి పథకాల రూపంలో ఆర్థిక స్వావలంబన కల్పించి దేశ పురోభివృద్ధిలో వారి బాధ్యతని తెలియజేసి వారి భాగస్వామ్యానికి ప్రోత్సాహన్ని అందిస్తోంది ప్రభుత్వం. ■


## యోజన చందా ఆన్‌లైన్‌లో

భారత ప్రభుత్వ ప్రచురణల విభాగం వారి యోజన, ఇతర పత్రికలకు చందాను ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు. www.Bharatkosh.gov.in వెబ్ సైట్‌లో Publications' Divistion వారి linkను క్లిక్ చేసి సూచనలను అనుసరించండి. చెల్లింపులు నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్ ద్వారా చెయవచ్చు. చందా వివరాలు సంవత్సరానికి రూ. 230/-, రెండు సంవత్సరాలకు రూ. 430/-, మూడు సంవత్సరాలకు రూ. 610/-లు.

**సీనియర్ ఎడిటర్**



యోజన

సామాజిక భద్రత

జూలై, 2017 సంచిక

# భారత యువత - ఉద్భవిస్తున్న అద్భుత శక్తి

- డా॥ యస్. విజయ్‌కుమార్

**యువత భవిత**



**ఐక్యరాజ్య సమితి నిర్వచనం ప్రకారం "యువత" (Youth) అంటే 15సం॥లు- 24సం॥ల వరకు ఉండే వ్యక్తులు, కాని మన దేశంలో "2003 జాతీయ యువత విధానం" ను అనుసరించి "యువత" అంటే 15 సం॥లు - 35 సం॥ల వరకు నిర్ణయించగా, "జాతీయ యువత విధానం - 2014" ననుసరించి "యువత" అనగా 15 సం॥లు- 29 సం॥లుగా నిర్వచించడం జరిగింది.**

ప్రధాని నరేంద్రమోదీ ఇటీవల పలు సభలలో రేడియో, టివిలో ప్రసంగిస్తూ "ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలోనే యువశక్తి అధికంగా వుందని, దీనిని మనం సద్వినియోగం చేసుకుంటే అద్భుతమైన ఫలితాలను సాధించవచ్చుని'' పేర్కొన్నారు. నేటి యువశక్తే రేపటి మన చోదక శక్తి (Our driving force). ఏ దేశానికైనా యువ శక్తి బంగారు భవిష్యత్తుకు పునాది మరియు కొండంత అండ, కనుకనే ''యువత దృఢమైన ఉక్కు కండరాలతో దేహదారుఢ్యం కలిగి ధైర్యంతో తెలివితో మెసలాలని" స్వామి వివేకానందుడు పేర్కొనడం గమనార్హం. ఐక్యరాజ్య సమితి నిర్వచనం ప్రకారం "యువత" (Youth) అంటే 15సం॥లు- 24సం॥ల వరకు ఉండే వ్యక్తులు, కాని మన దేశంలో "2003 జాతీయ యువత విధానం" ను అనుసరించి ''యువత'' అంటే 15 సం॥లు - 35 సం॥ల వరకు నిర్ణయించగా, "జాతీయ యువత విధానం - 2014" ననుసరించి ''యువత'' అనగా 15 సం॥లు- 29 సం॥లుగా నిర్వచించడం జరిగింది.

మన దేశంలో 2001లో యువత నగటు వయస్సు (Median Age) 22 సం॥లు ఉండగా, అది 2011లో 24 సం॥లకు పెరిగింది. ప్రస్తుత తాజా లెక్కలననుసరించి మన దేశంలో 50 శాతం పైగా జనాభా 25 సం॥ల లోపువారే, ఇంకా దీనికి 35 సం॥ల వారిని కూడా కలుపుకుంటే, అది 65 శాతంగా మరియు 40 సం॥ల వారిని కూడా జతచేస్తే అది 70 శాతంగా వుంటుందని అంచనా. మన స్థూల జాతీయోత్పత్తికి (Gross National Product - GNP) కి 34 శాతం వాటా యువత ద్వారానే లభిస్తున్నదని తెలుస్తున్నది. 2020 సంవత్సరం నాటికి భారత యువత (Indian Youth) సగటు వయస్సు 29 సం॥లు వుండగలదని, చైనాలో 37 సం॥లుగా, జపాన్‌లో 48 సం॥లుగా, అమెరికా మరియు పశ్చిమ యూరప్‌లో 45 సం॥లుగా వుంటుందని ఆశిస్తున్నారు. దీనిని బట్టి పైన పేర్కొన్న వివిధ దేశాలతో పోలిస్తే మన దేశంలోనే యువత 29 సం॥ల సగటు పిన్న వయస్సులో ముందంజలో వుంటుందని తెలుస్తున్నది.

**కొన్ని ముఖ్యాంశాలు:**

2011, "IMF working Paper on Demographic Dividend: Evidence from Indian States" ననుసరించి మన

అసోసియేట్ ప్రొఫెసర్, (రిటైర్డ్) కాకతీయ పి.జి. కళాశాల, వరంగల్.
E-mail: vijaysarabu@gmail.com

దేశంలో డెమోగ్రాఫిక్ డివిడెండ్ అంటే "జనాభా ప్రతిఫలాల దశ" అనగా "ఒక దేశంలో ఉత్పాదక వర్గం లో (15 సం॥లు - 64 సం॥లు) ఎక్కువగా యువ జనాభా పెరుగుతూ, అనుత్పాదక వర్గంలో (0-14 సం॥లు మరియు 65 సం॥లు - 100 సం॥లు) తగ్గడం" అని అంటారు. ఇది మన దేశంలో 1980లో మొదలైంది. ఇది 2040 వరకూ కొనసాగే వీలుంటుంది. 'డెమోగ్రాఫిక్ డివిడెండ్' అనే మాటను మొదట డేవిడ్ బ్లూమ్ అనే ప్రఖ్యాత అమెరికా జనాభా శాస్త్రవేత్త (Demographer) పేర్కొన్నాడు. 1965-1990 మధ్యకాలంలో తూర్పు ఆసియా ప్రాంతంలో ఆయన చేపట్టిన పరిశోధనల ననుసరించి పనిచేసే వర్గం' (15 సం॥ - 64 సం॥లు) లో యువ జనాభా పెరగడం ఆ ప్రాంతంలో ఎక్కువగా ఆర్థిక వృద్ధి రేటుకు దోహద పడిందని పేర్కొన్నాడు.

2001 జనాభా లెక్కలననుసరించి మన దేశంలో దాదాపు 60 శాతం వరకు జనాభా పనిచేసే వర్గం (15-64)లో వుండగా, అది 2011 జనాభా లెక్కలతో 63.4 శాతానికి పెరిగింది. అంటే పనిచేసే వర్గంలో 3.4 శాతం జనాభా పెరిగింది. ఇది ఒక శుభ పరిమాణం.

అంతర్జాతీయ శ్రామిక సంస్థ (International Labour Organization - ILO) ననుసరించి 2020 సం॥ వరకు మన దేశంలో 116 మిలియన్ల యువ శ్రామికులు (20 సం॥లు - 24 సం॥లు) వుంటారని, ఇదే 2020 సంవత్సరం వరకు చైనా 94 మిలియన్ల శ్రామికులతో మన కన్నా వెనుకంజలో వుంటుందని అంచనా. ఇంకా, 20 సంవత్సరాలలో మన దేశంలో శ్రామిక జనాభా 32 శాతం పెరుగగా, అదే పారిశ్రామిక దేశాలలో 4 శాతం, చైనాలో 5 శాతం తగ్గగలదని పేర్కొనడం జరిగింది. అంతర్జాతీయ ద్రవ్యనిధి (IMF) 2011లో "Indian Demographic Dividend working paper" లో పేర్కొన్న దానిని ననుసరించి మన దేశంలో జనాభా ప్రతిఫలాల (Demographic Divident) వల్ల రాబోవు 2 దశాబ్దాలలో ఏటా 2 శాతం చొ॥న స్థూల దేశీయోత్పత్తి (GDP) పెరుగగలదని తెలుస్తున్నది.

మన దేశంలో జనాభా ప్రతిఫలాల దశ (Demographic Dividend Stage) 2040 సంవత్సరం వరకే వుండగలదని అంచనా వేయడం జరిగింది. కాబట్టి ఈ కాలంలో పెరిగే యువశక్తిని మనం సద్వినియోగం చేసుకుంటేనే అద్భుత ప్రగతిని సాధించగలం. ఆగష్టు 12ను ఐక్యరాజ్య సమితి (UNO) "అంతర్జాతీయ యువజన దినం" (International Youth Day) గా పేర్కొన్నది. మన దేశంలో ప్రభుత్వం 2014లో "జాతీయ యువత విధానం (National Youth Policy)" ప్రవేశ పెట్టడం జరిగింది.

**యువత సాధికారిత (Youth Empowerment) :**

''యువత మంచి నిర్ణయాలను తీసుకునే సామర్థ్యం కలిగివుండి, వాటిని అమలు చేయడం ద్వారా వారి స్వంత జీవితాలలోనే కాక ఇతరులకు కూడా మార్గదర్శకాలుగా నిలిచి వారిని కూడా గొప్ప పనులను చేయమని ప్రోత్సహించడం ద్వారా సమాజంలో మంచి మార్పును తీసుకువచ్చే ప్రక్రియను" యువత సాధికారత అనవచ్చు.

**యువత సాధికారత ఆవశ్యకత (Need for Youth Empowerment) :**

1) సామాజిక బాధ్యతను యువతలో పెంపొందించడం కోసం.
2) జాతీయ సమైక్యత యువతలో సమైక్యతా భావాన్ని పెంపొందించడం.
3) జాతీయ, అంతర్జాతీయ సమకాలీన పరిస్థితుల గూర్చి అవగాహన కల్పించడం.
4) యువతలో నాయకత్వలక్షణాలను పెంపొందించడం.
5) యువతలో సృజనాత్మకతను మరియు పరిశోధన జిజ్ఞాసను పెంపొందించడం.
6) యువత సాధికారిత ప్రయోజనాలు నైపుణ్యాల పెంపు.

1) ఆత్మవిశ్వాసాన్ని (Self Confidence) మరియు స్వంత గుర్తింపుకు (Self Identity) దోహదపడుతుంది.
2) తమ స్వంత నైపుణ్యాలను, తెలివితేటలను గరిష్ట స్థాయిలో వినియోగించుకోవడానికి ధైర్యం అలవడుతుంది.
3) యువతలో బాధ్యతను (Accountability) పెంచుతుంది.
4) భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్ళను ధైర్యంగా ఎదుర్కొనే శక్తి అబ్బుతుంది.
5) యువతలో అజ్ఞానం (Ignorance) తగ్గుతుది.
6) యువతలో ఉద్యమిత్వ లక్షణాలు (Entrepreneur Skills) పెరిగి వాళ్ళు తమ స్వంత కాళ్ళపై నిలబడి ఇంకా కొంత మందికి ఉపాధి కల్పించడానికి గాను ప్రభుత్వ సహాయంతో చిన్న చిన్న పరిశ్రమలను (Start up) స్థాపించ గలుగుతారు.
7) పేదరిక నిర్మూలన నేడు చాలా మంది యువతలో తమ తమ వృత్తులకు సంబంధించిన నైపుణ్యాలు లేకపోవడం వలన వారు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. కాని యువత సాధికారిత వలన వారి వారి వృత్తులకు సంబంధించిన వృత్తి నైపుణ్యాలు పెంపొందించు కోవడం వలన వారికి ఉపాధి అవకాశాలు మెరుగై, ఆదాయాలు పెరుగుతాయి. తద్వారా దేశీయోత్పత్తి పెరుగుతుంది.

8) యువత సాధికరిత ద్వారా విద్య యొక్క ప్రాముఖ్యం తెలుస్తుంది. దీని వలన సామాజికాభివృద్ధి జరుగుతుంది.

9) సుపరిపాలన నేటి యువతే రేపటి దేశ నాయకులు, కాబట్టి యువ సాధికరిత వలన వారిలో నైతిక విలువలు, సామాజిక బాధ్యత, విలువలతో కూడిన విద్య, మంచి నాయకత్వ లక్షణాలు పెంపొంది వారు భవిష్యత్తులో సుపరిపాలనను అందించ గలుగుతారు.

10) నేరాలు తగ్గుతాయి (Crime Reduction):-నిరుద్యోగం యువతను పెడద్రోవ పట్టిస్తుంది. కాని, యువ సాధికరిత వలన వారికి ఉపాధి అవకాశాలు పెరిగి, వారిలో నేర ప్రవృత్తి తగ్గుతుంది.

## దేశ నిర్మాణంలో యువత పాత్ర

సుడిగాలి దిశనైన మరల్చగల శక్తి ఒక యువతకే వుంది. నేటి సమాజంలో ఉన్న అవినీతి, లంచగొండితనం, అవిద్య, పేదరికం, తీవ్రవాదాన్ని తరిమి కొట్టగల శక్తి ఒక్క యువతకే వుందనడంలో ఏమాత్రం సందేహంలేదు. వారు ధైర్యంతో జీవితంలో ఎదురైయ్యే సవాళ్ళను ఎదుర్కోవాలి. "బలమే జీవనం, బలహీనతే మరణం'' అనే వివేకనందుని సూక్తిని మరచిపోకుండా వారు పలువురికి స్ఫూర్తిదాతలు కావాలి. ఒకవేళ జీవితంలో ఓటమి సంభవిస్తే, కృంగిపోకుండా పడిలేచే కెరటం లాగా మరల ధైర్యాన్ని కూడతీసుకొని ముందుకు సాగాలి. జాతీయంగా, అంతర్జాతీయంగా వున్న సమకాలీన పరిస్థితులను సరిగా అర్థం చేసుకొని దానికి తగ్గట్టుగా వారు తమను తాము తీర్చిదిద్దుకోవాలి. అనాలోచితంగా ఏపనీ చేయవద్దు. ''చిత్తశుద్ధి, ఓర్పు, వట్టుదల'' ఈ మూడు కార్యసిద్ధికై అవశ్యకాలు కాబట్టి వీటిని యువత అలవర్చుకోవాలి. యువత వారి భవిష్యత్తుకు వారే విధాత అని గ్రహించాలి. వారి జీవితాలను వారే చక్కతీర్చిదిద్దు కోవడం ద్వారా సమాజాభివృద్ధికి, దేశాభివృద్ధికి సహాయపడాలి. ''ధీరుడు ఒకేసారి మరణిస్తాడు - పిరికివాడు క్షణం క్షణం మరణిస్తాడు'' అనే సూక్తిని స్ఫురణకు తెచ్చుకొని ఒక సారి ఆలోచించి సరైన నిర్ణయం తీసుకున్న తరువాత వెనుకడుగు వేయరాదు. నేడు యువతలో సృజనాత్మకత కొరవడు తున్నది. వారు ప్రతి పనిని యాంత్రికంగా చేసుకొని పోతున్నారు. కావున వారు ఆ విధంగా కాకుండా, క్రొత్త పంథాలో ఆలోచించి కొత్త, కొత్త విషయాలను కనుగొనాలి, "జీవితంలో ధనం కోల్పోతే కొంత కోల్పోయినట్టు, కానీ వ్యక్తిత్వం కోల్పోతే సర్వస్వం కోల్పోయినట్లే" కావున యువత దీనిని గుర్తెరిగి మసలుకోవాలి. యువత కలలను కనడంలో తప్పులేదు, కాని వాటిని సాకారం చేసుకోవడానికి నిరంతరం కృషి చేయాలి. ఈ లక్షణాలన్నీ యువత పుణికి పుచ్చుకుంటే తప్పకుండా యువత దేశాభివృద్ధిలో కీలకం అవుతుంది.

## 2014 -జాతీయ యువ విధానం ఉద్దేశ్యాలు

1. సుస్థిర ఆర్థికాభివృద్ధికి దోహదపడే "ఉత్పాదక శ్రామిక జనాభా శక్తి"ని పెంచడం.
2. భవిష్యత్తు సవాళ్ళను ఎదుర్కొనగల దృఢమైన, ఆరోగ్యకరమైన యువతను తయారు చేయడం.
3. సామాజిక విలువలు కలిగిన సమాజాన్ని నిర్మించడం.
4. సామాజిక పునర్‌నిర్మాణంలో ప్రజల బాధ్యతను పెంచడంతో పాటు, ముఖ్యంగా యువతను విరివిగా సామాజికాభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేటట్లు చేయడం.
5. పెద్ద ఎత్తున యువశక్తికి ప్రాధాన్యత నిస్తూ వీరందరికి సమానావకాశాలను కల్పించడం.

**పై ఆశయాలు నెరవేరాలంటే ఈ క్రింది చర్యలు అవసరమౌతాయి.**

* నాణ్యమైన విద్యనందించడం.
* ఉపాధి మరియు వృత్తి నైపుణ్యాలను పెంపొందించడం.
* ముఖ్యంగా యువతలో ఉద్యమిత్వాన్ని పెంచడం. అంటే యువత ఎక్కువ పరిశ్రమలను నెలకొల్పడానికి అవకాశాలను కల్పించడం.
* ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పెంపొందిం చడం.
* క్రీడలను ప్రోత్సహించడం.
* సామాజిక విలువలను పెంపొందించడంతో పాటు ప్రజలందరిని ముఖ్యంగా "యువతను" సామాజిక సేవలలో పాల్గొనేటట్టు చేయడం.
* ప్రజలను ముఖ్యంగా యువతను రాజకీయాలలో చురుకుగా పాల్గొనేలా చూడాలి; వారు క్రియాశీలక పాత్రను నిర్వహించేలా ప్రోత్సహించాలి.
* ప్రభుత్వంలో ఎక్కువ మంది యువతకు అవకాశం కల్పించాలి.
* అందరికి సామాజిక న్యాయం కల్పించడంతో పాటు అందరిని అభివృద్ధిలో భాగస్వాములను చేయడం.

చివరగా, మన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం పేర్కొన్నట్లు మన దేశంలో యువత నందరిని చైతన్యపరచి అభివృద్ధిలో భాగస్వాములుగా చేసినపుడు మాత్రమే మన దేశం త్వరలో అభివృద్ధి చెందిన దేశంగా రూపొందగలదు. ■

**మార్పుకు మూలం యువత**

# విశ్వ యవనికపై భారతీయ యువత

- డా॥ శీతల్ శర్మ
- భాస్కర్ జ్యోతి




**తొలి దశలో వలస కూలీలుగా ప్రారంభమైన ప్రవాస భారతీయ ప్రస్థానం రెండో దశలో మేధో వలసల స్థాయికి ఎదిగింది. విద్యా, వాణిజ్య, ఉపాధి కోసం లండన్ పయనమైన యువత ప్రధానంగా ఉన్నత విద్యావేత్తలుగా, వాణిజ్య వేత్తలుగా ఎదిగారు. ఇంగ్లాండ్ కేంద్రంగా ఏకంగా భారతీయ స్వాతంత్ర్య పోరాట వేదికను స్థాపించారు. స్వాతంత్ర్యానంతరం భారతీయ యువత వలసలు కొత్త పంథాకు దారి తీశాయి. ముఖ్యంగా పశ్చిమ దేశాల్లో వృద్ధి చెందిన సాంకేతిక పరిజ్ఞానం భారతీయ యువతను ఆకర్షించింది.**

భారతీయ విలువలకు సంస్కృతికి అసలైన వారధి యువత. ఖండాంతరాలకు వ్యాపించిన మన దేశ ఖ్యాతిని పరివ్యాప్తం చేసింది మాత్రం యువశక్తే కావడం గమనార్హం. ఒక వైపు ప్రపంచమంతా మతాల, జాతుల వైషమ్యాలతో కొట్టుమిట్టాడు తున్న సమయంలో ఒక యువ భారతీయ యోగి అయిన స్వామి వివేకానంద పరమత సహనం, భారతీయ ప్రశస్తిని షికాగో వేదికగా ప్రపంచ సర్వ మత మహాసభల్లో 1893లోనే ఎలుగెత్తి చాటాడు. మరో యువ భారతీయుడైన మహాత్మా గాంధీ బారిస్టర్ పట్టభద్రుడిగా దక్షిణాఫ్రికాలో అడుగు పెట్టి అహింసా సిద్ధాంతాన్ని, శాంతి, సహనాన్ని ప్రబోధించాడు. ప్రపంచ మానవాళికి మహాత్ముడు అందించిన వరం అహింసా మార్గం, మొట్ట మొదటి ప్రవాస భారతీయుడిగా మహాత్ముడు సాధించిన ఘనత అనితర సాధ్యం, అంతేకాదు మన దేశ ఖ్యాతిని సైతం ఖండాంతరాలకు విస్తరించేందుకు దోహదపడింది. దేశ ఖ్యాతిని చాటిన తొలి ప్రవాసీయుడిగా సైతం మహాత్మ గాంధీ చరిత్రకెక్కారు. ప్రపంచ శాంతి కోసం భారతీయ విలువలను ప్రపంచానికి చాటేందుకు యువత నడుం కట్టి ముందుకు సాగడం ఆధునిక యుగంలోనే కాదు. నాగరికత తొలినాళ్లలో కూడా కొనసాగింది. క్రీ.శ 2వ శతాబ్దంలోనే మౌర్య చక్రవర్తి అశోకుడి పుత్రిక శ్రీలంక (సిలోన్)కు ప్రయాణించి బౌద్ధ ధర్మాన్ని ప్రచారం చేసింది. ఈ పరంపర నేటి వరకూ కొనసాగుతూనే ఉన్నది. ఈ కాలంలో కూడా యువత భారతీయ పతాకాన్ని ఖండాంతరాల్లో చాటి చెప్పే పతాకధారులుగా వెలుగొందుతున్నారు.

**ప్రపంచ దేశాల - వారధిగా భారతీయ యువత**

ఐక్యరాజ్య సమితి 2015లో తేల్చిన లెక్కల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా వలస వెళ్తున్న వారి వయస్సు సగటు చూస్తే కేవలం 39 సంవత్సరాలుగా ఉంది. ఇందులో గమనించాల్సిన అంశం ఎక్కువగా వలస వెళ్తున్న వారంతా యువతే అని! భారత్ తరపున రెండున్నర కోట్ల మంది యువత ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి ఉన్నారు. ఐక్య రాజ్యసమితికి చెందిన డిపార్ట్ మెంట్ ఆఫ్ ఎకానమిక్, అండ్ సోషల్ ఎఫైర్స్ వారి సర్వే భారతీయ సంతతి ప్రపంచ వ్యాప్తంగా పెద్ద ఎత్తున వ్యాపించినట్లు తేల్చింది. కొత్తగా ఏర్పడిన దక్షిణ సూడాన్ సహా, అతి చిన్న

అసిస్టెంట్ ప్రొఫెసర్, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీ. E-mail: sheetal88@gmail.com
పరిశోధక విద్యార్థి, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీ. E-mail: bhaskar_jyoti@yahoo.com

దేశాల్లోనూ భారతీయ సంతతి జాడలు కనిపిస్తున్నట్లు తెలిపింది. కేవలం అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోనే భారతీయులు 32 లక్షల మంది ఉన్నట్లు తెలిపింది. అమెరికా తరువాత భారతీయులు ఎక్కువగా వలస వెళ్లినది గల్ఫ్ దేశాలకు కావడం విశేషం. ఇక్కడకి సైతం భారతీయులు పెద్ద సంఖ్యలో ఉపాధి కోసం వలసవెళ్లారు. ఆయా అనుబంధ దేశాల్లో సుమారు 70 లక్షల మంది వరకూ భారతీయులు ప్రవాసులుగా జీవితం వెళ్లదీస్తున్నారు.

ప్రస్తుతం అన్ని దేశాలూ వలసలను ఆహ్వానిస్తున్నాయి. ఉపాధి కోసం, విద్య కోసం, స్వేచ్ఛా వాణిజ్యం కోసం తలుపులు తెరిచిపెడుతున్నాయి. భారత దేశం బ్రిటిష్ వలస దేశంగా ఉన్నప్పటి నుంచి కూడా పెద్ద ఎత్తున ఇతర దేశాలకు మానవ వనరులుగా ఉపయోగించుకోబడ్డారు. ముఖ్యంగా భారతీయ రైతులను, కార్మికులను, సైనికులను బ్రిటిష్ వారు ఇతర దేశాలకు తీసుకెళ్లి వాడుకున్నారు. తద్వారా చాలా భారతీయ కుటుంబాలు ఆయా దేశాల్లో స్థిర పడాల్సి వచ్చింది. ప్రధానంగా ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఫిజి, వెస్టిండీస్, తూర్పు ఆఫ్రికా దేశాలకు భారతీయులను కూలీలుగా బ్రిటిష్ వారు తీసుకెళ్లారు. అక్కడ భారతీయులు వివిధ రంగాల్లో అభివృద్ధి చెందారు. ఆయా దేశాలను తమ స్వంత నివాసాలుగా మార్చుకొని భారతీయులు స్థిరపడ్డారు. వీరంతా భారతీయులుగా తమ అస్తిత్వాన్ని చాటుకుంటూనే ఆయా దేశాల ప్రధాన స్రవంతిలో కలిసిపోయి జీవిస్తున్నారు. తొలి దశలో వలస కూలీలుగా ప్రారంభమైన ప్రవాస భారతీయ ప్రస్థానం రెండో దశలో మేధో వలసల స్థాయికి ఎదిగింది. విద్యా, వాణిజ్య, ఉపాధి కోసం లండన్ పయనమైన యువత ప్రధానంగా ఉన్నత విద్యావేత్తలుగా, వాణిజ్య వేత్తలుగా ఎదిగారు. ఇంగ్లాండ్ కేంద్రంగా ఏకంగా భారతీయ స్వాతంత్ర్య పోరాట వేదికను స్థాపించారు. ముఖ్యంగా ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ పట్టభద్రులు అటు సాంకేతిక యుగంలో తమ ప్రభావాన్ని చాటారు. సావర్కర్, మేడం భికైజీ కామా, మదన్‌లాల్ ధింగ్రా వంటి ప్రముఖులు లండన్‌లో ఇండియా హౌస్ ఏర్పాటు చేసి కార్యకలాపాలు ప్రారంభించారు. వీరంతా భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. బ్రిటిష్ దుర్మార్గాలను అంతర్జాతీయ వేదికలపై ఎత్తిచూపడంలో వీరంతా సఫలీకృత మయ్యారు. వీరందిరికీ లండన్ నగరం ప్రధాన కేంద్రంగా మారగా, ఇక్కడి నుంచి ఇతర దేశాల్లో సైతం భారతీయ యువత స్వాతంత్ర్య పోరాటాన్ని వ్యాపింపచేశారు. మేడం కామా ప్యారిస్ కేంద్రంగా రహస్య విప్లవ కార్యకలాపాలు ప్రారంభించగా, మరి కొందరు భారతీయ యువత గదర్ పార్టీ ఏర్పాటు చేసి అమెరికా, కెనడా దేశాల్లో తమ ప్రాభవాన్ని చాటారు.

స్వాతంత్ర్యానంతరం భారతీయ యువత వలసలు కొత్త పంథాకు దారి తీశాయి. ముఖ్యంగా పశ్చిమ దేశాల్లో వృద్ధి చెందిన సాంకేతిక పరిజ్ఞానం భారతీయ యువతను ఆకర్షించింది. దీంతో ఎక్కువగా అమెరికా, పశ్చిమ యూరప్ దేశాలకు భారతీయ యువత వివిధ రంగాల్లో సాంకేతిక నిపుణులుగా వలస వెళ్లారు. అంతేకాదు దేశంలో విరివిగా స్థాపించిన ఐఐటీల నుంచి వచ్చిన పట్టభద్రులు ఎక్కువగా అమెరికా వలస వెళ్లేందుకు ఆసక్తి చూపించారు. ప్రధానం విదేశీ మారక ద్రవ్యం భారత మారక రేటు కన్నా ఎక్కువగా ఉండటం, ఉన్నత జీవన ప్రమాణాలు, ఆర్థికంగా బలమైన దేశాలు, ఆకర్షణీయమైన వేతనాలు భారతీయ యువతను ఆకర్షించడంతో ఎక్కువగా అమెరికా, యూకే, కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాలకు వలస వెళ్లారు.

## గ్లోబలైజేషన్ – వలసలకు ఆహ్వానం పలికిన వైనం

సరళీకృత ఆర్థిక విధానాలు, భారతీయ యువతకు విస్తృతమైన అవకాశాలను తెచ్చిపెట్టింది. ముఖ్యంగా ప్రపంచీకరణ విధానాలు దేశాల మధ్య సరిహద్దులను చెరిపివేసే స్థాయికి చేరాయి. ముఖ్యంగా సమాచార విప్లవం ప్రపంచ గతిని మార్చివేసింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో అంది వచ్చిన అవకాశాలను భారతీయ యువత అందిపుచ్చుకుంది. ప్రధానంగా అభివృద్ధి చెందిన దేశాల్లో సమాచార సాంకేతిక విప్లవం సృష్టించిన అవకాశాలు భారతీయ యువతను ఆకర్షించాయి. పశ్చిమదేశాల్లో మానవ వనరుల కొరత ఉండటం, అలాగే తక్కువ వేతనాల కోసం భారతీయులు, అలాగే ఇతర ఆసియా దేశాల ప్రజలను పెద్ద ఎత్తున ఆహ్వానించారు. విరివిగా ఉపాధి అవకాశాలు కల్పించారు. పెద్ద పెద్ద అమెరికన్ కార్పోరేషన్ కంపెనీల్లో భారతీయ యువతకు ఉపాధినివ్వడం వల్ల, సదరు కంపెనీలకు అటు తక్కువ వేతనాలతో పాటు నైపుణ్యం కలిగిన యువత లభించారు. ఉభయ తారకంగా ఉన్న ఈ విధానంతో పెద్ద ఎత్తున యువత అమెరికా, యూకేలకు వలస వెళ్లారు.

## సిలికాన్ వ్యాలీ – విజయ యాత్ర

1960 సంవత్సరం నుంచి సుమారు 12000 మంది భారతీయులు అమెరికా వలస వెళ్లారు. వీరిలో నైపుణ్యం లేని వారు ఉన్నారు. వీరంతా కూలీలుగానూ, అసంఘటిత రంగ కార్మికులుగా వలస వెళ్లారు. అనంతరం 1990 నాటికి అమెరికా వలస విధానం పూర్తిగా మారిపోయింది. నైపుణ్యం కలిగిన యువతను ఆహ్వానించడం మొదలయ్యింది. ప్రధానంగా వీసా విధానాల్లో మార్పులు చేసారు. ఫలితంగా 1980–2013 మధ్య కాలంలో సుమారు 2,60,000 మంది భారతీయ విద్యార్థులు

అమెరికాలో అడుగుపెట్టారు. అంతేకాదు ప్రతీ ఏడాది అమెరికా వలస వెళ్లేవారి సంఖ్య పెరుగుతూనే ఉంది. అమెరికాలో వృత్తి రీత్యా విదేశీ నిపుణులను ఆకర్షించేందుకు హెచ్ వన్ బీ వీసాలను జారీ చేస్తున్నారు. 2014 నాటికి సుమారు 3,16,000 హెచ్ వన్ బీ వీసాలు జారీ చేయగా అందులో 70 శాతం భారతీయులేనని గుర్తించారు. అలాగే 2013-14 గణాంకాల ప్రకారం అమెరికాలోని ప్రధాన యూనివర్సిటీలు, విద్యాసంస్థల్లో సుమారు 1,03,000 భారతీయ విద్యార్థులు విద్యనభ్యసించారు.

అమెరికా జనాభా గణన విభాగం అధ్యయనం ప్రకారం ఆ దేశంలో పనిచేస్తున్న భారతీయుల సగటు వయస్సు 39 సంవత్సరాలుగా ఉంది. అంటే వివిధ రంగాల్లో పనిచేస్తున్న వారిలో యువతే అని అర్థం అంతే కాదు వీరంలో 83 శాతం మంది నైపుణ్యం కలిగి మేధోపరమైన వృత్తులలో పనిచేస్తున్నారు. కేవలం 11 శాతం మంది వలస దారుల సగటు వయస్సు మాత్రమే 65 సంవత్సరాలుగా ఉన్నట్లు గుర్తించారు. స్థానిక అమెరికన్లతో పోల్చితే భారతీయులు అన్ని రంగాల్లోనూ పోటీ పడుతూ వస్తున్నారు.

అమెరికాలోని సిలికాన్ వ్యాలీ ప్రపంచ ఐటీ ఉత్పత్తులకు హబ్‌గా మారింది. పలు టెక్నాలజీ స్టార్టప్‌లకు సిలికాన్ వ్యాలీ వేదిక అయ్యింది. విస్తృతమైన ఉపాధి అవకాశాలకు సిలికాన వ్యాలీ కారణమయ్యింది. ప్రధాన సాఫ్ట్ వేర్ కంపెనీలైన గూగుల్, మైక్రోసాఫ్ట్, ఏఎండీ, అడోబ్ వంటి సంస్థలకు భారతీయులు సీఈవో స్థాయి పదవులు చేపట్టారు. అలాగే పలు అంతర్జాతీయ సంస్థలైన ఫేస్‌బుక్, మోటోరోలా, రెక్కిట్ బెన్‌కైజర్, మాస్టర్ కార్డ్ వంటి కంపెనీల్లో భారతీయులు కీలకపదవులు చేపట్టారు. వీరంతా ప్రపంచ వ్యాప్తంగా మన్ననలు పొందారు.

## లండన్ కేంద్రంగా ప్రవాస భారతీయం

భారత్ – యూకే నడుమ శతాబ్దాలుగా సంబంధాలు ఉన్నాయి. గడిచిన చరిత్రలో చేదు జ్ఞాపకాలు ఎన్నిఉన్నప్పటికీ యూకేతో భారత్ అవినాభావ సంబంధం ఉంది. ముఖ్యంగా వివిధ దశల్లో ఒక్కో కాల వ్యవధిలో భారతీయులు ఇంగ్లాండ్ వలస వెళ్లారు. వీరి జనాభా సుమారు 20 లక్షలుగా ఉంది. అయితే వీరంలో మూడోతరం వలస దారులుగా ఎదిగివచ్చారు. వీరంతా వాణిజ్య వేత్తలుగానూ, డాక్టర్లుగా, సైంటిస్టులుగానూ, ఎంట్రప్రెన్యూర్ లుగా ఎదిగారు. అంతేకాదు భారతీయ యువతలో కొందరు యూకే రాజకీయాల్లో కీలక సభ్యులుగా ఉన్నారు. 2015 ఎన్నికల్లో పది మంది భారతీయ సంతతికి చెందిన సభ్యులు గెలిచారు. వీరంతా యువకులే కాగా, 45 సంవత్సరాల ప్రీతీ పటేల్ కామెరూన్ ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తొలి భారతీయ సంతతి మహిళగా ఖ్యాతికెక్కారు.

## గల్ఫ్, మలేషియా కేంద్రం ప్రవాస భారతీయం

**భారత్ నుంచి ఇతర దేశాలకు వలస వెళ్లిన వలసల్లో రెండు రకాలు ఒకటి నైపుణ్యం కలిగిన వలసలు వీరంతా విద్యాధిక సమాజం నుంచి నేరుగా, అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్ దేశాల్లో స్థిరపడ్డారు. రెండోది మామూలు నైపుణ్యం లేని కార్మికులు, వీరంతా చిన్న చిన్న వృత్తులు చేసే వారు.** ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులుగానూ, ఇతర మౌలిక రంగ ప్రాజెక్టుల్లో పనిచేసే దినసరి కూలీలుగానూ **గల్ఫ్, సహా తూర్పు ఆసియా దేశాలైన సింగపూర్, మలేషియాలకు వలస వెళ్లారు.** గల్ఫ్ దేశాల్లో ఆయిల్ నిక్షేపాలు బయల్పడడంతో ఇక్కడ ఒక్కసారిగా మానవ వనరులకు డిమాండ్ పెరిగింది. పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించాయి. ఆయిల్ ఆధారిత పరిశ్రమల్లో పనిచేయడంతో పాటు పలు మౌలిక రంగ ప్రాజెక్టుల్లోనూ పెద్ద ఎత్తున కార్మికులు అవసరం అయ్యారు. ఈ డిమాండ్ ద్వారా భారతీయ శ్రామిక శక్తి గల్ఫ్ దేశాలకు పయనమైంది. ఈ గల్ఫ్ దేశాల్లో భారతీయులు 60 లక్షల మంది వరకూ వలస వెళ్లారు.

అయితే ఇక్కడ పశ్చిమ దేశాల తరహాల్లో స్థిరమైన వీసాలు ఇచ్చిన సందర్భాలు తక్కువ. ఈ దేశాల్లో నిపుణుల కన్నా కూడా శారీరక శ్రమ అధికంగా చేసే కార్మికుల అవసరం ఎక్కువగా ఉండేది. అయితే రాను రాను పరిస్థితులు మారాయి. సౌది అరేబియా, యూఏఈ, ఖతార్ వంటి దేశాల్లో రెండో తరం వలస దారుల్లో కొందరు వ్యాపార వేత్తలుగా ఎదిగారు. ఈ దేశాల్లోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో కేరళ రాష్ట్రానికి చెందిన నర్సులు వైద్యసేవలు అందించేందుకు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. గల్ఫ్ దేశాల్లో భారతీయ సంస్కృతి ప్రతిబింబించేలా సినిమాలు విడుదల అవుతుంటాయి.

## మేధో వలసలా, సాంస్కృతిక వారధులా?

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భారతీయుల వల్ల ప్రతి యేడు మన దేశానికి సుమారు రూ.4.5 లక్షల కోట్ల ఆదాయం సమకూరుతోంది. ప్రపంచంలో మరే దేశానికి ఈ స్థాయి ఆదాయం లేదు. ఇందులో కేవలం కేరళ ఎన్ఎస్‌డీపీలో సుమారు 36.3 శాతం వాటాగా ఉందంటే ఆశ్చర్యం కాక మానదు. ఈ ఆదయమంతా విదేశాల్లో ఉన్న భారతీయులు తమ స్వస్థలాలకు పంపుతున్న ఆదాయం. దీంతో పాటు భారతీయ సంస్కృతి కూడా ప్రపంచం నలుమూలలా విస్తరించేందుకు ఈ ప్రవాసీయులు దోహదపడుతున్నారు. దేశంలో విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు సైతం వీరంతా వారధులుగా తోడ్పడుతున్నారు.

ఒకప్పుడు భారతీయులంటే పాములు పట్టి ఆడించేవారని ప్రతీతి, ఆ భావన నుంచి నేడు ప్రపంచ జ్ఞాన సముపార్జన కేంద్రంగా భారత్ మారింది. **అయితే దేశీయంగా తోడ్పడాల్సిన నైపుణ్య మానవవనరులు ఇలా విదేశాలకు వలస వెళ్లడం కొంత మేర సానుకూలాంశం కాదు.** మేధోవలసలతో సమాజంలో తప్పుడు సంకేతాలు వెళతాయి. ఒక వైపు మనదేశంలో వైద్య సదుపాయాలు అరకొర ఉన్న దశలో 2010 సంవత్సరం నాటికి సుమారు అరవై వేల మంది సుశిక్షితమైన వైద్యులు విదేశాలకు వలస వెళ్లారు. ఇంగ్లీష్ మాట్లాడే దేశాల్లో ఎక్కువగా భారతీయ వైద్యులే ఉండటం గమనించాల్సిన అంశం. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే వైద్య సదుపాయాలు మృగ్యం అయ్యాయి. ఇక భారతీయ లేబోరేటరీల్లో పనిచేసే సైంటిస్టులు సైతం దేశం వదిలి నానో టెక్నాలజీ, బయోటెక్నాలజీ, జెనిటిక్ ఇంజనీరింగ్ విభాగాల్లో రాణించేందుకు వలస వెళ్లిపోతున్నారు. ఈ నేపథ్యంలో దేశంలో నిపుణుల కొరత ఏర్పడే ప్రమాదం ఉంది.

### ప్రవాసీయులే తరగని నిధి..

2025 నాటికి ప్రపంచంలోని 26 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన యువత ఎక్కువగా ఉన్న దేశంగా భారత్ ఎదగనుంది. అయితే పెరుగుతున్న డిమాండ్‌కు తగ్గట్టుగా ప్రపంచానికి మానవ వనరులను అందించే హబ్‌గా భారత్ ఆవిర్భావించనుంది. ప్రపంచంలో నైపుణ్యం కలిగిన యువతకు ఎప్పటికీ డిమాండ్ ఉంటుంది. ఈ నేపథ్యంలో మేధోవలసలను అవకాశంగా మలుచుకోవాల్సిన అవసరం ఉంది. మేధో యువత భారత్‌కు అదనపు బలంగా అవతరించనుంది. ఇప్పటికే చైనీయులు ప్రపంచంలోని పలు దేశాల్లో వ్యాపార వేత్తలుగానూ, ఉన్నత విద్యాధికులుగానూ పేరొందారు. ఇదే బాటలో భారత్ కూడా తన ప్రస్థానాన్ని ముందకు కొనసాగించాల్సిన అవసరం ఉంది. అయితే కేంద్ర ప్రభుత్వం ప్రవాస భారతీయుల కోసం పలు కార్యక్రమాలను ప్రవేశపెట్టింది.

### 1. ప్రవాస భారతీయ దివస్

ప్రతీ యేటా విదేశాల్లో భారతీయుల విజయాలను శ్లాఘిస్తూ పెద్ద ఎత్తున ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. భారత్ తో తమ సంబంధాలను ప్రవాసీయులకు గుర్తు చేస్తూ ఈ దినోత్సవం చేపడతారు.

### 2. పీఐఓ, ఓసీఐ కార్డుల విలీనం

భారతీయ సంతతికి చెందిన వ్యక్తులు దేశంలో ఎన్ని సార్లు అయినా వచ్చి వెళ్లేందుకు, ప్రతీసారి పోలీస్ స్టేషన్‌లో గుర్తింపు చూపించాల్సిన అవసరం లేకుండా పీఐఓ, ఓసీఐ కార్డుల విలీనం చేశారు.

### 3. యువ ప్రవాస భారతీయ దివస్

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భారతీయ యువతను దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమం. యువతకు భారతీయ మూలాలను గుర్తు చేస్తూ చేపట్టిన కార్యక్రమమే యువ ప్రవాస భారతీయ దివస్.

### 4. ప్రవాసీ భారతీయ కేంద్ర

సుమారు 150 దేశాల్లో జీవిస్తున్న భారతీయులు తమ స్వదేశానికి వచ్చినప్పుడు వసతి ఉండేందుకు న్యూఢిల్లీలో ప్రవాసీ భారతీయ కేంద్ర భవనం ఏర్పాటు చేశారు. ఇక్కడ నుంచి స్థానిక ప్రయాణాల రిజర్వేషన్లు, అలాగే పెట్టుబడి అవకాశాల సమాచారాన్ని పొందుపరిచారు.

### 5. వజ్ర – విజిటింగ్ అడ్జంక్ట్ జాయింట్ రిసెర్చి ఫ్యాకల్టీ

దేశీయ శాస్త్ర విజ్ఞాన అభివృద్ధిలో ప్రవాసీయులను భాగస్వామ్యం చేస్తూ ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.

### 6. కేఐపీ (దేశీయ సమాచార కార్యక్రమం)

విదేశాల్లో స్థిరపడిన యువతకు దేశీయ సమాచారం అందుబాటులోకి తెచ్చేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు తిరిగి వచ్చే యువతను ఆకర్షించేందుకు ఈ కార్యక్రమ ఉద్దేశ్యంగా ఉంది.

### ముగింపు

ప్రస్తుతం మారిన పరిస్థితుల నేపథ్యంలో అమెరికా, యూకే లాంటి దేశాల్లో రాజకీయ పరిస్థితులు వలసలపై కటువుగా వ్యవహరించే అవకాశం ఉంది. వీసా విధానాల్లోనూ మౌలికమైన మార్పులు చేపట్టేందుకు పశ్చిమ దేశాలు నిర్ణయాలు తీసుకుంటున్నాయి. అటు గల్ఫ్ దేశాలైన సౌదీ, ఖతార్ లలో నితాకత్ విధానం ద్వారా వలసలను అరికట్టే చర్యలు తీసుకుంటు న్నారు. అలాగే యెమన్, సుడాన్, కెన్యా వంటి దేశాల్లో అంతర్యుద్ధ పరిస్థితులు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రవాస భారతీయులకు కేంద్రం తోడ్పాటు ఎంతో అవసరం. పలు ఆందోళనకర పరిస్థితులు తలెత్తినప్పుడు భారతీయులకు అండగా కేంద్రం నిలిచింది. అయితే గార్ లాంటి చట్టాల వల్ల పలువురు ప్రవాసీ భారతీయులు దేశీయ స్టార్టప్స్ లో పెట్టుబడులు పెట్టేందుకు అడ్డుగోడగా నిలిచాయి. పలు సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉంది. మేధో వలసలు నేడు మనకు మేధో బలంగా మారింది. ఈ అవకాశాలను సమర్థ వంతంగా వాడుకున్న ప్పుడే దేశం మరింత బలోపేతమవుతుంది. ప్రవాసీ కౌశల్ వికాస్ యోజన లాంటి పథకాలను ప్రవేశ పెట్టి ప్రవాస భారతీయుల అభిమానాన్ని చురగొనాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

■

ప్రణాళికాబద్ధం

# అధిక జనాభా ప్రయోజనకరమా?

– దామరాజు వెంకటేశ్వర్లు



**ఎప్పుడైనా వ్యవస్థీకృత రంగంలో ఒక ఉద్యోగం ఏర్పడితే అవ్యవస్థీకృత రంగంలో పది ఉద్యోగాలు ఏర్పడతాయి. ఇలా ఉపాధి అవకాశాలు పెరగడం వల్ల ఆర్థికరంగం చైతన్యవంతం అవుతుంది. ఆర్థికంగా సాధిస్తున్న పురోగతి ఒక ఎత్తైతే జనాభాపరమైన లబ్ధి అధిక కాలం పాటు కొనసాగాలంటే జనాభా ధోరణుల్లో కూడా మార్పులు రావాలి. ప్రధానంగా డెమోగ్రాఫిక్ డివిడెండు సిద్ధాంతంలోనే ప్రమాద ఘంటికలు కూడా ఉన్నాయి. ఏ దేశానికైనా ఈ ప్రయోజనం మూడు నుంచి ఐదు దశాబ్దాల కాలం పాటే ఉంటుందని ఆ సిద్ధాంతకర్తలు చెబుతున్నారు.**

అధిక జనాభా ఒకప్పుడు భారం. కాని ఇప్పుడదే ప్రయోజనం. ఎంత జనాభా ఉంటే ఆ దేశానికి అంతగా ఆదరణ పెరుగుతుంది. దీన్నే డెమోగ్రాఫిక్ డివిడెండు లేదా జనాభా ప్రయోజనంగా వ్యవహరిస్తున్నారు. తేలిక మాటల్లో చెప్పాలంటే జనాభాపరమైన లబ్ధి అన్న మాట. అసలు అధిక జనాభా ఏ విధంగా లాభం, దాని వల్ల ప్రయోజనాలేమిటి, అందరూ ఈ డెమోగ్రాఫిక్ డివిడెండు జపమే చేయడంలో అంతరార్థం ఏమిటి అంటే జనాభా పెరుగుదలకు సంబంధించి మూడు సిద్ధాంతాలున్నాయి. జనాభా పెరుగుదల అనర్థదాయకం అనేది ఒక సిద్ధాంతం అయితే అది అత్యంత ప్రయోజనకరం అని మరో సిద్ధాంతం చెబుతున్నది. ఇక మూడోది తటస్థ సిద్ధాంతం. ఈ మూడు రకాల సిద్ధాంతాలను ప్రవచించే వారు ఎవరి వైఖరికి బలం చేకూర్చే వాదం వారు వినిపిస్తారు. జనాభా పెరుగుదల వల్ల ప్రకృతి వనరులు, ఆర్థిక వనరులపై భారం పడుతుందని, చివరికి ఆ దేశం పేదరికం కోరల్లో చిక్కుకుంటుందని నిరాశావాదులనే మాట. అధిక జనాభా వల్ల వనరులపై భారం పెరిగే మాట వాస్తవమే అయినా ప్రజల ఉత్పాదకతలు కూడా పెరుగుతాయి గనుక ఈ రకమైన ప్రయోజనం ఉన్న దేశాలు ఆర్థికంగా దూసుకుపోతాయన్నది ఆశావహుల వాదం. ఇక మూడో వాదంలో ఉన్న వారు ఇటు ప్రయోజనాలు, అటు రాబోయే ఇబ్బందులు అన్నింటి గురించి మాట్లాడుతూ ఆచితూచి అడుగు వేయడం ఉత్తమమని చెబుతూ ఉంటారు. ఎవరి వాదం ఎలా ఉన్నా ప్రపంచంలో భారతదేశం ఇప్పుడు జనాభాపరంగా లాభదాయకమైన స్థితిలో ఉన్నదని సర్వత్రా వినిపిస్తున్న మాట. ప్రధాని, విధానకర్తలు ప్రస్తుతం ఈ సిద్ధాంతాన్నే ప్రచారం చేస్తున్నారు.

భారతదేశం జనాభా తీరుతెన్నులను పరిశీలిస్తే 15 నుంచి 24 సంవత్సరాల వయస్సులో ఉన్న వారి సంఖ్య అధికంగా ఉంటే వయోవృద్ధుల సంఖ్య తక్కువగా ఉన్నట్టు జనాభా లెక్కలు సూచిస్తున్నాయి. జనాభాలో ఉద్యోగాలు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించగల 15 నుంచి 64 సంవత్సరాల వయో శ్రేణిలోని వారు 63.4 శాతం ఉండగా ఒకరిపై ఆధారపడి జీవితం సాగించాల్సిన స్థితిలో ఉన్న వారు అంటే 0 నుంచి 14 సంవత్సరాల మధ్య వయస్కులు, 65 నుంచి 100 సంవత్సరాల

సీనియర్ పాత్రికేయుడు, హైదరాబాద్.
E-mail: damarajuv@gmail.com

మధ్య వయస్కుల సంఖ్య 0.55 శాతానికి పడిపోయిందని 2011 జనాభా గణాంకాలు చెబుతున్నాయి. జనాభా విషయంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య కూడా వ్యత్యాసం ఉంది. పట్టణ ప్రాంతాలతో పోల్చితే గ్రామీణ భారతంలో 24 సంవత్సరాల లోపు వయస్కులైన యువజనాభా అధికంగా ఉంది. దేశంలోని గ్రామాల్లో నివశిస్తున్న జనాభాలో ఈ వయోశ్రేణిలోని యువజనాభా 51.73 శాతం కాగా పట్టణ ప్రాంతాల్లో 45.9 శాతం మంది ఉన్నారు. అయినప్పటికీ అత్యంత కీలకమైన 15-24 సంవత్సరాల మధ్య వయస్కుల్లో మాత్రం పట్టణ ప్రాంతాలదే పైచేయిగా ఉంది. సంఖ్యాపరంగా చూసినా భారతదేశంలోని 125 కోట్ల మంది జనాభాలో 60.5 కోట్ల మంది 25 సంవత్సరాల లోపు వయస్కులే. 10 నుంచి 19 సంవత్సరాల వయోశ్రేణిలో ఉన్నత విద్య అభ్యసించగల దశలో ఉన్న వారు 22.5 కోట్లు. అంటే ఈ రెండు వయో శ్రేణుల్లో ఉన్న వారే 83 కోట్ల మంది ఉన్నారు. అంటే రానున్న నాలుగు దశాబ్దాల కాలంలో భారతదేశానికి ఈ ప్రయోజనం ఉంటుంది. ఒకపక్క మన పోటీ ఆర్థిక వ్యవస్థ చైనాలో వృద్ధుల సంఖ్య పెరుగుతుంటే మనదేశంలో యువరక్తం పొంగులెత్తే స్థితిలో ఉంది. ఈ యువశక్తి వల్ల అమిత శక్తివంతులైన కార్మిక శక్తి కూడా మనకి ఇబ్బడిముబ్బడిగా ఉంటుంది. భారతదేశంలో 2020 నాటికి శ్రమశక్తి పెట్టుబడిగా ఇటు కుటుంబానికి, అటు దేశ ఆర్థిక వ్యవస్థకు ఆలంబనగా నిలిచే 20 నుంచి 24 సంవత్సరాల మధ్య వయస్కుల సంఖ్య 11.6 కోట్లుంటుందని అంతర్జాతీయ కార్మిక సంస్థ అంచనా. అదే సమయానికి చైనాలో ఇదే వయోశ్రేణిలోని వారి సంఖ్య 9.4 కోట్లకు తగ్గుతుంది. 2020 నాటికి భారత జనాభా సగటు వయస్సు 29 సంవత్సరాలైతే అమెరికాలో 40 సంవత్సరాలు, యూరోపియన్ దేశాల్లో 46 సంవత్సరాలు, జపాన్‌లో 47 సంవత్సరాలు ఉంటుందని అంచనా. ప్రపంచ జనాభాలో ప్రస్తుత ధోరణులను బట్టి చూస్తే వచ్చే రెండు దశాబ్దాల కాలంలో పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాల్లో కార్మికశక్తి నాలుగు శాతం, చైనాలో ఐదు శాతం క్షీణిస్తుందని అంచనా. అదే సమయంలో భారతదేశంలో 32 శాతం పెరుగుతుందని ఆ అంచనాలు చెబుతున్నాయి. సంపాదనాశక్తి గల వయోశ్రేణిలోని జనాభా అధికంగా ఉండడం దేశానికి ప్రయోజనకారి అయిన అంశమన్నది విధానకర్తల అభిప్రాయం. గత దశాబ్ది కాలంగా భారతదేశం మెరుగైన ఆర్థిక వృద్ధిలో పరుగులు తీయడానికి ఇదే కారణమన్నది విధానకర్తల అభిప్రాయం. భారతదేశం ఆర్థికాభివృద్ధిలో చైనాను అధిగమించడానికి దోహదపడిన అంశం కూడా ఇదే. భారతదేశానికి గల ఈ జనాభా ప్రయోజనం వల్ల రానున్న రెండు దశాబ్దాల్లోను తలసరి జిడిపి వృద్ధిరేటు రెండు శాతం పెరుగుతుందని ఐఎంఎఫ్ అంచనా వేస్తోంది.

### ఎంత కాలం ఈ ప్రయోజనం?

వాస్తవానికి డెమోగ్రాఫిక్ డివిడెండుకు భిన్న నిర్వచనాలున్నాయి. ఏదైనా ఒక ఆర్థిక వ్యవస్థ వ్యవసాయాధారాన్ని తగ్గించుకుంటూ పారిశ్రామిక ఆధారిత వృద్ధి దిశగా వడివడిగా అడుగులు వేస్తూ దేశవనరులకు పరిపూర్ణమైన స్వేచ్ఛ కల్పించడమే డెమోగ్రాఫిక్ డివిడెండు అన్నది ఒక నిర్వచనం. అంటే ఈ దశలో దేశంలో జనన, మరణాల రేటు తగ్గుతూ కార్మికశక్తికి అధిక సంఖ్యాకులు జోడవుతూ ఉంటారు. ఫలితంగా తలసరి ఆదాయాలు, ఆర్థికాభివృద్ధి రేటు కూడా పెరుగుతూంటుంది. ఇలాంటి ప్రయోజనం ఏ ఆర్థిక వ్యవస్థకైనా గరిష్టంగా ఐదు దశాబ్దాల పాటు ఉంటుంది. కాని జనన మరణాల రేటులో క్షీణత వల్ల భవిష్యత్తులో పెనుసవాలు తప్పదు. జననాల రేటు తగ్గడం వల్ల ఈ ప్రయోజనం చివరి దశకు వచ్చే నాటికి జనాభాలో ఉత్పాదక దశలో ఉండే వారి సంఖ్య తగ్గిపోయి వృద్ధుల సంఖ్య పెరిగిపోతుంది. అలాగే వైద్య రంగంలో వస్తున్న కొత్త మార్పులు, కొత్త ఔషధాల వల్ల ఆరోగ్యం మెరుగుపడి సగటు జీవన కాలం పెరుగుతుంది. ఇది కూడా దీర్ఘకాలంలో వృద్ధుల సంఖ్య పెరిగేందుకు దోహదపడే అంశం. జననమరణాల రేటు తగ్గుతూ జనాభాలో ఉత్పాదక సామర్థ్యాలు అధికంగా ఉన్నప్పుడు దేశం ఎంత వేగంగా పురోగమిస్తుందో జనాభా పరివర్తన ఏర్పడి సంపాదనాపరుల సంఖ్య తగ్గినప్పుడు అంతగా వెనుకబడిపోతుంది. ఇది ఒక చక్రభ్రమణం. ఈ క్రమంలో ఒక సారి ఉచ్ఛ దశకు వెళ్లడం, మరి కొంత కాలం తర్వాత కనిష్ఠ స్థాయికి దిగజారడం తప్పనిసరి. ఈ చక్రభ్రమణంలో అథమ స్థాయికి దిగజారకుండా ఉండాలంటే ముందు చూపుతో కూడిన చక్కని వ్యూహాలతో ముందుకు సాగడం అవసరం. అంటే జనాభాలోని సమతుల్యతను కాపాడుకుంటూ రావాలి. ఇప్పుడు యువజనాభా అధికంగా ఉండడం వల్ల ఎలాంటి ప్రయోజనం పొందుతున్నామో అదే ప్రయోజనాన్ని కొనసాగించుకునే దిశగా వ్యూహాలు రచించుకోవాలి. పైగా ప్రస్తుత యువజన సంఖ్యా ప్రాబల్యం కూడా పెను సవాళ్లను విధానకర్తల ముందుంచుతోంది. యువజనుల ఆకాంక్షలకు అనుగుణంగా మంచి విద్య, ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉంచాలి. 21వ శతాబ్ది మేథోసంపత్తి ఆధారిత శకం. ఏ దేశ ఆర్థిక వ్యవస్థ విజయానికైనా విద్య, ఉపాధి రంగాలే ఇంధనంగా ఉంటాయి. ఈ కోణంలో నుంచి చూస్తే సాంప్రదాయిక విద్యలను ప్రోత్సహించడంతో పాటు ఆధునిక కాలానికి అవసరం అయిన వృత్తి విద్యలు, సాంకేతిక విద్యా విభాగాల్లో కొత్త చైతన్యం నింపాలి. మారుతున్న పరిస్థితులు, పారిశ్రామిక సంస్థల అవసరాలకు అనుగుణంగా

నిపుణులైన మానవ వనరులను అందుబాటులో ఉంచాలి. ముఖ్యంగా వృత్తి విద్య, సాంకేతిక విద్యా సంస్థల నుంచి ఉపాధి రంగంలో అడుగు పెడుతున్న వారిలో ఐదుశాతం కన్నా తక్కువ మందికే పరిశ్రమ అవసరాలకు దీటైన నైపుణ్యాలుంటున్నాయని, మిగతా వారందరూ నిరుపయోగమేనని పారిశ్రామిక సంస్థలు గగ్గోలు పెడుతున్నాయి. ఈ పరిస్థితిని అధిగమించాలంటే యువతను పారిశ్రామిక అవసరాలకు అనుగుణమై నిపుణులుగా తీర్చిదిద్దాలి. ప్రభుత్వం జాతీయ నైపుణ్యాల అభివృద్ధి మండలి (ఎన్ఎస్‌డిసి) నిర్వహణలో చేపట్టిన నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం ఈ దిశగా ఒక సానుకూలమైన అడుగే అయినప్పటికీ దానిలో వేగాన్ని మరింతగా పెంచాల్సిన అవసరం ఉంది. 2007 ప్రపంచ అభివృద్ధి నివేదిక కూడా ఇదే అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించింది. ఇందుకు ప్రధానంగా దృష్టి సారించాల్సిన మూడు అంశాలను సూచించింది. అవి అవకాశాలు, సామర్థ్యాలు, రెండో విడత అవకాశాలు. ఈ మూడూ ఒకదానిపై ఒకటి ఆధారనీయమైన అంశాలు. ప్రాథమికంగా మౌలిక, సెకండరీ విద్యావకాశాలు, నైపుణ్యాలు పెంచినప్పుడు అవకాశాలు వచ్చి తలుపు తడతాయి. వాటిని ఆసరా చేసుకుని యువశక్తి పురోగమించ గలుగుతుంది. దాని వల్ల ఆర్థిక రంగం చలనశీలమై రెండో విడత అవకాశాల కోసం ఎదురు చూసే వారికి దారి చూపించగలుగుతుంది. అందువల్ల నైపుణ్యాల వృద్ధి విషయంలో సమగ్ర దృక్పథాన్ని అనుసరించడం చాలా అవసరం. అలాగే వ్యవస్థాపరమైన లోపాలను కూడా సరిదిద్దాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించాలి. ప్రభుత్వ యంత్రాంగంలో అలసత్వం, మొద్దునిద్ర, తమ వద్దకు వచ్చిన వారిని ఆకట్టుకోలేకపోవడం, కాలం చెల్లిపోయిన చట్టాలతో వేధించడం పెట్టుబడుల రాకను నిరోధించే అంశాలు. అన్నింటి కన్నా పెట్టుబడులకు ప్రధాన అవరోధం మౌలిక వసతుల లోపం. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలంటే తయారీ రంగ పరిశ్రమలు పెద్ద ఎత్తున ఏర్పాటు కావాలి. ఇలాంటి పరిశ్రమల ఏర్పాటు కేవలం ఒక్క ప్రభుత్వం వల్ల సాధ్యమయ్యేది కాదు. ప్రైవేటు, విదేశీ పెట్టుబడిదారులను కూడా ఆకర్షించడం అవసరం. ప్రైవేటు, విదేశీ పెట్టుబడిదారులు ముందుకు రావాలంటే ప్రభుత్వం వారిపై కర్రపెత్తనం చేసే వ్యవస్థగా కాకుండా వారికి సహాయకారిగా ఉండే విధంగా పరివర్తన చెందాలి. ఎప్పుడైనా వ్యవస్థీకృత రంగంలో ఒక ఉద్యోగం ఏర్పడితే అవ్యవస్థీకృత రంగంలో పది ఉద్యోగాలు ఏర్పడతాయి. ఇలా ఉపాధి అవకాశాలు పెరగడం వల్ల ఆర్థికరంగం చైతన్యవంతం అవుతుంది. వృద్ధిరేటు ఉరకలెత్తి దేశం పురోగమించ గలుగుతుంది. ప్రస్తుతం భారతదేశం ఈ లక్షణాలన్నీ కలిగి ఉందన్నది నిర్వివాదం. ప్రపంచదేశాల్లో భారతదేశం తలెత్తుకుని నిలబడేలా చేసే ప్రయత్నం వాస్తవానికి 1990 దశకంలో ఆర్థిక సంస్కరణల శకం ఆవిష్కారంతోనే మొదలయింది. అప్పట్లో పేదరికం పతాక స్థాయిలో ఉండేది. యువతకు ప్రభుత్వోద్యోగాలు, సాంప్రదాయిక రంగాల్లో ఉద్యోగాలు తప్పితే ఇతరత్రా ఉపాధి అవకాశాలుండేవికావు. అప్పుడప్పుడే ఏకపార్టీ ఆధిపత్యానికి తెరపడి తొలితరం సంకీర్ణ ప్రభుత్వాలు రాజకీయ అస్థిరతను పెంచాయి. వరుస ఎన్నికలు ఆర్థిక రంగానికి భారమై చివరికి ఖజానా దివాలా స్థితికి చేరింది. దేశంలో విదేశీ మారకం నిల్వలు కేవలం 15 రోజుల దిగుమతులకు సరిపోయే స్థాయికి పడిపోయాయి. విదేశీ మారకం నిల్వలు సమకూర్చుకునేందుకు అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) వద్ద బంగారాన్ని తాకట్టు పెట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. అలాంటి పరిస్థితి నుంచి మొదటి తరం ఆర్థిక సంస్కరణలు వెలుపలికి తీసుకు వచ్చాయి. ఆర్థిక రథం ముందుకు కదిలేందుకు ఆలంబన ఇచ్చాయి. ఆ తర్వాత దేశంలో భిన్న రాజకీయ సిద్ధాంతాలు గల ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినా సంస్కరణల విషయంలో మాత్రం వెనుకంజ వేయలేదు. సంస్కరణల పుణ్యమా అని ప్రైవేటు రంగాన్ని ప్రభుత్వాలు ప్రోత్సహించడంతో ఉపాధి అవకాశాలు పెరిగి ఆర్థిక వ్యవస్థ వేగం అందుకుంది. తాజాగా 2014 సంవత్సరంలో కేంద్రంలో బిజెపి నాయకత్వంలో సంపూర్ణ మెజారిటీతో అధికారంలోకి రావడంతో సంస్కరణలు కూడా వేగం అందుకున్నాయి. ఇదే సమయంలో మనకి జనాభాపరమైన లాభం కూడా కలిసి వచ్చింది. జనాభాలో అధిక సంఖ్యలో గల యువతకు మంచి జీవన ప్రమాణాలు అందించే లక్ష్యంతో ప్రధాని నరేంద్రమోదీ పలు వినూత్న పథకాలు ప్రారంభించారు. ఔత్సాహిక పారిశ్రామిక ధోరణులు పెంచేందుకు స్టార్టప్ ఇండియా స్టాండప్ ఇండియా, చిన్న మధ్యతరహా పారిశ్రామికులకు రుణాలందించేందుకు ముద్రా యోజన, ఐటి రంగంలో ఔత్సాహిక పారిశ్రామిక ధోరణులు పెంచేందుకు ఇంక్యుబేటర్ల ఏర్పాటు వంటి పలు వినూత్న చర్యలను ప్రారంభించారు. అలాగే మౌలిక వసతుల రంగంలో దీర్ఘకాలంగా ప్రభుత్వ అలసత్వం కారణంగా నిలిచి పోయిన ప్రాజెక్టులకు అవరోధాలు తొలగించారు. ఇవన్నీ ఫలితాలనందించడం ఇప్పుడిప్పుడే మొదలయింది. ప్రభుత్వ చర్యలు మంచి ఫలితాలు ఇచ్చిన ప్రభావానికి జనాభాపరమైన లబ్ధి కూడా జోడు కావడంతో ప్రస్తుతం భారతదేశం ప్రపంచంలో త్వరితగతిన వృద్ధి చెందుతున్న

ఆర్థిక వ్యవస్థగా నిలిచింది.

ఆర్థికంగా సాధిస్తున్న పురోగతి ఒక ఎత్తైతే జనాభాపరమైన లబ్ధి అధిక కాలం పాటు కొనసాగాలంటే జనాభా ధోరణుల్లో కూడా మార్పులు రావాలి. ప్రధానంగా డెమోగ్రాఫిక్ డివిడెండు సిద్ధాంతంలోనే ప్రమాద ఘంటికలు కూడా ఉన్నాయి. ఏ దేశానికైనా ఈ ప్రయోజనం మూడు నుంచి ఐదు దశాబ్దాల కాలం పాటే ఉంటుందని ఆ సిద్ధాంతకర్తలు చెబుతున్నారు. అంటే కాలం గడుస్తున్న కొద్దీ ఇప్పుడు జనాభాపరంగా దేశానికి లాభంగా నిలిచిన వారే వృద్ధాప్యంలో ప్రవేశించి భారంగా మారతారు. యువతరం జీవన శైలి, విధానాలు కూడా జనాభాపరమైన ప్రయోజనం క్రమక్రమంగా అంతరించి పోవడానికి కారణం అవుతాయి. ప్రస్తుతం మన దేశాన్నే తీసుకుంటే యువత పాశ్చాత్య ధోరణుల్లో కొట్టుమిట్టాడుతోంది. ఆహారపు టలవాట్లలో విశేషమైన మార్పు వచ్చింది. వారు ధరించే దుస్తులు కూడా వారిలో పునరుత్పాదక శక్తిని హరించేవిగా ఉన్నాయని కొందరు ఆందోళన ప్రకటిస్తున్నారు. వారు ధరించే లోదుస్తుల నుంచి ఫ్యాషన్‌గా ధరించే బిగుతైన దుస్తుల వల్ల వారిలో పునరుత్పాదక శక్తి తగ్గిపోతుందంటున్నారు. అంతేకాదు ఉద్యోగ, వ్యాపార పరమైన బాధ్యతల వల్ల కుటుంబంలో భార్యాభర్తలు కలిసి ఉండే సమయం కూడా చాలా కుంచించుకుపోయిందంటే అతిశయోక్తి కాదు. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తూ ఉండడం, ఇద్దరి పనివేళలు కలవకపోవడం వారి మధ్య దూరాన్ని పెంచుతోంది. ఆహారపుటలవాట్లకు వస్తే శరీరానికి సంపూర్ణమైన పోషణ ఇచ్చే ఆహారం తీసుకోవడం ఎప్పుడో అంతరించి పోయింది. సరళీకృత విధానాల పుణ్యమా అని పాశ్చాత్య దేశాల నుంచి ప్రవేశించిన పిజ్జాలు, జంక్ ఆహార పదార్థాల వినియోగం ఎక్కువగా పెరిగింది. ఇవన్నీ యువతలో పునరుత్పాదక శక్తిని హరింపచేస్తున్నాయి. ఇవన్నీ అలా ఉంటే యువజనాభా వివాహాల విషయంలో కూడా భిన్న ధోరణులు ప్రదర్శిస్తున్నారు. కొందరు చదువు పూర్తి చేసుకుని ఉద్యోగంలో ప్రవేశించినా జీవితంలో పూర్తిగా స్థిరపడే వరకు వివాహానికి సుముఖత చూపడంలేదు. దీనివల్ల ఆలస్యపు వివాహాలు కూడా సాధారణం అయిపోయాయి. వివాహానికి అనుకూలమైన వయసు దాటిపోయిన తర్వాత వివాహాలు చేసుకుంటున్న వారిలో కూడా పునరుత్పాదక శక్తి క్షీణించిపోయి ఆ కుటుంబాలు సంతానలేమితో బాధ పడుతున్నాయనేందుకు ఎన్నో ఆధారాలున్నాయి. ఇవే ధోరణులు కొనసాగితే మూడు నుంచి ఐదు దశాబ్దాల సమయానికి భారతదేశం కూడా జనాభాలో వృద్ధుల సంఖ్య అధికంగా ఉన్న దేశాల సరసన చేరి జనాభాపరమైన ప్రయోజనాన్ని పోగొట్టుకుంటుంది. జనాభాలో సమతుల్యత కొనసాగాలంటే పరివర్తిత జనాభాకు దీటుగా జననాల సంఖ్య కూడా ఉండడం అవసరం. అప్పుడే వయస్సు పరంగా పెరుగుతున్న వారి స్థానంలో శిశువులు, చిన్నవయస్సు గల వారు ప్రవేశించి లోటును భర్తీ చేస్తారు. ఇలా లోటును భర్తీ చేయగలిగినప్పుడే జనాభాలో సమతుల్యత ఏర్పడి జనాభాపరమైన ప్రయోజనం సాధారణ చక్రభ్రమణం నిర్దేశించిన సమయం కన్నా ఎక్కువ కాలం కొనసాగుతుంది. ఈ దిశగా ప్రభుత్వాలు ఇప్పుడే వ్యూహాలు రచించుకుని కార్యాచరణలోకి దిగాలి. అప్పుడే భారతదేశం అత్యధిక కాలం పాటు ప్రపంచదేశాల్లో అగ్రగామి స్థానాన్ని కొనసాగించుకోగలుగుతుంది. ■

---

**యోజన అభిమానులకు ఒక సూచన:**

యోజన పత్రిక యాజమాన్యం వీలైనంతవరకు సంచికను సకాలంలో పాఠకులకు అందచేయాలని కృషిచేస్తుంది. అయితే, అనేక కారణాలవల్ల, చందాకట్టినవెంటనే పాఠకునకు పత్రికను పంపటం వీలుకాదు. చందావివరాలు మాకు చేరాలి, ఆసమయానికి సంచిక అందుబాటులో ఉండాలి. ఈ కారణాలవల్లస ఆన్ లైన్ చందాదారులకు ఒక్కొక్కసారి చందా కట్టిన 15, 20 రోజుల తరువాతనే సంచికను పంపటం వీలవుతుంది. యోజన తెలుగు పత్రికకు 20వ తారీఖు తరువాత అందిన చందాలకు, ఆ తరువాత నెలనుండే సంచికను పంపడం వీలవుతుంది. పత్రికను ఎప్పుడూ, సాధారణ పోస్టు ద్వారానే పంపుతాము. దీనికి రికార్డేమీ ఉండదు. ఒకవేళ ఎవరికైనా పత్రిక అందకపోతే, బదులుగా మరో సంచికను పంపడం లేదా చందాను సద్దుబాటు చేయడం వీలుకాదు. చందాదారులే తమ చిరునామా సరిచూసుకోవడం, స్థానిక పోస్టుమాన్‌తో మాట్లాడటం చేయాలి. గమనించగలరు.

–సీనియర్ సంపాదకుడు.

పరివర్తన

# ఉగ్రవాద ప్రాంతాల్లో యువతకు అవకాశాలు

– రవి పోకర్ణ



**తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలకు చెందిన యువకులు దుర్భరమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారు. దీన్ని గమనించిన మన ప్రభుత్వం అలాంటి ప్రాంతాల్లో అభివృద్ధి పథకాలు, ప్రణాళికలు మరియు వాటి అమలుపై ప్రత్యేక దృష్టి సారించింది. నూతన సమీకృత కార్యచరణ ప్రకారం ప్రభుత్వం ఆదివాసీలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావాలని, అదే సమయంలో హింసపై కూడా కఠినంగా వ్యవహరించాలని యోచిస్తోంది.**

యాభై ఏళ్ల క్రితం 18 మే 1967న పశ్చిమ బెంగాల్లోని సిలిగురి కిసాన్ సభ సాయుధ పోరాటం ద్వారానే భూ పంపిణీ సాధించాలని సూచించిన కొందరికి మద్దతు ప్రకటిం చింది. అదే ఇప్పుడు కనిపిస్తున్న నక్సలైట్ ఉద్యమం, సంవత్సరాలుగా దేశంలోని ఇతర రాష్ట్రాలకు భౌగోళికంగా వ్యాప్తి చెందింది. అలాగే సాయుధ పోరాటంలో క్రూరత్వం మరియు హింసాకాండను కొనసాగించింది. ఇటువంటి తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలకు చెందిన యువకులు దుర్భరమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారు. దీన్ని గమనించిన మన ప్రభుత్వం అలాంటి ప్రాంతాల్లో అభివృద్ధి పథకాలు, ప్రణాళికలు మరియు వాటి అమలుపై ప్రత్యేక దృష్టి సారించింది. సిపిఐ(ఎం) వామపక్ష తీవ్రవాదం (ఎల్‌డబ్ల్యూఇ) ప్రభావిత 34 జిల్లాలే కాకుండా, ఈశాన్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు, జమ్ము,కాశ్మీర్‌లను తిరుగుబాటు ప్రభావితం చేస్తోంది. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో యువత కోసం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలపై ఈ వ్యాసం మరింత వివరంగా తెలియజేస్తుంది.

### అ) 'రెడ్ కారిడార్'లోని యువతకు ప్రభుత్వ పథకాలు

నక్సల్ సమస్య యొక్క తీవ్రత దీర్ఘకాలంగా ఉన్నప్పటికీ 2009లో మాత్రమే వామపక్ష తీవ్రవాద (లెఫ్ట్ వింగ్ ఎక్స్ట్రీమిస్ట్) తీవ్రవాదాన్ని సమర్థవంతంగా పరిష్కరించ డానికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖలో వామపక్ష తీవ్రవాద ప్రభావిత (ఎల్‌డబ్ల్యూఇ) విభాగాన్ని ఏర్పాటు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని వివిధ విభాగాలు చేపడుతున్న అభివృద్ధి కార్యకలాపాలను సమన్వయ పరిచే బాధ్యత ఈ విభాగం నిర్వహిస్తోంది. గత కొన్నేళ్లలో ఇది సమస్యల పరిష్కారంలో మరింత సమీకృత, నిర్ణయాత్మక మరియు వ్యూహాత్మకంగా మారింది. నూతన సమీకృత కార్యచరణ ప్రకారం ప్రభుత్వం ఆదివాసీలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావాలని, అదే సమయంలో హింసపై కూడా కఠినంగా వ్యవహరించాలని యోచిస్తోంది. వామపక్ష తీవ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ''స్వల్పకాలిక లక్ష్యాలను'' సాధించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా స్థాయి అభివృద్ధి ప్రణాళికను

ఇన్‌ఛార్జ్, రాంభవ్ మాల్గీ ప్రబోధిని (రాజకీయ నాయకులకు శిక్షణనిచ్చేందుకు ఐక్యరాజ్యసమితి గుర్తింపు పొందిన సంస్థ), న్యూఢిల్లీ.
E-mail: ravi.pokharna@gmail.com

అనుసరించడం ద్వారా ఇప్పుడు జిల్లా బ్లాక్ స్థాయిలో అభివృద్ధి విధానం రూపొందించడం జరిగింది. ప్రభావిత జిల్లాలలో అభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ప్రణాళిక తయారు చేశారు. నక్సల్ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధిని వేగవంతం చేసే దిశగా మావోయిస్టుల పురిటిగడ్డగా భావించే దంతెవాడలో ప్రధాన మంత్రి పర్యటించారు. రూ. 24,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన సందర్భంగా మోదీ మాట్లాడుతూ 'భుజాలపై నాగలిని మోయడం ద్వారానే అభివృద్ధి సాధించగలమని, తుపాకులతో ఏమి సాధించలేమన్నారు. ఇది దేశంలోని ప్రతి ఒక్కరినీ ప్రధాన స్రవంతిలోనికి తెస్తుందని, హింసకు ఎటువంటి భవిష్యత్తు లేదని, భవిష్యత్ శాంతియుత మార్గాల ద్వారా మాత్రమే సాధ్యమని' తెలిపారు.

ఈ మాటలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వామపక్ష తీవ్రవాద ప్రాంతాల యువత కోసం అనేక చర్యలు చేపట్టింది. ఈ ప్రాంత యువకుల ప్రయోజనం కోసం విద్య మరియు నైపుణ్యాభివృద్ధి పై పలు కార్యక్రమాలు ప్రారంభించింది. ఒక వైపు ప్రభుత్వం ఈ ప్రాంతాల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్న పథకాల అమలును వేగవంతం చేయగా, మరోవైపు అనేక నూతన విధానాలు మరియు కార్యక్రమాలను నిర్దిష్ట అవసరాలకు అనుగుణంగా ప్రవేశపెట్టింది. నిరుద్యోగ, నిరక్షరాస్యులైన యువతనే తిరుగుబాటుదారులు లక్ష్యంగా చేసుకుని వారిని తమ కార్యకలాపాల్లో భర్తీ చేసుకుంటున్నారు. దీంతో ఈ ప్రాంత యువతకు విద్యను అందించడానికి ఒక సమగ్ర ప్రణాళికను ప్రభుత్వం రూపొందించింది. సర్వ శిక్షా అభియాన్ ద్వారా, నివాస పాఠశాలల ద్వారా ఇక్కడి బాలలకు విద్యా సౌకర్యం కల్పించబడుతోంది. బాలికలకు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల ద్వారా చవకైన మరియు నాణ్యమైన ప్రాథమిక విద్యను అందిస్తున్నారు. రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (RMSA) ద్వారా సెకండరీ విద్యను అందజేస్తున్నారు. కేంద్రీయ విద్యాలయాలు మరియు నవోదయ పాఠశాలలు కూడా తెరువబడుతున్నాయి.

నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రధాన్ మంత్రి కౌశల్ వికాస్ యోజన క్రింద ప్రభావిత 34 జిల్లాలలో ప్రతి జిల్లాలో 160 మంది యువకులకు శిక్షణనిస్తోంది. యువతకు అనుకూల వాతావరణం మరియు అవకాశాలను సృష్టించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయి. చత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఈ ప్రాంతాల్లో లైవ్లీహుడ్ కళాశాలలను ఏర్పాటు చేసింది. ఇదే కాకుండా ప్రభుత్వం 'ప్రయాస్' సంస్థ ద్వారా పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేస్తోంది. ఎల్‌డబ్ల్యూఇ కేటగిరిలోని ఐదు జిల్లాల పరిధిలో ఉన్న బస్తర్ ప్రాంతంలో 2016లో 27 మంది విద్యార్థులను ఐఐటికి పంపింది. "వామపక్ష తీవ్రవాదం వల్ల ప్రభావితమైన 34 జిల్లాల్లో నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ ఒక్కొక ఐటిఐను నడుపుతోంది. అలాగే ప్రభావిత తొమ్మిది రాష్ట్రాల్లోని 34 జిల్లాల్లోనూ రెండు నైపుణ్య అభివృద్ధి కేంద్రాలున్నాయి.

జార్ఖండ్ పోలీసులు వామపక్ష ప్రభావిత ప్రాంత పిల్లలకు కోసం ఒక ప్రత్యేకమైన కార్యక్రమాన్ని ప్రారంభించారు. "తారే జమీన్ పర్" అని పిలిచే ఈ కార్యక్రమంలో భాగంగా పాలమవు జిల్లా ప్రధాన కేంద్రమైన డాల్టన్ గంజ్ నివాసితుల నుండి పుస్తకాలు, నోటు పుస్తకాలు, బట్టలు, సంచులు, బూట్లు వంటివి సేకరించి వెనుకబడిన పేద పిల్లలకు పోలీసులు తిరిగి పంపిణీ చేస్తున్నారు.

ఉద్యోగం మరియు జీవనోపాధికి పనికి వచ్చే నైపుణ్య శిక్షణతో కూడిన విద్యను అందివ్వడతోనే ఈ ప్రాంతాల యువతను హింస నుంచి దూరంగా ఉంచగలవని కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు అర్థం చేసుకున్నాయి.

### ఆ) తీవ్రవాద ప్రభావిత ఈశాన్య ప్రాంత యువత కోసం ప్రభుత్వ పథకాలు

ఈశాన్య భారతదేశం మన దేశంలో భౌగోళికంగా అత్యంత వ్యూహాత్మక భూభాగం. దురదృష్టవశాత్తూ ఈ ప్రాంతం భారత స్వాతంత్ర్యం తరువాత తిరుగుబాటు, అస్థిరత మరియు సామాజిక అశాంతికి గురవుతోంది.

ఈ నేపథ్యంలో ఈశాన్య తిరుగుబాటు ప్రాంత యువత కోసం ప్రత్యేకంగా అనేక కార్యక్రమాలు ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ ప్రాంతంలో ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ వివిధ కేంద్ర ప్రభుత్వం విభాగాల కార్యక్రమాలను సమన్వయకర్తగా వ్యవహరిస్తోంది. నైపుణ్య మంత్రిత్వశాఖ ఈశాన్య రాష్ట్రాల ముఖ్యమంత్రులు చైర్మన్‌గా, వివిధ పరిశ్రమల ప్రతినిధులతో కూడిన స్టీరింగ్ కమిటీతో నైపుణ్యాభివృద్ధి మిషన్‌కు ప్రణాళిక తయారు చేసింది. ప్రభుత్వ ఐటీఐలతో పాటు ఇతర ప్రైవేటు సంస్థల సహకారంతో యువతకు శిక్షణ ఇవ్వడానికి ఈ మిషన్ కృషి చేస్తోంది. దీనితోపాటు అదనంగా రాష్ట్ర జీవనాధార మిషన్, అలాగే నేషనల్ అర్బన్ లైవ్లీవుడ్ మిషన్ (ఎన్‌యూఎల్‌ఎం) కూడా యువత కోసం వివిధ నైపుణ్య పథకాలు అమలు చేస్తున్నాయి.

**గుర్తించిన శిక్షణా ప్రాంతాలు క్రింది విధంగా ఉన్నాయి: –**

* అతిథ్యం (హాస్పిటాలిటీ) – (వంటకాలు, ఆహారం, పానీయం, పేస్ట్రీ మరియు బేకింగ్)
* పర్యాటక రంగం – టూర్ ఆపరేటర్లు, హోటళ్లు, అతిథి గృహాలు, టాక్సీలు మొదలైనవి.
* నర్సింగ్, పారామెడికల్.
* ఆరోగ్యం మరియు సౌందర్యం

* ఫ్యాషన్ డిజైనింగ్ మరియు వస్త్రాలు, చేనేత.
* అత్యవసర సాంకేతిక నిపుణులు – ఎలక్ట్రిషియన్, ప్లంబింగ్, ఎసి రిపేర్, ఫ్రిడ్జ్,మొబైల్ మరమ్మతులు మొదలైనవి.
* ఆటోమొబైల్ – ఫిట్టర్, టర్నర్, మెకానిక్స్, వెల్డింగ్.
* సాఫ్ట్ స్కిల్స్
* టోకు వర్తకం
* విమానయానం – క్యాబిన్ క్రూ, ఎయిర్ హోస్టెస్, గ్రౌండ్ సిబ్బంది మొదలైనవి.

వీటికి అదనంగా ఈశాన్య ప్రాంత విభాగం ఈశాన్య ప్రాంత అభివృద్ధి ఆర్థిక కార్పొరేషన్ లిమిటెడ్‌తో కలిసి ఈశాన్య రాష్ట్రాల్లో వివిధ అంకుర సంస్థలను ప్రోత్సహించడానికి రూ.100 కోట్లతో వెంచర్ క్యాపిటల్ (విసి) నిధిని ఏర్పాటు చేసింది. ఈ నిధి సహకారంతో ఐటి, ఐటిఇఎస్, ఆహార శుద్ధి (ఫుడ్ ప్రాసెసింగ్), ఆరోగ్య సంరక్షణ (హెల్త్‌కేర్), పర్యాటకం (టూరిజం),టోకు, రిటైల్ రంగాల్లో ప్రారంభ మరియు అంకుర సేవలు వేగవంత మయ్యాయి. సర్వశిక్షా అభియాన్(ఎస్ఎస్ఎ), రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (ఆర్‌యూసిఎ–రూసా)ద్వారా అనేక విద్యా సంస్కరణలు ప్రవేశపెట్టబడ్డాయి. డిపార్ట్–మెంట్ ఆఫ్ నార్త్ ఈస్ట్రన్ రీజియన్ (డిఓఎన్ఇఆర్) ఈశాన్య ప్రాంతాల్లో ఉపాధిని పొంపెందించే పరిశ్రమలకు, ఇతర సంస్థలకు రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తోంది. ఇదే విధంగా నార్త్ ఈస్టర్న్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ (NEDFI) అధిక ఉపాధిని కల్పిస్తున్న సంస్థలకు అధిక వడ్డీరాయితీలు అందిస్తోంది.

**ఇ) జమ్మూ – కాశ్మీర్‌లో తీవ్రవాద ప్రభావిత మైన యువత కోసం పభుత్వ పథకాలు.**

గత మూడు దశాబ్దాల జమ్మూ, కాశ్మీర్ తిరుగుబాటు మూలాలు భారత స్వాతంత్ర్యానికి ముందునుంచే వేళ్లూనుకుని ఉన్నాయి. ప్రస్తుతం భారత ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వం కలిసి ఇక్కడి యువతకు నైపుణ్య మరియు జీవనోపాధి అవకాశాలను కల్పించేందుకు కృషి చేస్తున్నాయి.

**ప్రజాదరణ పొందిన కొన్ని కార్యక్రమాలు**

**ఉడాన్(UDAAN)**

జమ్మూ,కాశ్మీర్ కోసం ప్రత్యేక పారిశ్రామిక చొరవ (స్పెషల్ ఇండస్ట్రీయల్ ఇనిషియేటివ్ (SII)కు కేంద్ర దేశీయ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా నిధులు సమకూరుస్తుండగా, జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్– (NSDC)చే అమలు చేయబడుతున్నది. ఇది రాష్ట్రంలోని యువత నైపుణ్యానికి వాణిజ్యపరమైన గుర్తింపు (కార్పొరేట్ ఎక్స్‌పోజర్) కల్పించే లక్ష్యంతో పాటు కార్పొరేట్ భారతదేశంను తయారు చేసే ఉద్దేశ్యంతో పని చేస్తోంది. ఈ పథకాలు ప్రజాదరణ పొందడమే కాకుండా లక్ష్య సాధనలో గణనీయమైన ప్రభావం చూపుతున్నాయి.

**సద్భావన**


భారత సైన్యం నడుపుతున్న మరో విజయవంతమైన కార్యక్రమం 'సద్భావన'. జమ్మూ మరియు కాశ్మీర్ యువతకోసం సైన్యం సద్భావన పేరిట అనేక ముఖ్యమైన కార్యక్రమాలు నడుపుతోంది. ఆర్మీ గుడ్‌విల్ స్కూల్ ద్వారా లక్ష మంది విద్యార్థులకు మధ్య మరియు ఉన్నత పాఠశాల స్థాయి విద్యను అందిస్తున్నారు. ప్రస్తుతం, రాష్ట్రంలో సైన్యం ద్వారా నడపబడుతున్న వివిధ పాఠశాలల్లో 14 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. సద్భావన క్రింద జాతీయ సమైక్యత యాత్రను ఏర్పాటు చేసి ఇక్కడి విద్యార్థులు వివిధ రాష్ట్రాలను సందర్శించి అక్కడి ప్రజల సంస్కృతిని తెలుసుకునే అవకాశం కల్పిస్తున్నారు. వీరు ఉత్పాదక పౌరులుగా మారడానికి ప్రేరణ పొందడంతో పాటు, వ్యక్తిగత అభివృద్ధిని సాధించుకునే విధంగా దోహదపడుతున్నారు. ఈ పథకం కింద నిర్వహించిన 200 పర్యటనలలో ఐదు వేల కంటే ఎక్కువ మంది ప్రయోజనం పొందారు.

రాష్ట్రంలో ఆసక్తి మరియు అర్హత ఉన్న అభ్యర్థులకు ఆచరణాత్మక నైపుణ్యాలను అందించడానికి వృత్తి శిక్షణా కేంద్రాలు మరియు మహిళా సాధికారిక కేంద్రాలను కూడా సైన్యం నడుపుతోంది. దీనికై సైన్యం తన బడ్జెట్‌లోని సొంత నిధులు వెచ్చిస్తోంది. రాష్ట్రంలో మారుమూల ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజల పరిస్థితులను మెరుగు పర్చడానికి సౌహార్ద కార్యక్రమాలు ఏడాది పొడవునా అమలు చేస్తున్నారు. భారతీయ సైన్యం శిక్షణా భాగస్వామి సెంటర్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ లెర్నింగ్ (CSRL) మరియు పెట్రోనెట్ ఎల్ఎన్‌జి సహకారంతో జమ్మూ,కాశ్మీర్ యువతకు ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షల శిక్షణ కోసం కాశ్మీర్ సూపర్ 40 కార్యక్రమాన్ని నడుపుతోంది. ఈ సూపర్ 40 ప్రభావంతో ఐఐటి–జెఈఈ తుది పరీక్ష 2017లో ఇక్కడి యువత ఏళ్ల రికార్డును అధిగమించి 26 మంది బాలురు, ఇద్దరు బాలికలు విజయం సాధించారు. . కాశ్మీర్ సూపర్ 40 దేశంలోని ఐఐటి కోచింగ్ కేంద్రాలకు సమానంగా 78 శాతం విజయం సాధించి పురోగమనంలో ఉంది.

భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ్ కౌషల్ యోజన క్రింద 1.24 లక్షల మంది జమ్మూ కాశ్మీర్ యువతకు ఉపాధిని అందించే వృత్తి శిక్షణ నివ్వడానికి లక్షించింది. ఈ విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా తిరుగుబాటు ప్రభావిత ప్రాంత యువత తన ప్రాంత అభివృద్ధితో పాటు దేశాభివృద్ధికి తోడ్పడే విధంగా ప్రేరణ కల్పిస్తున్నాయి. ■

# దూర, ఆన్‌లైన్ పారిశ్రామిక నాయకత్వ విద్య

– అమిత్ కుమార్ ద్వివేది




**సమాచార సాంకేతిక పరిజ్ఞానం అందుబాటుతో తరగతి గదుల సరిహద్దులు చెరిగిపోయాయి. టెక్నాలజీ ఆధారిత బోధనా వేదికలుగా రూపాంతరం చెందిన ఓ డి ఎల్ సంస్థల సంఖ్య దేశంలో గణనీయంగా పెరుగుతోంది.. అందుబాటులో ఉన్న విద్యా సంబంధ మైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీతో జోడించి "అందరికీ విద్య" లక్ష్యాన్ని చేరుకోవడం సార్వత్రిక, దూర విద్యా విధాన ప్రధాన లక్ష్యం.**

**సంక్షిప్త వీక్షణ :**

వ్యక్తిగతంగా హాజరు కాకుండా దూరం నుంచి నేర్చుకోవడం దూరవిద్యగా అఖిలభారత సాంకేతిక విద్యామండలి చెబుతోంది. విద్యలో ఒక భాగమైన దూరవిద్య ప్రధానంగా భౌతికంగా దగ్గరలో లేని విద్యార్థులకు బోధన, సాంకేతిక పరిజ్ఞానం, సూచనల ఆధారిత విద్యను అందించడంపై దృష్టి పెట్టింది. నేర్చుకునే వారి సమయం, దూరంతో నిమిత్తం లేకుండా ఎప్పుడైనా, ఎక్కడ నుంచైనా సమాచారాన్ని అందించే ప్రక్రియ దూరవిద్య. నేర్చుకునే వారికి సమాన నాణ్యతా విలువతో కూడా విద్యానుభావాన్ని దూరవిద్యా విధానం అందిస్తుందని అఖిలభారత సాంకేతిక విద్యామండలి పేర్కొంది. సంప్రదాయ విద్యా విధానంతో సరిసమానంగా సార్వత్రిక, దూర విద్యాభ్యాస వ్యవస్థగా, దీనిని తీర్చిదిద్ది నప్పటికీ వాస్తవానికి ఇది రెండవ ఉత్తమ విద్యాభ్యాసం గానే కొనసాగుతోంది. ఆకాంక్షకు, ఆచరణకు మధ్య అంతరాన్ని తొలగించే విధానంగా దూరవిద్యా విధానం ఒక సమగ్ర దృక్కోణంతో రూపుదిద్దుకుంది. ఈ సమ్మిళిత కోణంలో సమాచారం, కమ్యూనికేషన్ ఉపకరణాలు, సాంకేతిక విద్యా వనరులను సమర్థంగా వినియోగించు కోవడం జరుగుతోంది. విద్యార్థులతో వ్యక్తిగతంగా సంప్రదింపుల తరగతులు, కౌన్సిలింగ్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ బోధనా విధానం ప్రతి ఒక్కరికి స్వీయ సూచనాత్మక ఉపకరణల ద్వారా విషయ పరిజ్ఞానం పొందడానికి దోహద పడుతోంది.

నేరుగా విద్యా సంస్థలకు వెళ్లి విద్య నభ్యసించే అవకాశం లేని జనాభాలోని విభిన్న వర్గాలకు ఈ విధానం ఎంతో ప్రయోజ నకరంగా ఉంది. భారత్‌లో సార్వత్రిక, దూర విద్యా విధానం (ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ సిస్టం–ఓ.డి.ఎల్) సౌలభ్యం, సరళత్వం, విస్తృత ప్రాతిపదికతో కూడిన ప్రత్యామ్నాయంగా రూపుదిద్దుకుంది. గత ఆరు దశాబ్దాల దూర విద్యావిధాన అనుభవం, దాని అభివృద్ధి క్రమం ప్రజలకు మెరుగైన విద్యనందించే సవాళ్ళను ఎదుర్కో వడంలో కొత్త విశ్వాసాన్ని రేకెత్తించింది. సమాచార సాంకేతిక పరిజ్ఞానం అందుబాటుతో తరగతి గదుల సరిహద్దులు చెరిగిపోయాయి. టెక్నాలజీ ఆధారిత బోధనా వేదికలుగా రూపాంతరం చెందిన ఓ డి ఎల్ సంస్థల సంఖ్య దేశంలో గణనీయంగా పెరుగుతోంది.

ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా, న్యూఢిల్లీ.
E-mail: akdwivedi@ediindia.org

## భారత్ లో దూర, ఆన్ లైన్ విద్యావ్యాప్తి :

అఖిల భారత స్థాయిలో 2012 – 2013లో 2,57,61,686 మంది దూర సార్వత్రిక విద్యా కార్యక్రమాల్లో నమోదయ్యారు. వీరిలో 1,15,82,708 మంది మహిళలున్నారు. కాగా 2011-2012లో ఈ కార్యక్రమాల్లో నమోదయిన వారు మొత్తం 2,18,61,116 మంది కాగా మహిళలు 9,68,18,858 మంది ఉన్నారు.

అందుబాటులో ఉన్న విద్యా సంబంధమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీతో జోడించి "అందరికీ విద్య" లక్ష్యాన్ని చేరుకోవడం సార్వత్రిక, దూర విద్యా విధాన ప్రధాన లక్ష్యం. ఇంటర్నెట్ వేదికలను ఉపకరణాలను వినియోగించి కోర్సులు నిర్వహించడం ఆన్ లైన్ విద్యలో వాస్తవిక అంశం. ఈ వాస్తవిక విద్యా వేదికలు ప్రజల వద్దకు చేరుకొని వారికి నాణ్యమైన విద్యాంశాలను అందించగలుగుతాయి. జనాభాలోని ఎక్కువ శాతం మందికి బోధనా పరమైన మద్దతు ఇవ్వడం ద్వారా ఆన్ లైన్ విద్య సార్వత్రిక – దూరవిద్యా విధానంలో ప్రముఖ పాత్ర పోషిస్తోంది.

## భారత్ లో పారిశ్రామిక యాజమాన్య విద్య :

వయోజన జనభా సర్వే (ఏ పి ఎస్) ప్రకారం 58 శాతం భారతీయ వయోజనులు సొంతంగా పరిశ్రమ / సంస్థల నిర్వహణను వాంఛనీయ జీవన ప్రగతి మార్గంగా మార్చుకుంటున్నారు. అయితే 6.6 శాతం మంది మాత్రమే సంస్థ / పరిశ్రమ నిర్వహణ కార్య కలాపాలలో నిమగ్నమై ఉన్నారు. ఏదో ఒక ప్రభావిత అంశంతో మార్పులకు లోనయ్యే ఆర్థిక వ్యవస్థ కలిగిన భారత్ వంటి దేశాల్లో వైఫల్యం, నిధుల కొరత వంటి కారణాలతో వ్యాపారాలు అర్ధంతరంగా నిలిచి పోయే పరిస్థితులు ఉన్నాయి. యువ జనభాలో ముఖ్యంగా 40 శాతం మించి ఉన్న మహిళల్లో అవగాహనా సామర్థ్యంతో పాటు అవకాశాలు కుడా తక్కువే. దేశంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల పెరుగుదల రేటు పరిమితంగా ఉండడానికి తగిన శిక్షణ, విద్య లేకపోవడం కారణంగా జాతీయ నిపుణుల సర్వే తేల్చింది. విద్యార్థుల్లో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల లక్షణాలను పెంపొందించి, వారికి అవసరమైన నైపుణ్యాలు అందించి సమర్థవంతమైన వ్యాపారవేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దగల పటిష్టమైన పారిశ్రామిక విధానం ఆవశ్యకతను ఈ అధ్యయనాలు చాటి చెప్పాయి.

మొత్తం జనభాలో పనిచేసే వారు అంటే యువ జనభా నిష్పత్తి అధికంగా ఉన్నందున, ఈ మానవ వనరులను సక్రమంగా వినియోగించుకుంటే దేశ సమగ్రాభివృద్ధి దిశగా మంచి ఫలితాలు రాబట్టవచ్చు. ఇందుకు పారిశ్రామిక యాజమాన్య విద్య, విస్తరణ, అభివృద్ధి అవసరం. కేంద్ర ప్రభుత్వం పారిశ్రామిక యాజమాన్య విద్య పై ప్రత్యేక దృష్టి పెట్టింది. కొన్ని ప్రముఖ విద్యా సంస్థలు కూడా భారత్ లాంటి అంతర్జాతీయ ఆర్థికవ్యవస్థలలో యువ పారిశ్రామిక వేత్తల ప్రాధాన్యతను గుర్తించాయి.

## దూర, ఆన్ లైన్ పారిశ్రామిక యాజమాన్య కోర్సులు :

ప్రభుత్వ, ప్రయివేటు గుర్తింపు సహాయ సహకారాలతో దూర, ఆన్‌లైన్ విద్యా విధానం విస్తరిస్తోంది. దూర, ఆన్‌లైన్ కోర్సులకు సంబంధించి యాజమాన్య కోర్సులలోనే ఎక్కువ మంది చేరుతున్నట్టు ఒక ఇంటర్నెట్ సర్వే వెల్లడిం చింది. అయితే పారిశ్రామిక యాజమాన్యం విషయంలో దూర, ఆన్ లైన్ కార్యక్రమాలపై అన్వేషిస్తే నిరుత్సాహమే కలుగుతుంది. చాల కొద్ది సంస్థలు మాత్రమే దూర, ఆన్ లైన్ పద్ధతిలో కొద్దిపాటి పారిశ్రామిక యాజమాన్య కోర్సులు అందిస్తున్నాయి. సుదీర్ఘ అన్వేషణ తరువాత ఎవరైనా ఈ కింది 5 కార్యక్రమాలను మాత్రమే కనుగొనగలుగుతారు. ఇ డి ఐ ఐ వెబ్సైటు నుంచి మినహా ఈ కోర్సులలో నమోదయిన విద్యార్థుల సంఖ్య పై ఎటువంటి సమాచారం అందుబాటులో లేదు.

1. ఇడిఐఐ (ఎంటర్ ప్రెన్యూర్ షిప్ డెవలప్ మెంట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా, అహ్మదాబాద్); పారిశ్రామిక యాజమాన్యంలో సార్వత్రిక, దూర విద్యా కార్యక్రమాలు (ఓ ఎల్ పి ఇ).
2. సిమ్బయోసిస్ యూనివర్సిటీ, పూనే బీ సర్టిఫికెట్ ప్రోగ్రాం ఇన్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ డెవలప్మెంట్ (సి పి ఇ డి)
3. ఇగ్నో ; సర్టిఫికెట్ ఇన్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ (సి ఐ ఇ).
4. వెలింగ కర్ ఇన్సిట్యూట్, ముంబై, డిప్లొమా ఇన్ ఎంటర్ ప్రేన్యూర్ షిప్ మేనేజ్మెంట్ (డి ఇ ఎం).
5. వెస్ట్ బెంగాల్ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ జురిడికల్ సైన్సెస్ (కోల్‌కత్తా); డిప్లొమా ఇన్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ అడ్మినిస్ట్రేషన్ అండ్ బిజినెస్ లాస్.

## వాస్తవ పరిస్థితి :

దేశంలో పారిశ్రామిక యాజమాన్య విద్య పరిమితిని చూస్తే దూర విద్యా విధానం ఇంకా లక్ష్యానికి దూరంగానే ఉంది అని చెప్పవచ్చు. పారిశ్రామిక నిర్వహణకు సంబంధించిన కార్యక్రమాలను అందించే దూర విద్యా సంస్థలు విద్యా ప్రణాళికల విషయం లోనూ, ఫలితాలు రాబట్టే కోర్సులు అందించడం లోను మరింత చురుగ్గా వ్యవహరించవలసిన అవసరం ఉంది. కోర్సులకు రూపకల్పన చేసి అందించడంలో మెరుగుదలకు అవకాశం ఉన్నప్పటికీ విశ్లేషించి పరిష్కరించ వలసిన కొన్ని మౌలిక అంశాలు ఉన్నాయి.

### వ్యాపార దృష్టి

కొన్ని ప్రయివేటు, ప్రభుత్వ యూనివర్సిటీలు దూర విద్యను ధనార్జన దృష్టితో పరిగణిస్తున్నాయి. ముద్రించిన పత్రాలు, టివి, రేడియో వంటి ఇతర పద్ధతులు అందించే బోధనా సామగ్రిలో తగిన ప్రమాణాలు లేకుండా కేవలం ఫీజులు వసూలు కోసం దూర విద్యా కోర్సులు ప్రారంభిస్తుండడం మనం చూస్తున్నాం. దీనితో నాణ్యమైన విద్యకు విద్యార్థులు దూరమై పోతున్నారు. తగిన సౌకర్యాలు, శిక్షణ నదుపాయాలు లేని, వాటిని సమర్థంగా నిర్వహించలేని యూనివర్సిటీలకు పారిశ్రామిక యాజమాన్యం వంటి ప్రత్యేక కోర్సుల ఏర్పాటును అనుమతించకపోవడం మంచిది. కొన్ని యూనివర్సిటీలయితే వేరే లక్ష్యాలు ప్రయోజనాలతో ఏర్పడినవే అయినప్పటికీ కేవలం డబ్బు చేసుకోవడానికి దూర విద్యా కోర్సులను అందిస్తున్నాయి. ఇలాంటి కొన్ని సంస్థలలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు గాని సిబ్బంది గాని ఉండరు. ఆన్ లైన్ కార్యక్రమాల పై అజమాయిషీ ఉండదు. పాఠ్య ప్రణాళిక, కోర్సు మెటీరియల్ విషయంలో ప్రమాణాలు పాటించరు. సాధారణంగా దూర ఆన్ లైన్ విద్య కేంద్రాలు ఇంతకు ముందే స్థిర పడిన కళాశాలల్లో ఏర్పటవుతాయి. అయినా లైవ్ టెలి కాన్ఫరెన్సింగ్, వీడియో కాన్ఫరెన్సింగ్, ఆన్ లైన్ చాటింగ్, చర్చలు వంటి సౌకర్యాలు ఎంతమాత్రం ఉండవు.

### ప్రభుత్వ ఉదాసీనత

దూర విద్య విస్తరణకు పరిమితులు ఏవీ లేవు. అనేక వర్ధమాన దేశాలలో ఉన్నత విద్యా సంస్కరణల పట్ల ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. మానవ వనరుల అభివృద్ధి స్వప్నంగానే మిగిలి పోయింది. భారత్‌లో ప్రయివేటు సంస్థలు ఈ దిశగా స్వలాభం చూసుకుంటుండగా, ప్రభుత్వాలు మాత్రం ఉన్నత విద్యపై పెట్టుబడులు పెట్టే బాధ్యత నుంచి తప్పించుకుంటున్నట్టు కనిపిస్తుంది. పైగా ప్రయివేటీకరణ వైపే మొగ్గు చూపడం గమనార్హం. ఉన్నతవిద్య ప్రయివేటు చేతుల్లోకి పోవడంతో పూర్తిస్థాయి విద్యా కార్యక్రమాలు ముందెన్నడూ లేనంత వ్యయభారమయిపోతున్నాయి. దీంతో పూర్తిస్థాయి విద్యా కార్యక్రమంలో చేరడం కంటే ఏదైనా యూనివర్సిటీలోని దూర విద్య, ఆన్ లైన్ కోర్సుల్లో చేరడమే తక్కువ ఖర్చుగా మారింది. సాంకేతిక అభివృద్ధి పుణ్యమా అని ఇప్పుడు నాణ్యమైన విద్య విద్యార్థుల ముంగిట్లోకే అందుబాటులో కొచ్చింది. విజయవంతమైన ఏ దూరవిద్యా కార్యక్రమమయినా విద్యార్థులు, బోధకులు, సహాయ సిబ్బంది, సంస్థ మొదలైన భాగస్వాము లందరి స్థిర, ఐక్యప్రయత్నాలపైనే ఆధారపడి ఉంటుంది.

### దూర విద్యా కోర్సుల నిర్వహణకు అవసరమైన సామర్థ్యాలు :

విద్యార్థుల శక్తి యుక్తులపై అవగాహనా, సాఫ్ట్‌వేర్‌పై అవగాహనా, నమకాలీన నంస్థాగత రూప కల్పన సూత్రాలు, బోధనా సమాచార ఆకర్షణీయ ముద్రను సహా విస్తృతమైన నైపుణ్యాలు అవసరం. ఓ డి ఎల్ కోర్సుల నిర్వహణకు అవనరమైన కీలకమైన నైపుణ్యాలు సామర్థ్యాలు గుర్తించడానికి థక్ అండ్ మర్ఫీ సంస్థ అమెరికా, కెనడా లలో 103 మంది దూర విద్యా రంగ నిపుణులతో సర్వే నిర్వహించింది. అవసరమైన నైపుణ్యాలకు : 1. వ్యక్తుల మధ్య కమ్యూనికేషన్, 2. ప్రణాళిక, సహకారం, సమిష్టి కృషి, 3. ఆంగ్ల భాష ప్రావీణ్యం, రాత నైపుణ్యం, 4. పాలనాపరంగా మద్దతుసేవలు, 5. అభిప్రాయాల సేకరణ నైపుణ్యం 6. కనీస పరిజ్ఞానం, దూరవిద్య, సాంకేతిక పరిజ్ఞానం పై అవగాహనా – అవసరమని ఈ సంస్థ వెల్లడించింది.

పారిశ్రామిక యాజమాన్యం ఒక ప్రత్యేక తరహా కోర్సు వనరులు, నిధులు, సంస్థ యాజమాన్య సామర్థ్యాలను గరిష్టంగా వినియోగించుకోగల నైపుణ్యాలను ఈ కోర్సు విద్యార్థులకు అందచేస్తుంది. మార్కెటింగ్, మేనేజ్మెంట్ నైపుణ్యాలు కూడా ఈ కోర్సుల ద్వారా లభిస్తాయి. సార్వత్రిక, దూర విద్యా విధానం ద్వారా ఈ నైపుణ్యాలను విద్యార్థులకు బోధించడంలో సవాళ్ళు తప్పవు. దూర విద్యా, వృత్తి నిపుణుడికి నిశిత దృష్టి పరిశ్రమల నిర్వహణ యాజమాన్యంలో విషయ పరిజ్ఞానం తప్పనిసరి.

### పరిశ్రమ నిర్వహణలో దూరవిద్యకు అవసరాలు, అవకాశాలు:

భారతదేశంలో పారిశ్రామిక యాజమాన్యానికి నంబంధించి దూరవిద్యా కోర్సులకు స్పందన తక్కువే. ఈ తరహా కోర్సులను అందిస్తున్న యూనివర్సిటీలు, సంస్థలు నాణ్యతా ప్రమాణాలపై మరింత దృష్టి పెట్టవలసి ఉంది. మెరుగైన పారిశ్రామిక యాజమాన్య దూరవిద్యా పరంగా కొన్ని అవసరాలు, అవకాశాలు జనాభా; సాధారణ విద్యా విధానాలు, మధ్య తరగతి అంచనాలను, ఆకాంక్షలను తీర్చే పరిస్థితి లేదు. ప్రజలను విద్యా వంతులను చేయడానికి మూక్స్ వంటి వినూత్న, విస్తృత విద్యా వ్యవస్థ అవసరం. నైపుణ్యం లేని, నైపుణ్యం తక్కువగా ఉన్న కార్మికులను నైపుణ్యం కలిగిన కార్మికులుగా తీర్చిదిద్దాలి. వీరిని అసంఘటిత రంగంలో నుంచి సంఘటిత రంగంలోనికి తీసుకు రావాలి. గౌరవ ప్రదమైన ఉపాధి కల్పన, తక్కువ ఖర్చుతో కూడిన పారిశ్రామిక యాజమాన్య విద్య ద్వారానే సాధ్యమవు తుంది.

సులభతరం; స్వీయ నిబంధనలకు లోబడి పనిచేసే ఓ డి ఎల్ విద్యార్థులకు విషయ పరిజ్ఞాన బోధనను సులభతరం చేస్తుంది. ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ద్వారా ప్రజా బహుళ్య విద్య సాధ్యమవుతుంది. ఇంటర్‌నెట్ ద్వారా

దూరవిద్య– వ్యాపారాలలో ఉన్నవారు తమ నైపుణ్యాలను నవీకరించుకోడానికి, వ్యాపార నిర్వహణలో కొత్త పోకడలను అన్వయింప చేసుకోడానికి ఎంతగానో ఉపకరిస్తుంది.

**యువతకు విద్య :**

జనాభాలో 28 శాతం యువతను కలిగిన భారత్‌లో నిరుద్యోగ సమస్యలను విస్మరించి వదిలివేయడం వీలుకాదు. గౌరవప్రదమైన ఉద్యోగావకాశాలు కొరవడ డంతో యువత తప్పనిసరిగా స్వయంఉపాధి వైపు, తక్కువ వేతనాలు లభించే ఉద్యోగాలకు వెళ్ళవలసిన దుస్థితి ఉందని 'భారత్ లో యువత నిరుద్యోగం' అనే వ్యాసంలో రచయితలు సంఘ, శ్రీజ (ఫిబ్రవరి 2014) పేర్కొన్నారు. మెరుగైన ఉపాధి అవకాశాల కోసం విద్య శిక్షణ అలవారచుకోవాలనే బలమైన ఆకాంక్ష ఈ కాలం యువతలో ముఖ్యంగా మహిళల్లో కనబడుతుంది.

సుశిక్షిత సిబ్బంది భారతీయ పరిశ్రమలు సిబ్బంది సమస్యలతో ఇబ్బంది పడుతున్నాయి. దురదృష్టవశాత్తూ, మన పట్టభద్రులలో అధిక శాతం మందికి ఉద్యోగాలు లేవు. అలాగే వారికి కనీస నైపుణ్యాలు కూడా లేవు. పారిశ్రామిక యాజమాన్య విద్యలో సార్వత్రిక, దూరవిద్య ఈ నిరుద్యోగ, నైపుణ్యం లేని యువతను వినూత్న, విజయవంతమైన పారిశ్రామిక వేత్తలుగా తీర్చి దిద్దుతుందనడంలో సందేహం లేదు.

ప్రదేశం, సమయ పరిమితులు, ప్రతి విద్యార్థి సాధారణ విశ్వవిద్యాలయంలో రెగ్యులర్ కోర్సులో నమోదు కావడం ఆర్థిక పరంగా కష్టం కావచ్చు. మరి కొందరికి అంత సమయం వెచ్చించే అవకాశం లేకపోవచ్చు. విద్యార్థులు ఉపాధ్యాయుల మధ్య టైం విషయంలోను, స్థలం విషయంలోను సర్దుబాటు కుదరకపోవచ్చు. అయితే పారిశ్రామిక నాయకత్వ శిక్షణ లో సార్వత్రిక, దూర విద్యా విధానం ద్వారా ఈ అడ్డంకులను, పరిమితులను సునాయాసంగా అధిగమించవచ్చు. పనులు చేసుకునేవారు కుడా తమ ఉద్యోగాలకు అంతరాయం కలగకుండా ఓ డి ఎల్ ద్వారా ఈ కోర్సులు నేర్చుకొని విజయవంతంగా పూర్తిచేయవచ్చు.

అర్హతలు మెరుగు పరచుకోవడానికి, పదోన్నతికి అవకాశం, పారిశ్రామిక యాజమాన్యం, నిర్వహణ వంటి కోర్సులకు సంబంధించిన దూరవిద్యా వేదికలు ఉద్యోగాలు ఇతర పనులలో ఉన్నవారికి అదనపు నైపుణ్యాలను విజ్ఞానాన్ని అందిస్తాయి. ఈ అదనపు అర్హతలతో వారు తాము చేసే ఉద్యోగాలలో అవకాశాలు మెరుగు పరచు కోవచ్చు. ఉత్పాదకతను పెంచి ఉన్నత స్థానాన్ని అందుకోవచ్చు.

పదవీవిరమణ తరవాత కూడా విద్య, సంస్థలను పరిశ్రమలను సొంతంగా నడిపించగల సామర్థ్యాన్ని అందించే దూర విద్యా కోర్సుల్లో మరో ప్రధాన అంశం – రిటైరైన వారు తమ పొదుపు మొత్తాలను పారిశ్రామిక ప్రాజెక్ట్‌లలో పెట్టుబడులు పెట్టగాలిగేలా లేదా తము భాగస్వాము లయ్యేలా సాధికారత కల్పించడం. తద్వారా ఈ కోర్సులు వారికి పదవీ విరమణ అనంతరం కూడా భద్రతలను కల్పిస్తాయి.

**సూక్ష్మ పారిశ్రామిక నాయకత్వం :**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలాయానికి చెందిన చంద్రయ్య నిర్వహించిన అధ్యయనం ప్రకారం చిన్నతరహ పరిశ్రమలలో భాగస్వాములయిన స్వయం సహాయ సంఘాల మహిళల్లో 90 శాతం పైగా మందికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఏర్పాటు చేసిన గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అందించే శిక్షణ, ఇతర సేవల గురించి ఎంత ప్రయోజనమో తెలియదుట. అందుచేత ఈ చిన్న తరహా పరిశ్రమల నిరక్షరాస్య మహిళలకు సహాయకారిగా ఉండెందుకు సూక్ష్మ పారిశ్రామిక నాయకత్వంలో ఒక సర్టిఫికెట్ కోర్సుకు రూప కల్పన చేసారు. దీని ద్వారా వారు తమ వ్యాపార నిర్వహణకు బ్యాంకుల ద్వారా సూక్ష్మ ఆర్థిక సేవలు వినియోగించుకో గలుగుతారు.

**అసంఘటిత రంగ వ్యవస్థీకరణ:**

భారత దేశంలో అసంఘటిత, అవ్యవస్థీకృత కార్మిక మార్కెట్‌ను విశ్లేషించిన శ్రీజ, షక్ కొన్ని సిఫార్సులను చేసారు. అసంఘటిత ఉపాధి రంగాలలో క్రమంగా మార్పుకు దోహదపడి వ్యవస్థీకృత సంస్కృతికి దారి తీసే వాతావరణాన్ని వారు సూచించారు. చిన్నతరహా వ్యాపారాలు ఆరోగ్యకరమైన వాతావరణలో తమ వ్యాపారాలను వృద్ధి చేసుకోడానికి దోహదపడే ఉన్నత ప్రమాణాలు కలిగిన వ్యాపార నిర్వహణ కోర్సును రూపొందించాలని వారు అభిప్రాయపడ్డారు.

**సమ్మిళిత కార్యాచరణ – పారిశ్రామిక యాజమాన్యంలో ఆన్‌లైన్ విద్యా కార్యక్రమం:–**

దేశంలో ప్రధానంగా నిరుద్యోగ సమస్యను పరిష్కరించే దిశగా పెద్ద ఎత్తున ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను సృష్టించి శిక్షణ ఇవ్వాలని అహ్మదాబాద్‌లోని ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ జర్మనీకి చెందిన ఫ్రెడ్రిచ్ నామన్ ఫౌండేషన్‌తో సహకార ఒప్పందం చేసుకుంది. వివిధ భౌగోళిక ప్రాంతాలకు చెందిన విద్యార్థుల అవసరాలు తీర్చే విధంగా ఈ కార్యక్రమాన్ని ఓ డి ఎల్ మార్గంలో చేపట్టారు. ఈ సమ్మిళిత కార్యాచరణలో భాగంగా నైపుణ్యాభివృద్ధి, విజ్ఞానం పెంపు, కౌన్సిలింగ్, నిమిత్తం రెండు కాంటాక్ట్ సెషన్స్‌ను ఇడిఐఐ ఫ్యాకల్టీలు నిర్వహిస్తారు. విద్యార్థులకు కోర్సు ఉపకరణాల పంపిణీ, అసెస్మెంట్‌లు, వారి ప్రతిభపై తనిఖీ కోసం వెబ్ ఆధారిత సాఫ్ట్‌వేర్‌ను ఏర్పాటు చేశారు.

ఈ మూడంచెల కార్యాచరణలో సార్వత్రిక విద్యా వేదికలు సంస్థాగత వనరులు, సౌకర్యాలు ద్వారా విద్యార్థులకు గరిష్ట ప్రయోజనం కల్పించడం ప్రధాన ఉద్దేశ్యం. భాగస్తుల వ్యవస్థను పెంచి, విద్యార్థులకు సేవలు మెరుగు పరచడంతో పాటు అందుబాటులో ఉన్న సౌకర్యాల సమర్ధ వినియోగానికి, విశ్వవిద్యాలయాల పరిధిలో కళాశాలల మధ్య సమన్వయానికి దూరవిద్య దోహద పడుతుందని ఇ డి ఐ ఐ , ఎడ్జ్, లాగరింగ్ పాయింట్స్ వంటి సంస్థలు అభిప్రాయపడ్డాయి.

**ముందున్న మార్గం :**

a) ఉపాధి ఆధారితం : విద్య అనేది ఏ విధమైనదైనా అది పెట్టుబడే అని అన్ని మానవాభివృద్ధి నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. భారత్‌తో సహా దక్షిణాసియా దేశాల విషయంలో ఇది వాస్తవం. ఈ దేశాల్లో ఉన్నత విద్యలో చేరే వారి శాతం ఇప్పటికీ చాల తక్కువగా ఉంది. ఉన్నత విద్య అభ్యసించవలసిన వయసు వారిలో కనీసం 10 శతం మంది కుడా దానిని వినియోగించు కోవడంలేదు. పరిశీలన ద్వారా కూడా ఈ సంస్థ నుంచి వచ్చిన చాల మంది విద్యార్థులు నిరుద్యోగులుగా మిగిలిపోతు న్నారని మనం చెప్పగలం. అందుచేత విద్యను అందించడం లోనే సమస్య ఉంది. చదివిన చదువుకు, చేసే ఉద్యోగం లేదా వృత్తికి మధ్య పొంతన లేకపోవడం. అందుచేత **విద్యకు, ఉపాధికి మధ్య అర్ధవంతమైన సంబంధం ఉండేలా కొంత మేరకైన ఉపాధి అవకాశాలు లభించేలా పారిశ్రామిక నాయకత్వ శిక్షణ/ స్వయం ఉపాధి/ వృత్తి విద్య దిశగా కార్యాచరణ అవసరం.**

b) పరోక్షం – వాస్తవం, వ్యక్తితో సంబంధం లేకుండా వెబ్ ఆధారంగా అందించే విద్యకు, వ్యక్తితో నేరుగా సంబంధం కలిగి అందించే విద్యకు మధ్య సమతూకం అవసరం. దూర విద్యా విధానం ద్వారా ఆన్‌లైన్ మానేజ్మెంట్ స్టడీస్‌పై ఒక అధ్యయనంలో – విద్యార్థులు పాఠ్యాంశ సందేహాలు తీర్చుకోవడానికి, ఫ్యాకల్టీతో వ్యక్తిగత సంబందాలు కలిగి ఉండడానికి, పూర్తిగా తరగతి గది అనుభవం పొందడానికి సుముఖత చూపారు.

c) విశ్వసనీయత, ప్రామాణికత, సార్వత్రిక, దూర విద్యావిధానంలో తప్పించు కోలేని సవాళ్ళను ఎదుర్కోడానికి యజమన్యాలలో విశ్వసనీయత, విద్యార్థుల మధ్య ప్రామాణికత అవసరం. ఓ డి ఎల్ ద్వారా పారిశ్రామిక యాజమాన్య విద్య రెగ్యులర్ కోర్సులకు సులభమైన ప్రత్యామ్నాయం కావడం చేత అటు వంటి శిక్షణ తప్పనిసరిగా విశ్వసనీయత కలిగి ఉండాలి. ఓ డి ఎల్ ద్వారా పారిశ్రామిక నాయకత్వం శిక్షణ అందించే సంస్థలు సంప్రదాయ కోర్సులతో సమానంగా సుసంపన్నం అయిన విశ్వసనీయమైన కోర్సులను అందించాలి. అసెస్మెంట్ పారదర్శకంగా ఉండాలి. కమ్యూనికేషన్ సమర్ధవంతంగా ఉండాలి. పాఠ్యప్రణాళికలోని ప్రతి అంశాన్ని పటిష్టంగా అమలు పరచాలి. విద్యార్థులకు మెరుగైన మద్దతు సేవలు అందించాలి. విద్యార్థులు, ఫ్యాకల్టీలు, కోర్సుతో సంబంధం ఉన్న విద్యా విషయక సిబ్బంది మొదలైన భాగ స్వాములందరి నిరంతర స్పందన అభిప్రాయ సేకరణ ద్వారా మాత్రమే దూర విద్యా విధానం ద్వారా పారిశ్రామిక నాయకత్వ శిక్షణలో సుస్థిరత, నాణ్యత సాధించగలుగుతాం!

**ముగింపు :**

వేగవంత మైన కార్పోరేట్ వాతావరణంలో ఉద్యోగాల్లో ఉన్న ప్రజలు తమ నైపుణ్యాలను నవీకరించు కోవాలని భావిస్తారు. కనుక సార్వత్రిక, దూరవిద్యా వేదిక ద్వారా పారిశ్రామిక విద్య, శిక్షణ పై పెట్టుబడి పెట్టవలసిన అవసరం ఉంది. భారత్ గనుక రానున్న దశాబ్దాలలో తన మానవ వనరుల నుంచి ప్రగతి ఫలాలు అందుకోవాలని ఆశిస్తే – అందుకు యువత లోని పారిశ్రామిక నాయకత్వ శక్తి సామర్థ్యాలను వెలికి తీయడం పై దృష్టి పెట్టడం అవసరం. విద్య, ఉపాధి అవకాశాలను కల్పించే పారిశ్రామిక విద్య, శిక్షణ కార్యక్రమాలు దూర విద్యా విధానంలో అనేకమున్నాయి. అయితే ఇది విజయవంతం కావాలంటే ఈ కోర్సులను అందిస్తున్న సంస్థలు పాఠ్య ప్రణాళిక రూప కల్పనా, బోధనా, విషయ సమాచారం ఇతర మద్దతు సేవలను అందించడం లో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలను పాటించడం తప్పనిసరి. ■

---

**ప్రచురణల విభాగం వారి హోమ్ లైబ్రరీ పథకం:**
**పుస్తకప్రియులకు శుభవార్త:**

మా ప్రచురణల విభాగం అమలు చేస్తున్న హోమ్ లైబ్రరీ పథకం పథక సభ్యులకు వందరూపాయలపై బడిన పుస్తక కొనుగోలుపై 20 శాతం ముదరా ఇస్తారు. పోస్టేజి ఉచితం. సభ్యులకు ఉచితంగా మా ప్రచురణల కేటలాగును కూడ అందచేస్తాం. ఒక వ్యాపార సంవత్సరంలో డిస్కౌంటుతో రూ. 500/– లకన్నా అధిక విలువ గలిగిన పుస్తకాలు కొంటే, రూ. 25/ల విలువైన పత్రికలను ఉచితంగా అందిస్తాము. అవకాశాన్ని పుస్తక ప్రియులు సద్వినియోగం చేసుకో గలరు.

–సీనియర్ ఎడిటర్.

**సాధికారత**

**జూన్ 21, అంతర్జాతీయ యోగ దినోత్సవం**

# యువతరం సాధికారత... యోగా

– డా॥ ఈశ్వర్ వి.బసవారెడ్డి



**జీవన నాణ్యతను మెరుగుపరచడమే యువత సాధికారత లక్ష్యం. సంబంధిత కార్యక్రమాలలో పాలుపంచుకోవడంద్వారానే యువతరం సాధికారత సాకారం సాధ్యం. యువత అభివృద్ధికి, సాధికారతకూ వ్యత్యాసం ఉంది. అభివృద్ధి అన్నది వ్యక్తుల వికాసానికి ప్రాధాన్యమిస్తే... సాధికారత అన్నది యువతలో, సమాజాల్లో స్వేచ్ఛావర్తన, స్వీయ నిర్ణయాధికార స్థాయిని మెరుగుపరచుకునే చర్యలకు సంబంధించినది.**

బాలలు, యువజనం తమ జీవితాలను తామే తీర్చిదిద్దుకునే విధంగా ప్రోత్సహించే ప్రక్రియే యువతరం సాధికారత. తామున్న పరిస్థితిని చక్కబరచుకోవడం ద్వారా వారు ఈ ప్రక్రియను అనుసరిస్తారు. అటుపైన వనరుల లభ్యతను మెరుగుపరచుకునేందుకు ఉపక్రమించి తమ నమ్మకాలు, విలువలు, దృక్పథాల తోడ్పాటుతో పరివర్తన చెంది చైతన్యవంతులవుతారు. జీవన నాణ్యతను మెరుగుపరచడమే యువత సాధికారత లక్ష్యం. సంబంధిత కార్యక్రమాలలో పాలుపంచుకోవడంద్వారానే యువతరం సాధికారత సాకారం సాధ్యం. యువత అభివృద్ధికి, సాధికారతకూ వ్యత్యాసం ఉంది. అభివృద్ధి అన్నది వ్యక్తుల వికాసానికి ప్రాధాన్యమిస్తే... సాధికారత అన్నది యువతలో, సమాజాల్లో స్వేచ్ఛావర్తన, స్వీయ నిర్ణయాధికార స్థాయిని మెరుగుపరచుకునే చర్యలకు సంబంధించినది. ఆ మేరకు వారు బాధ్యతాయుత, స్వీయ నిర్ణయ మార్గంలో తమదైన సాధికారిక శైలిలో తమ ఆసక్తులకు ప్రాతినిధ్యం వహించేలా చేస్తుంది. యువత సాధికారత సిద్ధాంతాన్ని 'వ్యక్తిగత సాధికారత, వ్యవస్థాగత సాధికారత, సామాజిక సాధికారత' పేరిట మరో మూడు విభాగాలుగా వర్గీకరించవచ్చు:

1. వ్యక్తిగత సాధికారత: యువత లేదా యుక్త వయస్కులు స్వీయ నియంత్రణ సాధన, సామర్థ్యం మెరుగు కోసం నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటున్నారు. అదే సమయంలో సంస్థల, సమాజాల అభివృద్ధికి సమర్థంగా సహకరించే దిశగా విమర్శనాత్మక అవగాహనను పెంచుకుంటున్నారు.
2. వ్యవస్థాగత సాధికారత: యువత లేదా యుక్త వయస్కులు తమ జీవితాలపై నియంత్రణ సాధించేలా వారి నైపుణ్యాభివృద్ధికి అవకాశం కల్పించడంతో పాటు తద్వారా లబ్ధి పొందే సంస్థలు... వారు సేవలందించేందుకు ప్రత్యామ్నాయాలను కూడా చూపుతాయి. ఆ విధంగా అభివృద్ధి చెందే సంస్థలు విధాన నిర్ణయాలను ప్రభావితం చేయగలుగుతాయి.
3. సామాజిక సాధికారత: సమాజాన్ని మెరుగుపరిచే ప్రయత్నాలు, జీవన నాణ్యతకు ఎదురయ్యే ముప్పులపై స్పందనతోపాటు స్థానిక, రాష్ట్ర, జాతీయ స్థాయులలో పౌర భాగస్వామ్యానికి వీలు కల్పించడం.

డైరెక్టర్, మొరార్జీ దేశాయ్ జాతీయ యోగా సంస్థ, న్యూఢిల్లీ.
E-mail: ibasavaraddi@yahoo.co.in

### యువతను బాధించే సాధారణ ఆరోగ్య సమస్యలు:

వ్యక్తిగత అంశాలు, పర్యావరణ ప్రభావాలు, జీవనశైలి మార్పుల కారణంగా ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపే పరిస్థితులకు యువజనం లోనవుతున్నట్లు అందుబాటులో ఉన్న ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి. అంతేగాక సాంక్రమిక, అసాంక్రమిక రుగ్మతలు, గాయాలు వీటికి తోడవుతున్నాయి. సామాజికంగా, ఆర్థికంగానేగాక మానసికపరమైన సమస్యలను కూడా యువత ఎదుర్కొంటోంది. స్నేహ బంధాలకు లోబడి లేదా బాధాకరమైన ఒంటరితనం ఫలితంగా మద్యం, మాదకద్రవ్యాల వాడకంవైపు వారు పురిగొల్పబడుతున్నారు. సహచరుల ఒత్తిడి, కుటుంబ బాధ్యతలు, పనిభారం వంటివి మరికొన్ని ప్రధాన సమస్యలు. ఈ పరిస్థితుల నడుమ సరైన సలహా/సంరక్షణ అందుబాటులో లేక/లభించక యువజనం జీవితాన్ని అంతం చేసుకునేందుకు యత్నిస్తున్నారు.

### యువత సాధికారత కోసం యోగా:

ఆసనాలు, ప్రాణాయామం ప్రత్యేకించి శారీరక, మానసిక ఆరోగ్యానికి తోడ్పడతాయి. శరీర దృఢత్వాన్ని మెరుగుపరచి, శరీరంలోని నుంచి విష పదార్థాలను బయటకు నెట్టివేస్తాయి. శరీరం, మనసు విశ్రాంతి పొందుతాయి. ఒత్తిడి తగ్గడంతో పాటు సహవేదన నాడీమండలం, అసంకల్పిత చర్యల నాడీమండలం మధ్య సమతూకం ఏర్పరుస్తాయి. తద్వారా రకరకాల అసాంక్రమిక వ్యాధులను నిరోధిస్తాయి. ఆసనాలు, ప్రాణాయామం మనకు కింది విధంగా మేలుచేస్తాయి:

- ఒత్తిడి – ఆందోళనలను తగ్గిస్తుంది.
- సానుకూల శక్తి, మానసిక ఉత్తేజం కలిగిస్తుంది.
- రక్తపోటు సాధారణ స్థితికి చేరేలా దోహదపడుతుంది.
- ఉదరంలోని పరినర కండరాల మర్దనద్వారా మందకొడి జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది.
- ప్రశాంతత, శ్రేయోజీవన భావనలను పెంచుతుంది.



- ఒత్తిడి ప్రతిస్పందనను యథాస్థితికి చేర్చి దీర్ఘకాలిక ఒత్తిడి ప్రభావాలనుంచి రక్షణ కవచం ఏర్పరుస్తుంది.
- హృదయస్పందన, శ్వాస వేగాన్ని తగ్గించి రక్తపోటును సరిదిద్దుతుంది.
- ప్రాణవాయు వినియోగ సామర్థ్యాన్ని ఇనుమడింపజేస్తుంది.
- అడ్రినల్ గ్రంథులు ఉద్రేక కారక రసాయనం కార్టిజాల్ విడుదలను తగ్గిస్తాయి.
- రోగనిరోధక వ్యవస్థ పనితీరు మెరుగవుతుంది.

### ఒత్తిడికి విరుగుడు యోగా:

ఒత్తిడి ఫలితంగా అసంకల్పిత చర్యల నాడీమండలం చురుగ్గా పనిచేస్తే సంవేదన నాడీమండలం పనితీరు మందగిస్తుంది. పర్యవసానంగా స్వతంత్ర నాడీమండల వ్యవస్థలో అసమతౌల్యం ఏర్పడుతుంది. ఒక పరిస్థితిని గుర్తించడం, దానితో వ్యవహరించడంలో కనబరిచే సామర్థ్యం మధ్య సమతూకం లేనపుడు ఒత్తిడి అనుభవంలోకి వస్తుంది. బయటి పరిస్థితిపై వ్యక్తి మానసిక లేదా ఉద్వేగపూరిత స్పందన కూడా ఇందులో భాగమే. ఇలా ఒక వ్యక్తి నిరంతరం వాస్తవ లేదా అనుభవపూర్వక ఒత్తిడికి లోనవుతుంటే అతని లేదా ఆమె నాడీమండల వ్యవస్థ అవసరానికి మించి సంవేదన స్థితివైపు మళ్లిపోవచ్చు. ఈ స్థితిలో సంవేదన నాడీమండల వ్యవస్థ వాస్తవ కార్యాచరణ వేగం తగ్గి ఎపినెఫ్రిన్ హార్మోన్ విడుదల మందగిస్తుంది... కానీ, కార్టికోస్టిరాయిడ్ హార్మోన్ సాధారణ స్థాయికి మించి చురుకందుకుంటుంది. ఈ స్థితికి చేరుకున్న వ్యక్తులు తాము ఒత్తిడితో సతమతమవుతున్నట్లు గుర్తించలేరు. అయితే, యోగాభ్యాసం సంవేదన నాడీమండల వ్యవస్థను ఉత్తేజితం చేసి స్వతంత్ర నాడీమండల వ్యవస్థ ఆరోగ్యకర సమతూకపు స్థితికి వచ్చేలా చేస్తుంది. మన శరీరం లేదా మనసు సానుకూల లేదా ప్రతికూల పరిస్థితులు లేదా ఒత్తిడి ఎదురైనప్పుడు సంవేదన నాడీమండల వ్యవస్థ లేదా మన "అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థ" క్రియాత్మకం అవుతుంది. ఇటువంటి 'పలాయన లేదా ప్రతిఘటన' స్పందన ఫలితంగా రక్తనాళాలు సంకోచించి వ్యక్తి మనుగడ దిశగా శరీరంలోని చివరి భాగాలకు, జీర్ణ వ్యవస్థకు రక్త ప్రసరణ తగ్గుతుంది. ఇక హైపోథాలమస్–పిట్యూటరీ–అడ్రినల్ అక్షం (HPA), సంవేదన నాడీమండల వ్యవస్థలను దిగువస్థాయికి నియంత్రించడంద్వారా శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగాభ్యాసం తోడ్పడుతుందని కూడా కనుగొనబడింది. యోగాభ్యాసంతో మనసును లోతుగా తేలికపరచుకోవడం, కుదుటపడేలా చేయాలి. తద్వారా ఒత్తిడిలో ఉన్నపుడు విడుదలయ్యే కార్టిజాల్, అసిటిల్–కోలిన్ వంటి వాటి విడుదల తగ్గుతుంది. వీటన్నిటి పర్యవసానంగా రక్తపోటు, నాడీవేగం, శ్వాసవేగాలను ప్రభావవంతంగా తగ్గించుకోవడం సాధ్యమవుతుంది. దీనివల్ల మనశ్శరీర సంబంధ సమస్యలు ప్రేరేపించే మానసిక వైరుధ్యాలు, అణచివేత, తీవ్ర సున్నితత్వం వంటివి కూడా తగ్గుతాయి. అలాగే యోగాభ్యాసం వల్ల మెలటోనిన్ హార్మోన్ స్థాయి పెరగడంతోపాటు మానసిక,


హృదయ, శ్వాస ప్రక్రియలు మెరుగు పడతాయని రుజువైంది.

### వ్యసన విముక్తికి యోగా:

వ్యసన విముక్తి చికిత్స విధానంలో వ్యక్తి సమగ్రత సాధనకు (శరీరం, మనసు, ఆత్మ) యోగాభ్యాసం ఒక ముఖ్యమైన అంశం.అది భౌతికంగా శరీరాన్ని బలోపేతం చేస్తుంది... మానసిక ప్రశాంతతనిస్తుంది... శారీరక, ఆత్మానుగత చైతన్యాన్ని పెంచుతుంది... ఉద్రిక్తతను ఉపశమింపజేస్తుంది... సవ్యమైన శ్వాస పద్ధతులను ప్రోత్సహిస్తుంది. శరీర భంగిమలపై అవగాహన కల్పిస్తుంది. అధిగమన నైపుణ్యాన్ని పెంచుతుంది. దృఢసంకల్పం, ఏకాగ్రతలకు ఊతమిస్తుంది. వివిధ భౌతిక కార్య కలాపాలతో కూడిన మానసిక సంపూర్ణత్వ సాధనాభ్యాసం యువతరంలో చైతన్యం తెచ్చి వర్తమాన స్థితికి చేరుస్తాయి. అంతేకాకుండా మనశ్శరీరాల్లోని అవిభాజ్య భావనలలో అవగాహనకు దోహదపడుతుంది. వెనక్కు వంగడం వంటి కొన్ని భంగిమలు శరీరం ముందుభాగాన్ని ప్రస్ఫుటం చేస్తూ నాభిచక్రం ప్రాంతంలో ఏర్పడే అనుభూతులను అనుభవపూర్వకంగా తెలుసుకోవడంలో వ్యక్తికి సహాయపడతాయి.

### ఊబకాయాన్ని తగ్గించే యోగా:

యోగాభ్యాసం ప్రధానంగా సమతుల ఆహారం, సవ్యరీతిలో శ్వాస ప్రక్రియలు, ఆసనాభ్యాసాలతో కూడినది. కొన్ని సందర్భాల్లో ఊబకాయులు కీళ్ల నొప్పులతో బాధపడుతుంటారు. అటువంటప్పుడు కీళ్లపై ఒత్తిడిని తగ్గించి, నొప్పినుంచి ఉపశమనం కల్పించే విధంగా శరీరాకృతిని మెరుగుపరచడంద్వారా కీళ్లు మరింత భారం



భరించగలిగేలా యోగాభ్యాసం తోడ్పడుతుంది. శారీరక శక్తిని, సరళతను యోగా మెరుగుపరుస్తుంది... శరీర సమతౌల్యాన్ని అభివృద్ధి చేస్తుంది... భావనోద్దీపన, శరీర పటుత్వాలు రెండింటినీ మెరుగు పరచడం ద్వారా ఉల్లాస భావన కలిగిస్తుంది. క్రమం తప్పని యోగాసనాలు ఊబకాయులపై భిన్న ప్రభావాలు చూపుతాయి. బరువు తగ్గించుకోవడంలో అనుసరించే ఇతర పద్ధతులతో పోలిస్తే వీటివల్ల శాశ్వత ఫలితాలుంటాయి. ఊబకాయం తగ్గించుకోవడంలో 'సూర్యనమస్కారాలు' అత్యంత కీలకమైన చికిత్స. ఇదొక సంపూర్ణ యోగాభ్యాస ప్రక్రియ. ఇది ప్రధానంగా వినాళ గ్రంథులు, నాడీ వ్యవస్థపై విశిష్ట ప్రభావం చూపుతూ ఊబకాయానికి కారణమైన అసమతౌల్య జీవక్రియలను సరిదిద్దుతుంది. భస్త్రిక, కపాలభాతి, సూర్యభేదన వంటి ప్రాణాయామాల అభ్యాసం ఊబకాయానికి తగిన చికిత్సగా నిపుణులు సూచిస్తున్నారు. శరీర సమతూకం కోసం చేసే ఇతర ఆసనాలతోపాటు వీటిని కూడా చేయడంవల్ల జీవక్రియలలో సమతూకాన్ని అవి ఉత్తేజితం చేస్తాయి.

### యువతరం – అసాంక్రమిక వ్యాధులు:

జీవితంలో చిన్న వయసునే యువ దశగా వ్యవహరిస్తాం. అయితే, బాల్యదశ నుంచి యుక్తవయసు మధ్య కాలాన్ని యువ దశగా పరిగణించాలి. అలాగే "రూపం, నూతనత్వం, శక్తి, ఉత్సాహం"వంటివి ఒక వ్యక్తి యువదశలో ఉన్నట్లు పరిగణించదగిన లక్షణాలుగా నిర్వచించబడింది. అసాంక్రమిక వ్యాధులు వ్యక్తిగత ప్రవర్తన, జీవనశైలి సంబంధిత అనేక స్వభావాలతో ముడిపడి ఉన్నాయి. భారతదేశంలో ప్రజలు ప్రత్యేకించి యువతరంలో ప్రస్తుతం పౌష్టికతపరంగా మార్పు బలహీనంగా ఉంది. ఫలితంగా యుక్తవయసులో సోకే అధిక రక్తపోటు, ఒత్తిడి, మధుమేహం, దీర్ఘకాలిక శ్వాసకోశ రుగ్మత వంటి అసాంక్రమిక వ్యాధుల బారినపడే ప్రమాదం చాలా ఎక్కువగా ఉందని అంచనా.

### అసాంక్రమిక వ్యాధుల నివారణకు యోగా:

అసాంక్రమిక వ్యాధులకు కారణమయ్యే అంశాల్లో నేటి జీవనశైలి ప్రధానమైనది. దీంతోపాటు పొగాకు వినియోగం, ఏకాంతవాసం, క్రమబద్ధ వ్యాయామం లేకపోవడం, అనారోగ్యకర ఆహారపదార్థాలు, దీర్ఘకాలిక మానసిక ఒత్తిడి తదితరాలు జీవితాన్ని మరింత క్లిష్టంగా మారుస్తున్నాయి. దీర్ఘకాలిక శారీరక బాధలు, ఒత్తిడి అనేక అసాంక్రమిక వ్యాధులకు సాధారణ కారకాలవుతున్న ఈ పరిస్థితులలో వాటిని అధిగమించగల అత్యంత ప్రయోజనకరమైన పరిష్కారం యోగాయేనని స్పష్టమైంది. యోగాభ్యాసం, సంపూర్ణ మానసికారోగ్య సాధన పద్ధతులు ఆచరించడంవల్ల శరీరానికి ఎంతో ఉపయుక్తమని ఇటీవలి పరిశోధన అధ్యయనాలు రుజువు చేశాయి. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించి, హృదయ రక్తనాళ వ్యవస్థను ఆరోగ్యకరంగా ఉంచుతాయనీ తేలింది. అంతేకాకుండా యోగాతో చురుకుదనం పెరుగుతుందిగనుక ముఖ్యమైన మానసిక ప్రయోజనాలు కూడా సిద్ధిస్తాయి. వ్యక్తి తనకుతాను తిరిగి సంధానం కావడానికి యోగా దోహదపడుతుంది. వ్యక్తికి ఎలా, ఎందుకు అనారోగ్యం మొదలైందో తెలుసుకోవడానికి, పునాది స్థాయినుంచి శరీరం తిరిగి కోలుకోవడానికి ఏంచేయాలో యోగా బోధపరుస్తుంది. నియంత్రణ, మానసిక ప్రశాంతత పొందడం, ఆత్మానుసంధానం వంటివి వ్యక్తిని వర్తమానంలోకి తిరిగి తీసుకువస్తాయి. అంతిమంగా నేటి తీరిక కొరవడిన ప్రస్తుత ప్రపంచంలో రకరకాల ఒత్తిళ్లు, భారాల నుంచి వ్యక్తి విముక్తం కావడానికి తోడ్పడటంద్వారా అసాంక్రమిక వ్యాధుల నుంచి రక్షణ కవచంగా యోగా నిలుస్తుంది. ■

# రాష్ట్రపతి భవన్‌పై పుస్తక పరంపర

సాధారణ పౌరులకు రాష్ట్రపతి భవన్ గురించి సమగ్రంగా తెలియదు. అది ఒక నివాస సముదాయమే కాక, ఒక ఎస్టేట్ అంటే మరింత సబబుగా ఉంటుంది. జాతి సంస్కృతిలో భాగంగా ఉన్న ఈ అద్భుత నిర్మాణాన్ని గురించిన వివరాలతో ప్రచురణల విభాగం గతమూడు సంవత్సరాలుగా మొత్తం 17 పుస్తకాలను వెలువరించింది. మరో పుస్తకం ప్రచురణలో ఉంది. ఆ మహా భవంతిలోని పూలతోటలు, శిల్పకళ, అతిధిగృహాలు, మరెన్నో అద్భుతాలు ఈ ప్రచురణలలో ఆవిష్కరించబడ్డాయి. దీనితోపాటు, రాష్ట్రపతి ప్రసంగాల సంకలనాలను కూడ నాలుగు సంపుటాలలో ప్రచురణల విభాగం ప్రచురించింది. వివరాలకు, పుస్తకాలు కొనడానికి బిజినెస్ మేనేజర్, ప్రచురణల విభాగం, రూం నెంబరు-204, రెండవ అంతస్తు, సి.జి.ఓ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్-80 వారిని 040-27535383 నెంబరులో సంప్రదించగలరు.



Publishing date 1 June 2017, Posting on 2 - 3 June 2017
Yojana (Telugu) June 2017 RNI Regd. No 37729/80 Regd. No. H/HD-663/2015-17











Printed & Published by Mrs. Sadhana Rout, Director General and Head on behalf of the Publications Division, Ministry of I & B, Govt. of India.
and Printed at Prakhya Art Printers Pvt. Ltd. 1-8-724/A/31, Vegetable Market Street, Nallakunta, Hyderabad - 500 044. E-mail: print@prakhyaarts.com
and Published at Yojana (Telugu), 205, 2nd Floor, C.G.O. Towers, Kavadiguda, Hyderabad - 500 080. Senior Editor: Vijayakumar Vedagiri, Tel: 040-27546314